




www.aksharamtelugudaily.com

RNI NO: TELTEL/2018/75419

# సుఫల అక్షరం

సామాన్యుడి అస్త్రం / తెలుగు దినపత్రిక

SUPHALA AKSHARAM

WEDNUSDAY 27TH MAY 2026 EDITOR : SHAIK YACOOB PASHA PAGES : 12 VOLUME : 09 ISSUE : 70 COST : 3\- KHAMMAM, TELANGANA

బుధవారం 27 మే 2026 ఎడిటర్ : షేక్ యాకూబ్ పాషా పేజీలు : 12 సంపుటి : 09 సంచిక : 70 వెల : రూ.3/- ఖమ్మం, తెలంగాణ

CIRCULATED BY : ADILABAB,, A SIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULABMA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOODNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRICILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI


## దేశవ్యాప్తంగా అజ్ఞాతంలో మరో 47 మంది మావోలు

- తెలుగు రాష్ట్రాలకు చెందిన వారు కేవలం నలుగురే
- పోలీసులకు లొంగిన నరహరి,ధనమ్మ జంటకు చెక్కులు అందచేత
- గణపతి తదితరులు కూడా వెంటనే లొంగిపోవాలి
- డిజిపి సివి ఆనంద్ పిలుపు

➤ 2వ పేజిలో..

# ఇంటింటి సర్వేతో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా

- సర్వే పూర్తయిన ఇళ్లకు ప్రత్యేక లోగో స్టిక్కర్లు
- భట్టి విక్రమార్క అధ్యక్షతన కేబినెట్ సబ్ కమిటీ నిర్ణయం



హైదరాబాద్,మే26 రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా ప్రణాళిక కార్యక్రమం విజయవంతం కావడంతో, దాని ముగింపు వేడుకలను పురస్కరించుకుని జూన్ 2 నుండి 12 వరకు రాష్ట్రవ్యాప్తంగా 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' కార్యక్రమాలను అత్యంత ఘనంగా నిర్వహించాలని కెబినెట్ సబ్ కమిటి అధికారులను ఆదేశించింది. మంగళవారం సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అధ్యక్షతన కేబినెట్ సబ్ కమిటి సమావేశం జరిగింది. ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం లో మంత్రులు ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస రెడ్డిలు పాల్గొన్నారు. గ్రామ సభ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిల్లో ఇప్పటివరకు నిర్వహించిన 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' కార్యక్రమాల ప్రగతిని సమీక్షించిన కేబినెట్ సబ్ కమిటి రాబోయే రోజుల్లో ప్రజా భాగస్వామ్యంతో మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని అధికారులను ఆదేశించింది. ఇందులో భాగంగా జూన్ 2 నుండి 12 వరకు నిర్వాహించాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. ముఖ్యంగా 'పర్యావరణ వారోత్సవం', రోడ్డు భద్రత, మాదక ద్రవ్యాల వ్యతిరేక ప్రచారం, మహిళా-శిశు రక్షణ, గృహ నిర్మాణం, పర్యాటక ప్రోత్సాహం, పట్టణాభివృద్ధి, పునర్వినియోగ శక్తి (గ్రీన్ ఎనర్జీ) ప్రాజెక్టుల అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలను నిర్వహించాలని నిర్దేశర చేశారు. ఎక్కడా ఎలాంటి లోపాలు లేకుండా, అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని మంత్రులు స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి సామాజిక భద్రత కల్పించడమే ధ్యేయంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా' పథకం అమలుపై కేబినెట్ సబ్ కమిటీ సుదీర్ఘంగా చర్చించింది. అర్హులైన ప్రతి ఒక్కరికీ

➤ మిగతా 2వ పేజిలో..



## మహిళల భద్రత, గౌరవానికి ప్రాధాన్యం

- సంపద సృష్టించే శక్తిగా మహిళలకు ప్రోత్సాహం
- సఖి నివాస్ వర్కింగ్ ఉమెన్ హాస్టల్ ప్రారంభించిన సీతక్క

హైదరాబాద్,మే 26 మహిళల భద్రత, వారి గౌరవానికి తమ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని తెలంగాణ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశుసంక్షేమ శాఖ మంత్రి సీతక్క చెప్పారు. మహిళల ఉన్నతే తెలంగాణ ప్రగతి అని మంత్రి సీతక్క వ్యాఖ్యానించారు. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణ పరిమితి పెంచుతున్నట్లు మంత్రి సీతక్క పేర్కొన్నారు. మహిళలను సంపద సృష్టించే శక్తిగా తీర్చిదిద్దుతున్నామని వ్యాఖ్యానించారు. మహిళల ఆదాయం పెరిగితే కుటుంబం బలపడుతుందని పేర్కొన్నారు. మంగళవారం బంజారాహిల్స్‌లో సఖి నివాస్ వర్కింగ్ ఉమెన్ హాస్టల్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మంత్రి సీతక్క హాజరై మాట్లాడారు. జూన్ 5వ తేదీన మహిళలకు సీఎం రేవంత్‌రెడ్డి ఆర్టీసీ బస్సులు అందజేస్తారని తెలిపారు. మహిళా సంఘాల సోలార్ ప్లాంట్లను బుధవారం డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క మధిరలో ప్రారంభిస్తారని పేర్కొన్నారు. వర్కింగ్ ఉమెన్స్ భద్రత తమ ప్రభుత్వ బాధ్యత అని

## యూరియా సరఫరాలో కేంద్రం విఫలం

- యుద్ధ ప్రభావంతోనూ సరఫరాలో అంతరాయం
- రైతులు పంట వ్యర్థాలను తగులబెట్టవద్దు
- మంత్రి తుమ్మల నాగేశ్వర రావు వెల్లడి



హైదరాబాద్,మే26 యూరియా సరఫరా విషయంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మరోమారు ఆరోపించారు. యుద్ధ ప్రభావంతో యూరియా సరఫరాలో అంతరాయం ఏర్పడిందని పేర్కొన్నారు. ఖరీఫ్ సీజన్‌కు ముందే కేంద్రాన్ని పలుమార్లు కోరినా సరఫరా సమస్య కొనసాగుతోందన్నారు. యూరియా సరఫరా పూర్తిగా కేంద్ర ప్రభుత్వ పరిధిలోనే ఉంటుందని చెప్పారు. ఇకపోతే రైతులు పంట వ్యర్థాలను కాల్చకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి తుమ్మల సూచించారు. పంట వ్యర్థాలను తగలబెట్టడం రైతుల భవిష్యత్తుకే ప్రమాదమని ఆయన

## చొరబాటు దారులూ పారిపోండి

- వెళ్లగొట్టక ముందే పారిపోతే మంచిది
- జైల్లో పెట్టి తిండి పెట్టేది లేదు
- బంగ్లాదేశ్ వలసదారులకు సిఎం సువేందు హెచ్చరిక
- సరిహద్దుల వద్దకు చేరుకుంటున్న అక్రమవసలదారులు



కోల్‌కతా,మే26 పశ్చిమబెంగాల్‌లో ఉంటున్న బంగ్లాదేశ్ అక్రమవలసదారులపై చర్యలను సువేందు అధికారి ప్రభుత్వం ముమ్మరం చేసింది. అక్రమవలసదారులను వారి స్వదేశానికి పంపేందుకు చర్యలు తీసుకుంటోంది. ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన విధంగానే బెంగాల్‌లోని అక్రమవలసదారుల పై సువేందు ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. బంగ్లాదేశీయులను వారి స్వదేశానికి పంపేయడానికి చర్యలు తీసుకుంటోంది. ఈ నేపథ్యంలో సీఎం బెంగాల్ సీఎం సువేందు అధికారి చొరబాటుదారులకు తీవ్ర హెచ్చరికలు చేశారు. బెంగాల్ నుంచి వెళ్లగొట్టకముందే పారిపోవాలని సూచించారు. బంగ్లా ప్రజలు స్వచ్ఛందంగా వెళ్లకపోతే.. కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతమున్న విదేశీయుల చట్టానికి లోబడే తాము ఈ చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. 'ప్రభుత్వం చర్యలు తీసుకోకముందే పారిపోండి' అంటూ ముఖ్యమంత్రి తాజాగా హెచ్చరించారు. బంగ్లాదేశ్ అక్రమ వలసదారుల అంశంపై మాట్లాడుతూ, కొత్త చట్టంతో కాకుండా ప్రస్తుతం ఉన్న విదేశీయుల చట్టం కిందే ఈ చర్యలు తీసుకుంటామని చెప్పారు. తక్షణం

➤ మిగతా 2వ పేజిలో..

# యుద్ధం మళ్లీ మొదలు?

- ఇరాన్‌పై దాడులు ప్రారంభించిన అమెరికా.. బందర్ అబ్బాస్ పోర్టు, ఇతర ప్రాంతాల్లో బాంబులు
- ఆత్మరక్షణ కోసమే ముందస్తు దాడులు: అమెరికా క్షిపణి నిల్వ, ప్రయోగ కేంద్రాలు,
- సీమైన్స్ పెట్టే బోట్లు ధ్వంసం చేశామని వెల్లడి
- ప్రతిదాడులకు దిగుతున్నట్టు ఐఆర్‌జీసీ ప్రకటన
- అమెరికా ఎంక్యూ-9 రీపర్ డ్రోన్ కూల్చివేత!
- పశ్చిమాసియాలో స్థావరాలపై ఊహించని స్థాయిలో దాడులు చేస్తామని హెచ్చరిక
- అమెరికా స్థావరాలకు ఏమాత్రం రక్షణ ఉండదు: మొజ్తాబా ఖమేనీ
- ఒమన్ తీరంలో చమురు నౌకలో పేలుళ్లు
- ఖతార్ వేదికగా ఇరాన్-అమెరికా పరోక్ష చర్చలు
- మళ్లీ చమురు ధరలు పైకి.. స్టాక్ మార్కెట్లు డౌన్



- యురేనియం ఇస్తారా.. నాశనం చేస్తారా: ట్రంప్

దుబాయ్/వాషింగ్టన్/న్యూఢిల్లీ, మే 26: పశ్చిమాసియాలో యుద్ధం మళ్లీ మొదలైంది. శాంతి ఒప్పందం కుదిరి, పరిస్థితులు చక్కబడతాయన్న ఆశలు నెలకొన్న సమయంలో పరిస్థితి తిరిగి మొదటికి వచ్చింది. మంగళవారం తెల్లవారుజామున ఇరాన్‌లోని కీలక లక్ష్యాలపై అమెరికా, ఇజ్రాయెల్ దాడులు ప్రారంభించాయి. ఇరాన్ దక్షిణ ప్రాంతంలోని క్షిపణుల నిల్వ, ప్రయోగ కేంద్రాలు, తీర ప్రాంతం వెంట మోహరించి ఉన్న 'సముద్రపు మందుపాతరలు (సీమైన్స్)' పెట్టే నౌకలు, బోట్లు లక్ష్యంగా విమానాలతో బాంబులు కురిపించాయి. ముందుజాగ్రత్త చర్యగా ఆత్మరక్షణ కోసం, ఇరాన్ దళాల నుంచి తమకు పొంచి ఉన్న ముప్పు నుంచి రక్షించుకునేందుకు ఈ దాడులు చేపట్టామని

➤ మిగతా 2వ పేజిలో..

## మజ్లిస్ ఒత్తిడితోనే జిహెచ్ఎంసి విభజన

- నగరంలో మంచినీటి సమస్యను పట్టించుకోని ప్రభుత్వం
- తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్‌రావు ఆరోపణ

➤ 2వ పేజిలో..

## తెలంగాణలో అవినీతి రాజ్యం

- అడ్డంగా దోచుకుంటున్న కాంగ్రెస్
- శంషాబాద్ సమీపంలో180 ఎకరాలు హాంఫట్
- సింగరేణిలో కోట్ల రూపాయాల బొగ్గు మాయం
- కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీష్ రావు సంచలన ఆరోపణలు

హైదరాబాద్,మే26 తెలంగాణలో అవినీతి రాజ్యం నడుస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్ రావు విమర్శించారు. భూముల ఆక్రమణలు, రెవెన్యూలో

➤ మిగతా 2వ పేజిలో..

## దేశంలో అసహజ జనాభా మార్పు

- ఉన్నతస్తాయి కమిటీ ఏర్పాటు
- హోంమంత్రి అమిత్ షా వెల్లడి

➤ 2వ పేజిలో..

# మహిళల భద్రత, గౌరవానికి ప్రాధాన్యం

➢ మొదటి పేజి తరువాయి

తెలిపారు. గ్రామీణ మహిళలకు హైదరాబాద్‌లో సురక్షిత వసతి కల్పిస్తున్నామని చెప్పుకొచ్చారు. సఖి నివాస్‌లో 150 మంది మహిళలకు వసతి సౌకర్యం కల్పిస్తున్నామని వివరించారు. చిన్నపిల్లలతో వచ్చే తల్లులకు ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తున్నామని వెల్లడించారు. రాష్ట్ర అభివృద్ధి మహిళల పురోగతితోనే ముడిపడి ఉందని నమ్మిన ప్రభుత్వం తమదని స్పష్టం చేశారు. మహిళలు కేవలం చిన్న చిన్న వ్యాపారాలకే పరిమితం కాకుండా పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారని గుర్తు చేశారు. ఇందుకోసం మండలాల్లో రైస్ మిల్లులు, గోడౌన్లు, ప్లాస్టిక్ పార్కులు ఏర్పాటు చేసుకోవడానికి ప్రభుత్వం 100 ఎకరాల వరకు ప్రభుత్వ భూములను కేటాయించడానికి సిద్ధంగా ఉందన్నారు. కార్పొరేట్ మార్కెట్ రంగంలోకి మహిళలను తీసుకెళ్లేందుకు 'మహిళా శక్తి సూపర్ బాజార్ల'ను ఏర్పాటు చేయబోతున్నట్లు వెల్లడించారు.

# మజ్లిస్ ఒత్తిడితోనే జిహెచ్ఎంసి విభజన

హైదరాబాద్,మే 26 కేసీఆర్ హయాంలో కూడా డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పేరుతో మోసం చేశారని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్‌రావు ఆరోపించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు పార్టీలు కూడా హైదరాబాద్‌లోని పేద ప్రజలకు అన్యాయం చేస్తున్నాయని విమర్శించారు. మజ్లిస్ ఒత్తిడితో హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌ను మూడు ముక్కలు చేశారని రామచందర్‌రావు దుయ్యబట్టారు. హైదరాబాద్‌లో డివిజన్ల ఏర్పాటుపై ఇప్పటికీ అధికారులకు ఒక క్లారిటీ లేదని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్లపేరుతో ఇప్పుడు కాంగ్రెస్ సర్కార్ మోసం చేస్తోందని మతీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి సర్కార్ ప్రజలను ప్రలోభాలకు గురి చేస్తోందని ధ్వజమెత్తారు. మంగళవారం కూకట్‌పల్లి బీజేపీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామచందర్‌రావు మాట్లాడారు. హైదరాబాద్ నగరంలో ప్రజలు నీటి సమస్యను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రజలకు నీటి సరఫరా విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం చెందిందని మండిపడ్డారు. ప్రజాసమస్యలను కాంగ్రెస్ నేతలు పక్కదారి పట్టిస్తున్నారని ఫైర్ అయ్యారు. కాంగ్రెస్‌కు మజ్లిస్ ముఖ్యం కానీ, హైదరాబాద్ ప్రజలు ముఖ్యం కాదని చెప్పుకొచ్చారు. భాగ్యనగరంలో కాలుష్య నియంత్రణలో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం చెందిందని విమర్శించారు. కేసీఆర్ హయాంలో రియల్ ఎస్టేట్ పేరుతో జేబులు నింపుకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రియల్ ఎస్టేట్ రంగం కుదేలయ్యిందని అన్నారు. భాగ్యనగరంలో చిన్న వాన పడితే.. నగరం మునిగిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. భాగ్యనగరాన్ని విశ్వనగరంగా బీజేపీ మాత్రమే మార్చగలదని వ్యాఖ్యానించారు. రానున్న మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో మజ్లిస్, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు ప్రజలు బుద్ధి చెప్పాలని హెచ్చరించారు. తెలంగాణలో అవినీతి రహితమైన పరిపాలనను బీజేపీ మాత్రమే అందిస్తుందని రామచందర్‌రావు పేర్కొన్నారు.

## తెలంగాణలో అవినీతి రాజ్యం

➢ మొదటి పేజి తరువాయి

వేలకోట్ల స్కామ్‌లు, సింగరేణిలో బొగ్గు స్మకమా÷--÷--లు జరుగుతున్నాయని అన్నారు. అడ్డంగా దోచుకుంటున్నారని కాంగ్రెస్‌పై ఆయన విరుచుకు పడ్డారు. శంషాబాద్ సమీపంలోని 180 ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్ రావు విమర్శించారు. ఈ స్కాంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సన్నిహితుడి పాత్ర ఉందని ఆరోపించారు. ఈ వ్యవహారంపై సిట్, సీఐడీ విచారణ జరపాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో హరీష్ రావు మాట్లాడుతూ.. ప్రైవేట్ వ్యక్తికి సదరు భూమి అప్ప జెప్పి.. తప్పు చేసిన ఎమ్మార్వోను బదిలీతో సరిపెట్టారన్నారు. ఈ వ్యవహారానికి సంబంధించి తహసీల్దారును వెంటనే డిస్మిస్ చేయాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ స్కాం వెనుక సీసీఎల్ఏ ఉన్నాడా? కలెక్టర్ ఉన్నాడా? అంటూ హరీష్ రావు సందేహం వ్యక్తం చేశారు. ఈ భూమి ప్రభుత్వానిదని ఆర్డీవో చెబుతున్నారని చెప్పారు. పై అధికారి చెప్పినా వినకుండా.. ఎమ్మార్వో మాత్రం ఇది ప్రైవేట్ భూమి అంటున్నారని హరీష్ రావు వివరించారు. ముఖ్యమంత్రికి సన్నిహితుల నుంచి ఒత్తిడి ఉన్నందునే తహసీల్దారును బదిలీ చేసి కాపాడుతున్నారని ఆరోపించారు. సీఎం సన్నిహితుల ఒత్తిడితోనే.. ఎమ్మార్వోపై చర్యలు తీసుకోకుండా ఏసీబీ అధికారులు వెనక్కి వచ్చారని ఆరోపించారు. సింగరేణిలో రూ.16 వందల కోట్ల విలువైన బొగ్గు మాయమైందని ఆందోళన వ్యక్తం చేశారు. టన్నుల బొగ్గు ఎక్కడో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పందించాలని డిమాండ్ చేశారు. బొగ్గు ఉందో? లేదో? పరిశీలన కోసం అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కకు స్పష్టం చేశారు. 'కాంగ్రెస్ హఠావో – సింగరేణి బచావో'.. బొగ్గు గని కార్మికుల నినాదం కావాలని హరీష్‌రావు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ హయాంలో సింగరేణి స్కాంలకు గనిలా మారిందని అభివర్ణించారు. నైనీ బ్లాక్ బొగ్గు గనుల టెండర్.. కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతిని బయట పెట్టిందన్నారు. త్వరలో సింగరేణిపై కాంగ్రెస్ ప్రభుత్వ అక్రమాలు మరిన్ని బయటపెడతానని హరీష్‌రావు స్పష్టం చేశారు. అలాగే రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ఆర్టీసీ డ్రైవర్ అశోక్‌పై వేసిన సస్పెన్షన్‌ను వెంటనే వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు. రెవెన్యూ శాఖలో వేల కోట్ల రూపాయిల అవినీతి జరుగుతోందంటూ ఈ సందర్భంగా హరీష్ రావు తీవ్ర ఆరోపణలు గుప్పించారు.

# యూరియా సరఫరాలో కేంద్రం విఫలం

➢ మొదటి పేజి తరువాయి

హెచ్చరించారు. పంట అవశేషాలను కాల్చడం వల్ల భూసారం పూర్తిగా దెబ్బతింటుందని, నేలలోని పోషకాలు తగ్గిపోవడంతో యూరియా, పురుగుమందుల ప్రభావం కూడా తగ్గిపోతుందని మంత్రి తెలిపారు. అందువల్ల పంట అవశేషాలను కాల్చకుండా భూమిలో కలియదున్నాలని రైతులకు సూచించారు. రైతులకు సబ్సిడీపై వ్యవసాయ యంత్రాలు అందజేస్తామని మంత్రి వెల్లడించారు. అయినప్పటికీ పంట అవశేషాలను కాల్చితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే ఈ విషయంలో నిర్లక్ష్యం వహించే అధికారులపై కూడా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. శాటిలైట్ సాంకేతికత ద్వారా పంట అవశేషాల దహనాన్ని గుర్తిస్తున్నామని తెలిపారు. రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. రాష్ట్రంపై బీజేపీ చేస్తున్న విమర్శలు అన్యాయమని మంత్రి వ్యాఖ్యానించారు. ఎల్‌నినో ప్రభావంతో సాధారణంగా పడే వర్షాలు తగ్గే అవకాశం ఉందని మంత్రి హెచ్చరించారు. అందువల్ల రైతులు పంటల ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆయిల్ పామ్ రైతులకు భరోసా ఇచ్చే పంటగా మారుతోందని మంత్రి తెలిపారు. ఆయిల్ పామ్ సాగుతో రైతులు స్థిరమైన ఆదాయం పొందే అవకాశం ఉందని చెప్పారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు.

# ఒడిషాలో విషాదకర ఘటన

- సెప్టిక్ ట్యాంక్ కూలి ఆరుగురు కూలీల మృతి
- నిర్మాణంలో ఉన్న సెప్టిక్ ట్యాంక్‌లోకి దిగిన ఆరుగురు

భువనేశ్వర్,మే 26 ఒడిశాలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. కళహండి జిల్లాలో నిర్మాణంలో ఉన్న సెప్టిక్ ట్యాంక్‌లోకి దిగిన ఆరుగురు వ్యక్తులు మృతి చెందారు. ఊపిరాడకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. కళహండి జిల్లాలోని గౌడ కర్లాంకుంట గ్రామంలో నిర్మాణంలో ఉన్న సెప్టిక్ ట్యాంక్‌లో సెంట్రింగ్ తీయడానికి మేస్త్రి దిగాడు. సెప్టిక్ ట్యాంక్‌లోకి దిగి సెంట్రింగ్ తీస్తున్న సమయంలో అది కూలిపోయింది. దీంతో మేస్త్రి అందులో చిక్కుకుపోయాడు. మేస్త్రిని కాపాడేందుకు మరో ఐదుగురు సెప్టిక్ ట్యాంక్‌లోకి దిగారు. లోపలికి దిగిన ఆ ఐదుగురు కూడా ఊపిరాడక ప్రాణాలు కోల్పోయారు. గ్రామస్థులు వెంటనే స్పందించి మొత్తం ఆరుగురిని వెలికి తీశారు. హాస్పిటల్‌కు తరలించారు. హాస్పిటల్‌కు తరలించే సమయానికే వారు ప్రాణాలు కోల్పోయినట్టు వైద్యులు ధ్రువీకరించారు. చనిపోయిన వారిలో ముగ్గురు మేస్త్రిలు, ఒక కార్మికుడు, ఇంటి యజమాని, అతడి కుమారుడు ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ ప్రారంభించారు.

## చొరబాటు దారులూ పారిపోండి

➢ మొదటి పేజి తరువాయి

అక్రమవలసదారులు ఈ ప్రదేశాన్ని వదిలివెళ్లాల్సిందేనని అన్నారు. తమ పౌరులను వెనక్కి తీసుకునే బాధ్యత బంగ్లాదేశ్ ప్రభుత్వంపైనే ఉందన్నారు. భారత్ నుంచి తమ పౌరులను తిరిగి స్వీకరించ డానికి సిద్ధంగా ఉన్నట్టు బంగ్లాదేశ్ ఇప్పటికే చెప్పిందని తెలిపారు. బంగ్లా అక్రమ చొరబాటుదారులను జైళ్లకు పంపవద్దని తాను పోలీసులకు ఆదేశాలు ఇచ్చినట్టు చెప్పారు. 'వారికి మనమెందుకు ఆతిథ్యం ఇవ్వాలని దేశ వనరులను మనం ఎందుకు దుర్వినియోగం చేయాలి. చొరబాటుదారులు ఏమైనా మన అల్లుళ్లా?' అని ప్రశ్నించారు. బంగ్లా పౌరులు స్వచ్ఛందంగా, శీఘ్రంగా వెళ్లకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాగా, అక్రమ వలసదారులను వెనక్కి పంపించేందుకు బెంగాల్ ప్రభుత్వం చర్యలు ముమ్మరం చేయడంతో బంగ్లాదేశీయులు స్వదేశానికి తిరుగుముఖం పడుతున్నారు. ఉత్తర 24 పరగణాల జిల్లాలోని హకింపూర్ సరిహద్దు వద్ద మంగళవారం ఉదయం పెద్దఎత్తున వారు గుమిగూడారు. రాష్ట్రంలో ఎస్ఐఆర్ సమయంలోనూ ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. భారత్ నుంచి తమ పౌరులను తిరిగి స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నట్లు బంగ్లాదేశ్ ఇప్పటికే చెప్పిందని.. వారిని తిరిగి తీసుకువెళ్లడం అక్కడి ప్రభుత్వ బాధ్యత అని సువేందు పేర్కొన్నారు. చొరబాటుదారులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని జైల్లో పెట్టొద్దని పోలీసులను ఆదేశించినట్లు తెలిపారు. వారికి ఆశ్రయమిచ్చి, తిండి పెట్టడానికి వారేమైనా మన బంధువులా అని ప్రశ్నించారు. బెంగాల్ ప్రభుత్వం 'గుర్తించండి, తొలగించండి, బహిష్కరించండి' అనే నినాదంతో విదేశీయులను దేశం నుంచి పంపేయడానికి చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలోనే అక్రమంగా రాష్ట్రంలోకి చొరబడినట్లు గుర్తించిన వారికి, సరైన పత్రాలు లేని వారికి తాత్కాలికంగా ఆశ్రయం కల్పించడానికి నిర్బంధ కేంద్రాలు ఏర్పాటు చేస్తోంది. మాల్దాలో తొలి నిర్బంధ కేంద్రాన్ని ప్రారంభించినట్లు అధికారులు వెల్లడించారు. త్వరలో మరిన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

# ఇంటింటి సర్వేతో 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా'

➢ మొదటి పేజి తరువాయి

ఈ పథకం వర్తింపజేయాల న్నదే ప్రభుత్వ సంకల్పమని మంత్రులు పునరుద్ఘాటించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఇల్లు కవర్ అయ్యేలా సమగ్ర గృహ స్థాయి డేటా సేకరణ జరపాలి. ఒకవేళ ఎవరైనా మిగిలిపోతే వారి కోసం ప్రత్యేక శిబిరాలు (స్పెషల్ క్యాంపులు) ఏర్పాటు చేయాలి. పథకం ప్రయోజనాలు ప్రజల్లోకి తీసుకెళ్లేలా పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. ఈ బీమా పథకానికి ఒక విశిష్టమైన 'లోగో'ను రూపకల్పన చేయనున్నారు. సర్వే పూర్తయిన ప్రతి ఇంటికి ఈ లోగోతో కూడిన స్టిక్కర్లను అతికించనున్నారు. మేరకు అన్ని శాఖలు తమ సమగ్ర కార్యాచరణ ప్రణాళికలను వెంటనే సిద్ధం చేసి సమర్పించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామక్రిష్ణ రావు అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డిజిపి సి.వి ఆనంద్, స్పెషల్ చీఫ్ సెక్రటరీలు జయేష్ రంజన్, వికాస్ రాజు, నవీన్ మిత్తల్, వాణి ప్రసాద్, దాన కిషోర్, ప్రిన్సిపల్ సెక్రటరీలు సందీప్ కుమార్ సుల్తానీయా, గౌరవ్ ఉప్పల్, తదితర ఉన్నత అధికారులు పాల్గొన్నారు.

# దేశంలో అసహజ జనాభా మార్పు



న్యూఢిల్లీ,మే26 అక్రమ వలసలు, ఇతర కారణాలతో దేశంలో చోటుచేసుకుంటున్న 'అసహజ జనాభా మార్పు'పై ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్టు కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ప్రకటించారు. ప్రధాని నరేంద్ర మోదీ 2025 ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా చేసిన ప్రకటనకు అనుగుణంగా ఈ కమిటీని ఏర్పాటు చేసినట్టు సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో తెలిపారు. ఈ కమిటీకి రిటైర్డ్ జడ్జి ప్రకాష్ ప్రభాకర్ నావోలేకర్ అధ్యక్షత వహిస్తారని, మాజీ ఐఏఎస్ అధికారి దుర్గా శంకర్ మిశ్రా, మాజీ ఐపీఎస్ అధికారి బాలాజీ శ్రీవాస్తవ, ఆర్థికవేత్త డాక్టర్ షమికా రవి సభ్యులుగా ఉంటారని అమిత్‌షా తెలిపారు. కమిటీ మెంబర్‌గా హోం మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ ఉంటారని చెప్పారు. దేశవ్యాప్తంగా చోటుచేసుకుంటున్న జనాభా మార్పులపై కమిటీ సమగ్ర మూల్యాంకనం చేసి పరిష్కారం సూచిస్తుందని అమిత్‌షా తెలిపారు. జనాభా మార్పు సమస్య భారతదేశ సార్వభౌమత్యం, జాతీయ భద్రత, సామాజిక సమతుల్యత, ఆదివాసీ సమాజాల పరిరక్షణకు పెను సవాలుగా మారిందన్నారు.

# యుద్ధం మళ్లీ మొదలు?

➢ మొదటి పేజి తరువాయి

అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. కాల్పుల విరమణ కొనసాగుతున్నా తమకు ముప్పు ఎదురయ్యే పరిస్థితి ఏర్పడితే దాడులు చేస్తామని సెంట్రల్ కమాండ్ ప్రతినిధి కెప్టెన్ టిమ్ హాకిన్స్ స్పష్టం చేశారు. హోర్ముజ్ జలసంధి వద్ద ఉన్న ఇరాన్ రేవు పట్టణం బందర్ అబ్బ?్బసపై దాడులు చేశామని తెలిపారు. మరోవైపు ఇరాన్ కూడా ప్రతిదాడులు ప్రారంభించింది. తమ గగనతలం వైపు వస్తున్న అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు, డ్రోన్లపై కాల్పులు జరిపామని ఇరాన్ రెవెల్యూషనరీ గార్డ్స్(ఐఆర్‌జీసీ) మంగళవారం ప్రకటించింది. అమెరికాకు చెందిన ఖరీదైన ఎంక్యూ-9 రీపర్ డ్రోన్‌ను కూల్చివేశామని, ఎఫ్-35 ఫైటర్, ఆర్‌క్యూ-4 డ్రోన్‌పైనా కాల్పులు జరిపామని తెలిపింది. అమెరికా కాల్పుల విరమణ ఉల్లంఘనకు పాల్పడితే.. అందుకు దీటుగా ప్రతిస్పందించే హక్కు తమకు ఉందని పేర్కొంది. అమెరికా సైనిక చర్యను తిరిగి ప్రారంభిస్తే.. పశ్చిమాసియాలోని అమెరికా స్థావరాలు, బలగాలపై ఊహించని రీతిలో దాడులకు దిగుతామని హెచ్చరించింది. శాంతి ఒప్పందంవైపు అడుగులు పడుతున్నాయన్న ప్రచారంతో కాస్త తగ్గిన చమురు ధరలకు.. ఇరాన్‌పై అమెరికా దాడులతో మళ్లీ రెక్కలు వచ్చాయి. మంగళవారం ఒక్కరోజే ఐదు శాతం మేర ధరలు పెరిగాయి. యుద్ధ భయాలతో భారత్ సహా పలు దేశాల్లోని స్టాక్ మార్కెట్లు నష్టపోయాయి.

### ఖతార్‌లో పరోక్ష చర్చలు

అమెరికా, ఇరాన్ మధ్య శాంతి కోసం ఖతార్ మధ్యవర్తిత్వంతో ఆ దేశ రాజధాని దోహాలో అమెరికా-ఇరాన్ పరోక్ష చర్చలు ప్రారంభమయ్యాయి. ఇరాన్ తరఫున చర్చలకు నేతృత్వం వహిస్తున్న పార్లమెంటు స్పీకర్ మొహమ్మద్ బఘర్ ఘలీబఫ్, విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీలతో ఖతార్ ప్రధాన మంత్రి షేక్ మహమ్మద్ జస్సిమ్ అల్ థానీ చర్చలు జరుపుతున్నారు. ఆ వివరాలను అమెరికా ప్రతినిధులకు వివరిస్తూ.. వారి డిమాండ్లు, సూచనలను ఇరాన్ ప్రతినిధులకు చేరవేస్తున్నారు. ఈ చర్చలకు సంబంధించిన ముసాయిదాపై ఇప్పటికే ఇరువైపులా సానుకూలత వచ్చిందని, దాని ప్రకారం మరో 60 రోజులు కాల్పుల విరమణ పొడిగింపు, హోర్ముజ్ తెరవడం వంటి అంశాలు ఉన్నాయని ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బగాయి ఇంతకుముందే వెల్లడించారు. ఇరాన్ అణుకార్యక్రమంపై చర్యలు తర్వాతి దశలో ఉంటాయని చెప్పారు.

### అమెరికా స్థావరాలకు రక్షణ ఉండదు

అమెరికా మళ్లీ దాడులు చేపట్టడంపై ఇరాన్ నూతన సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. దీన్ని ఏమాత్రం సహించబోమని, దీనికి ప్రతీకారం తీర్చుకుంటామని హెచ్చరించారు. ఈ మేరకు ఆయన పేరిట రాతపూర్వకంగా విడుదలైన ప్రకటనను ఇరాన్ మీడియా ప్రసారం చేసింది. పశ్చిమాసియాలో అమెరికా పట్టు సడలిపోయినట్టేనని, ఇకపై వారి స్థావరాలకు ఏ మాత్రం రక్షణ ఉండదని మొజ్తాబా ఖమేనీ అందులో హెచ్చరించారు. అమెరికా, ఇజ్రాయెల్‌లను నాశనం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతామని పేర్కొన్నారు. మంగళవారం మధ్యాహ్నం హోర్ముజ్ జలసంధిలో ఒమన్ తీరానికి సమీపంలో ఒక చమురు ట్యాంకర్ నౌకలో పేలుళ్లు జరిగాయి. గుర్తుతెలియని వస్తువు ఢీకొనడంతో నౌక వెనుక భాగంలో పేలుళ్లు జరిగాయని, సిబ్బంది అంతా సురక్షితంగా ఉన్నారని ఆ ప్రాంతంలో నౌకా రవాణాను పర్యవేక్షించే యూకే మారీటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ ప్రకటించింది. నౌక నుంచి చమురు లీకవుతున్నట్టు గుర్తించామని తెలిపింది. అయితే ఈ దాడికి కారణమేమిటన్నది తెలియరాలేదని పేర్కొంది.

### యురేనియం అప్పగిస్తారా.. నాశనం చేస్తారా: ట్రంప్

ఇరాన్-అమెరికా మధ్య శాంతి చర్చల్లో.. ఇరాన్ అణు కార్యక్రమం వదులు కోవడం, శుద్ధి చేసిన యురేనియాన్ని అప్పగించడంపై పీటముడి పడిన సంగతి తెలిసిందే. దీనిపై ట్రంప్ తాజాగా మరో అల్టిమేటం జారీ చేశారు. "ఇరాన్ శుద్ధి చేసిన యురేనియాన్ని నిర్వీర్యం చేయడం కోసం వెంటనే అమెరికాకు అప్పగించాలి. లేదా అంతర్జాతీయ అణుశక్తి సంస్థ లేదా దాని సమాన స్థాయి సంస్థ ఇరాన్‌తో సమన్వయం చేసుకుని ఒక ఆమోద యోగ్యమైన ప్రదేశంలో ఆ యురేనియాన్ని నాశనం చేయాలి" అని ట్రూత్ సోషల్‌లో పోస్టు పెట్టారు. ఇరాన్‌తో చర్చలు సానుకూల దిశగా సాగుతున్నాయని పేర్కొన్నారు. అయితే అది అందరికీ ఒక గొప్ప ఒప్పందం అవుతుందని, లేకుంటే ఒప్పందమేదీ ఉండబోదని స్పష్టం చేశారు. ఒక వేళ చర్చలు విఫలైమతే ఇరాన్‌పై భారీ స్థాయిలో దాడులు చేస్తామని పేర్కొన్నారు.

# దేశవ్యాప్తంగా అజ్ఞాతంలో మరో 47 మంది మావోలు

- తెలుగు రాష్ట్రాలకు చెందిన వారు కేవలం నలుగురే
- పోలీసులకు లొంగిన నరహరి,ధనమ్మ జంటకు చెక్కులు అందచేత
- గణపతి తదితరులు కూడా వెంటనే లొంగిపోవాలి
- డిజిపి సివి ఆనంద్ పిలుపు

హైదరాబాద్,మే26 మావోయిస్టు పార్టీలో నాలుగున్నర దశాబ్దాల పాటు పసునూరి నరహరి అలియాస్ సంతోష్ పని చేశారని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు. మంగళవారం హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో మీడియా ఎదుట నరహరితోపాటు ఆయన భార్య ధనమ్మను తెలంగాణ పోలీసులు ప్రవేశపెట్టారు. మే 12వ తేదీన పోలీసుల ఎదుట నరహరి, ఆయన భార్య లొంగిపోయారు. వారిని ఈ రోజు మీడియా ఎదుట ప్రవేశపెట్టారు. లొంగిపోయిన వారిద్దరికి రూ. 25 లక్షలు, రూ.20 లక్షలు చొప్పున డీజీపీ చెక్కులు అందజేశారు. అనంతరం డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా 47 మంది మావోయిస్టులు ఇంకా అజ్ఞాతంలో ఉన్నట్లు గుర్తించామన్నారు. అందులో తెలంగాణాకి చెందిన వారు ముగ్గురు, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారు ఒకరు, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారు 15, జార్ఖండ్ 13, ఒడిశాకు చెందిన 15 మంది ఇంకా అజ్ఞాతంలో ఉన్నారని వివరించారు. 2024 నుండి ఇప్పటి వరకు 822 మంది మావోయిస్టులు లొంగిపోయారని పేర్కొన్నారు. మొత్తం 334 ఆయుధాలతో వీరంతా తెలంగాణా పోలీసులు ఎదుట లొంగిపోయారని చెప్పారు. ఇక తెలంగాణా పోలీసులు ముందు లొంగిపోయిన ఒడిశాకి చెందిన మావోయిస్టులను ఆ రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించామని పేర్కొన్నారు. మన రాష్ట్రానికి చెందిన మావోయిస్టులను త్వరలో వారి ప్రాంతాలకు వెళ్లి స్వయంగా కలుస్తానని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. తెలంగాణాకు చెందిన కేంద్ర కమిటీ సభ్యుడు ముప్పాళ్ల లక్షణరావు అలియాస్ గణపతితోపాటు జాడే రత్న బాయి అలియాస్ సుజాత, వార్త శేఖర్ అలియాస్ మంగు లొంగిపోవాలని ఈ సందర్భంగా వారికి డీజీపీ సీవీ ఆనంద్ విజ్ఞప్తి చేశారు. మీరు లొంగిపోతే ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని బెనిఫిట్స్‌తోపాటు సదుపాయాలు కల్పిస్తామని అజ్ఞాతంతో ఉన్న మావోయిస్టులకు డీజీపీ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. 2026, మార్చి 31వ తేదీ నాటికి దేశంలో మావోయిస్టులను నిర్మూలించేందుకు కేంద్రం ఆపరేషన్ కగార్ చేపట్టింది. ఈ సందర్భంగా వందల సంఖ్యలో మావోయిస్టులు ప్రభుత్వం ఎదుట లొంగిపోయారు. అలాగే పలువురు మావోయిస్టులను అరెస్ట్ చేశారు. మావోయిస్టుల ప్రాబల్యం అధికంగా ఉన్న ఛత్తీస్‌గఢ్‌లో భద్రతా దళాలు నిరంతరాయంగా చేపట్టిన కూంబింగ్ కారణంగా భారీ సంఖ్యలో మావోయిస్టులు మరణించారు. ఇక ప్రభుత్వం ఎదుట లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వం ప్రకటించిన రివార్డులు అందజేశారు. దీంతో దేశంలో దాదాపుగా మావోయిస్టు పార్టీ ప్రాబల్యం దాదాపుగా తగ్గిపోయింది.

## వడ్ల కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలి

- ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్
- కోతలు లేకుండా వడ్లను కొనుగోలు చేయాలి
- రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుంది



జ్యోతి నగర్ ఎన్టిపిసి మే 26 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

రామగుండం నియోజకవర్గ పరిధిలోని బసంత్ నగర్ గణపతి రైస్ మిల్లులో నిల్వ ఉంచిన రైతుల వడ్లను వెంటనే కొనుగోలు చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని రామగుండం ఎమ్మెల్యే ఎం ఎస్ రాజ్ ఠాకూర్ అధికారులకు సూచించారు.మంగళవారం రైస్ మిల్లును సందర్శించిన ఎమ్మెల్యే అక్కడ నిల్వ ఉన్న వడ్ల పరిస్థితిని స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా రైస్ మిల్లు యజమానితో మాట్లాడి, రైతులు ఎంతో కష్టపడి పండించిన ధాన్యాన్ని ఆలస్యం చేయకుండా త్వరితగతిన కొనుగోలు చేయాలని కోరారు. ఎలాంటి కోతలు లేకుండా కొనుగోలు చేయాలని అన్నారు. కొనుగోలు ప్రక్రియలో జాప్యం జరిగితే రైతులు ఆర్థికంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు, మిల్లర్లు పరస్పర సమన్వయంతో పనిచేసి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే సూచించారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రైతులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. రైతుల ప్రయోజనాల కోసం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

## పొట్యాల ఐకేపి సెంటర్ లోని వడ్లను పరిశీలించిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్



జ్యోతి నగర్ ఎన్టిపిసి మే 26 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

: పొట్యాల గ్రామంలోని ఐకేపి సెంటర్‌లో నిల్వ ఉంచిన వడ్లకు ఎండ తీవ్రత కారణంగా స్వల్పంగా మంటలు అంటుకున్న ఘటనపై సమాచారం అందుకున్న ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ వెంటనే అక్కడికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి వడ్ల నిల్వలు, రైతులకు కలిగే ఇబ్బందులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఐకేపి సెంటర్‌లో వడ్లను ఎక్కువ రోజులు నిల్వ ఉంచకుండా వెంటనే రైస్ మిల్లులకు తరలించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రైతులు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం పూర్తి స్థాయిలో అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

## పశువుల అక్రమ రవాణాపై అప్రమత్తంగా ఉండాలి

- రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా.



మంచిర్యాల జిల్లా/ మందమర్రి/ మే 26/ అక్షరం న్యూస్ –:

బక్రీద్ సందర్భంగా పశువుల అక్రమ రవాణాపై అప్రమత్తంగా ఉండాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అధికారులను ఆదేశించారు. మంగళవారం మంచిర్యాల జోన్, మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని టోల్‌గేట్ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌ను రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బందికి పలు సూచనలు, ఆదేశాలు ఇచ్చి, వివరాల నమోదు రిజిస్టర్లను పరిశీలించారు. సీపీ మాట్లాడుతూ బక్రీద్ పండుగ సందర్భంగా పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో పటిష్టమైన నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చెక్‌పోస్ట్ వద్ద అమలులో ఉన్న భద్రతా చర్యలను పరిశీలించి, విధుల్లో ఉన్న సిబ్బందికి పలు సూచనలు చేశారు.ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి, వాహనాలు మరియు పశువుల వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని, సంబంధిత పత్రాలు సక్రమంగా ఉన్నాయో లేదో పరిశీలించాలని ఆదేశించారు. అనుమానాస్పద వాహనాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, అవసరమైతే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి తెలిపారు. పండుగ సమయంలో శాంతి భద్రతలను కాపాడేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని, అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

## పాలకుర్తి మండలంలోని ఐకెపి కొనుగోలు

# కేంద్రాలలో రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- బీజేపీ పాలకుర్తి మండల అధ్యక్షులు మెరుగు నరేష్ గౌడ్ డిమాండ్.



జ్యోతి నగర్ ఎన్టిపిసి మే 26 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

పాలకుర్తి మండలంలోని ధాన్యం మరియు మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని భారతీయ జనతా పార్టీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకుభారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు, రామగుండం నియోజకవర్గ ఇంచార్జి శ్రీమతి కందుల సంధ్యారాణ, జిల్లా అధ్యక్షులు కర్రె సంజీవరెడ్డి ఆదేశాల మేరకు పాలకుర్తి మండల బీజేపీ అధ్యక్షులు మేరుగు నరేష్ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, మండలంలోని ఐకెపి కొనుగోలు కేంద్రాలలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా కొనుగోలు ప్రక్రియలో అధికారులు, మిల్లర్లు కలిసి రైతులను “బి–కేటగిరి” పేరుతో ఇబ్బందులకు గురిచేస్తూ అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు.రైతుల ధాన్యానికి తేమ శాతం పేరుతో అనవసర కోతలు విధించడం, అలాగే “తాలు”, “తరుగు” పేరుతో అధిక కోతలు పెట్టడం వల్ల రైతులు తీవ్ర ఆర్థిక నష్టాలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో కనీస సౌకర్యాలు లేకపోవడం, ముఖ్యంగా తార్పాలిన్లు అందుబాటులో లేకపోవడంతో వర్షాలు కురిసినప్పుడు ధాన్యం తడిసి రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. రైతుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు బీజేపీ మండల అధ్యక్షులు మేరుగు నరేష్ ఐకెపి కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతులతో మాట్లాడారు. రైతులకు అవసరమైన కనీస వసతులు కల్పించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు.ప్రభుత్వం వెంటనే స్పందించి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు ప్రతి కొనుగోలు కేంద్రంలో తార్పాలిన్లు, తాగునీరు, షెడ్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. రైతుల పట్ల ఇదే నిర్లక్ష్య వైఖరి కొనసాగితే భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో తిప్పని రాజకుమార్,కంకట శ్రీనివాస్, గోపు రామయ్య,కొలిపాక శంకరయ్య,రావుల చిన్నన్న, వేల్పుగొండ సంపత్, పూసాల శంకరయ్య,జట్పుట్ తిరుపతి, కొమురె లక్ష్మణ్, మబ్బు సాయికిరణ్,నందీష్,రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

# బక్రీద్ పర్వదినాన్ని మతసామరస్యంతో జరుపుకోవాలి...

- నియర్ మహంకాళి స్వామి



జ్యోతి నగర్ ఎన్టిపిసి మే 26 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

బక్రీద్ పండుగను మత సామరస్యంతో, శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి అన్నారు. బక్రీద్ పండుగ ఏర్పాట్ల గురించి వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులు , కార్పొరేటర్లు , ముస్లిం మత పెద్దలతో రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో మంగళ వారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ ఎం ఎల్ ఎ రాజ్ ఠాకూర్ ఆదేశాలమేరకు బక్రీద్ పండుగ పురస్కరించుకొని రామగుండం నగర పాలక సంస్థ రూ 12.00 లక్షల రూపాయలు వెచ్చించి ముస్లిం లు నమాజ్ చేసుకోవడానికి వీలుగా టెంట్లు , మంచి నీళ్ళు , మైక్ తదితర వసతులు నగర పాలక సంస్థ పరిధిలోని ఈద్గాల వద్ద ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. బక్రీద్ సందర్భంగా నిబంధనలు పాటిస్తూ పశు వధ విషయంలో చివరి క్షణం వరకు వేచి చూడకుండా ముందుగా పశు వైద్యాధికారి నుంచి అనుమతి పొందాలని అన్నారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు, వదంతులు లేదా అపోహలు సృష్టించే మెసేజ్ లు పెట్టడం, షేర్ చేయడం చట్టరీత్యా నేరమని అన్నారు. సహాయం అవసరమైన పక్షం లో రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో తమని సంప్రదించాలని కోరారు. ప్రభుత్వ రంగ సంస్థలు కూడా పండుగ ఏర్పాట్లకు సహకరించాలని కోరారు. డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య మాట్లాడుతూ బక్రీద్ పండుగ పురస్కరించుకొని రామగుండం నగర పాలక సంస్థ ఆద్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేయడం జరుగుతుందని. ఇంకా ఏవైనా ఏర్పాట్లు అవసరమైన పక్షంలో దృష్టికి తీసుకురావాలని కోరారు.

అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), రామగుండం నగర పాలక సంస్థ కమీషనర్ జె.అరుణశ్రీ మాట్లాడుతూ బక్రీద్ సందర్భంగా ఏడు ఈద్గాల వద్ద నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో వసతులు కల్పించడం జరుగుతుందని అన్నారు. పశువధ విషయంలో ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని అన్నారు. ఈ మేరకు త్వరితగతిన పశువుల ఆరోగ్య ధ్రువీకరణ జారీ చేసేందుకు అదనంగా సరిపడినశీత పశువైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేయడానికి తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు. వధకు అర్హత లేని పశువులను తరలించేందుకు గోశాల కూడా సిద్ధంగా ఉందని అన్నారు. ఏర్పాట్లకు సంబందించి ప్రభుత్వ రంగ సంస్థలకు అప్పగించిన భాధ్యతలను నిర్వర్తించాలని కోరారు.ఎ సి పి ముదుత రమేష్ మాట్లాడుతూ చట్ట ప్రకారం నిబంధనలు పాటిస్తూ ప్రశాంతంగా పండుగ జరుపుకోవాలని సూచించారు. జంతు రవాణా, ఇతరత్రా విషయాల్లో ఎవరూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని, సమస్యలు ఉంటే పోలీసులను సంప్రదించాలని సూచించారు. ప్రజలకు సౌలభ్యం కలిగించేందుకు పోలీసులు పని చేస్తున్నారని గుర్తించాలని కోరారు.పశువైద్యాధికారి ప్రసాద్ మాట్లాడుతూ పశు వధకు సంబంధించి ముందుగా తమ వద్ద అనుమతి తీసుకోవాలని కోరారు. ధరఖాస్తు ఫారాలు తదితర వివరాలకు తనను ఫోన్ నెం : 8790 997693 లో కూడా సంప్రదించవచ్చని తెలిపారు . ఈ సమావేశంలో సి ఐ లు ఇంద్రసేనా రెడ్డి , ప్రసాద రావు , రాజేశ్వర్ రావు, డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి , ఎస్ ఇ గురువీర పలువురు కార్పొరేటర్లు , ముస్లిం మత పెద్దలు , ఎన్ టి పి సి , సింగరేణి , ఆర్ ఎఫ్ సి ఎల్ అధికారులు పాల్గొన్నారు.

## టీడీపీ మహానాడు వర్చువల్ గా నిర్వహణ



మంచిర్యాల జిల్లా/ మందమర్రి/ మే 26/అక్షరం న్యూస్ –:

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారకరామారావు పుట్టినరోజు వేడుకలను ఈనెల 27 28వ తేదీలలో మందమర్రి తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో సింగరేణి కమ్యూనిటీ హాల్ లో ఘనంగా నిర్వహించడానికి ప్రతి తెలుగుదేశం కార్యకర్త నడుం బింగచాలని సంజయ్ కుమార్ పిలుపునిచ్చినారు. మరియు పెద్దపల్లి పార్లమెంట్ కు సంబంధించి తెలుగుదేశం వర్చువల్ మహానాడు మీటింగ్ ను తెలంగాణ రాష్టములోనే నెంబర్ వన్ వర్చ్యువల్ మహానాడుగా విజయవంతం చేద్దానన్నారు. ఈసమావేశంలో మాజీ జిల్లా అధ్యక్షులు టీడీపీ పెద్దపల్లి సీనియర్ నాయకులు అక్కపాక తిరుపతి, టౌన్ అధ్యక్షులు వాసాల సంపత్, మహిళా ప్రెసిడెంట్ జూపాక సంధ్య, సత్యనారాయణ, సుగుణ, కవిత, రంగనాథ్, భాగ్య, రజిత, పారిపల్లి శ్రీనివాస్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఐకెపి వివోఏ ల నిరవదిక సమ్మెకు బీఎస్పీ మద్దతు



మంచిర్యాల జిల్లా/ మందమర్రి/ మే 26/ అక్షరం న్యూస్ –:

మందమర్రి ఎంపీడీవో కార్యాలయం ముందు ఐకేపీ వి.ఓ.ఏ ఉద్యోగులు చేస్తున్న నిరవధిక సమ్మెకు బహుజన సమాజ్ పార్టీ సంపూర్ణ మద్దతు తెలిపింది. మంగళవారం బహుజన్ సమాజ్ పార్టీ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు ముల్కల్ల రాజేంద్రప్రసాద్ దీక్షా శిబిరాన్ని సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో తెలంగాణ వస్తే తెలంగాణ ప్రజల బతుకులు బాగుపడతాయని రాష్ట్రాన్ని సాధిస్తే తెలంగాణ ప్రజల బతుకులు ఆగమవుతున్నాయని మండి పడ్డారు. గత ప్రభుత్వంలో గాని ఇప్పుడున్న ప్రభుత్వంలో గాని ఎన్నో హామీలు ఇచ్చి గద్దె ఎక్కిన ప్రభుత్వాలు ఏమాత్రం పట్టించుకుంటలేవన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వమస్తే అర నిమిషంలో అన్ని పనులు చేస్తున్నానని ఆరు గ్యారెంటీలు 420 హామీలు ఇచ్చి తెలంగాణ ప్రజలను మోసం చేస్తున్న రేవంత్ రెడ్డి ఇప్పటికైనా కళ్ళు తెరిచి మీరిచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఐకేపీ వి.ఓ.ఏ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ లు నెరవేర్చాలని వారి పోరాటానికి అండగ ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బి ఎస్ పి చెన్నూరు నియోజవర్గం అధ్యక్షులు గాజుల శంకర్, ఉపాధ్యక్షులు ఎం .డి మతిన్ ఖాన్, మందమర్రి పట్టణ నాయకులు ఐలేను రాజు వి.ఓ.ఏ నాయకులు ఏ. వనజ, కె. వెంకటేష్, ఎం. పావని, కామెర తుకారాం తదితరులు పాల్గొన్నారు.

## ఎన్.సి.డబ్ల్యూ.ఏ ఉద్యోగులకు క్వార్టర్ల కౌన్సెలింగ్ నిర్వహణ



మంచిర్యాల జిల్లా/ మందమర్రి/ మే 26/అక్షరం న్యూస్ –:

మందమర్రి పట్టణంలోని స్థానిక సి.ఈ.ఆర్ క్లబ్ ఆవరణలో మంగళవారం మందమర్రి ఏరియాకు చెందిన ఎన్.సి.డబ్ల్యూ.ఏ ఉద్యోగులకు సీనియారిటీ ప్రాతిపదికన క్వార్టర్ల కేటాయింపు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమం వివరాలను అధికారులు వెల్లడిస్తూ, మొత్తం 90 క్వార్టర్లు అందుబాటులో ఉండగా, వాటి కోసం 123 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. నిబంధనల ప్రకారం సీనియారిటీ ప్రాతిపదికన పారదర్శకమైన పద్ధతిలో కౌన్సెలింగ్ నిర్వహించి,15 మంది అర్హులైన ఉద్యోగులకు క్వార్టర్లను కేటాయించినట్లు పేర్కొన్నారు. ఈ కౌన్సెలింగ్ ప్రక్రియలో సీనియర్ పర్సనల్ ఆఫీసర్ కార్తీక్, మరియు మేనేజ్మెంట్ ట్రైనీ (సివిల్) ఆర్. వీణ, ఆఫీస్ సూపరింటెండెంట్ రాజలింగు పాల్గొని కేటాయింపు ప్రక్రియను పర్యవేక్షించారు.

## సింగరేణి కార్మికుల హక్కులను తాకట్టు పెడుతున్న గుర్తింపు ప్రాతినిధ్య సంఘులు -సిఐటియు

- తుమ్మల రాజారెడ్డి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి




జ్యోతి నగర్ ఎన్టిపిసి మే 26 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్ సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) సింగరేణి గుర్తింపు సంఘం ఏఐటియుసి కార్మికుల సమస్యల మీద పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని ఫోజు పెట్టి సింగరేణి వ్యాప్తంగా బస్సుజాత చేసి ఏప్రిల్ లేదా మే నెల లో సమ్మె చేస్తామని ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చి కార్మికులందరినీ నమ్మ బలికించి యజమాన్యం పిలవగానే సంకనజేరి హక్కులను తాకట్టు పెట్టీ పైరవీలు చేసుకుంటున్నరని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుమ్మల రాజిరెడ్డి అన్నారు. అలాగే ప్రభుత్వ సంఘం ఐఎన్టియుసి ప్రాతినిధ్య సంఘంగా ఉండి ప్రశ్నించకుండా ఐక్య పోరాటాలకు సిద్ధమంటూనే ప్రభుత్వ యాజమాన్యాల కనుసన్నల్లో నడుస్తున్న పరిస్థితి కార్మికులు గమనిస్తున్నారన్నారు, ఇలాంటి పరిస్థితులలో మెడికల్ బోర్డు ప్రారంభించామని ఈ రెండు సంఘాలు పెద్ద ఎత్తున ప్రచారం చేసి గతంలో అనారోగ్యం పాలైన కార్మికులకు పెట్టిన మెడికల్ బోర్డును మేమే మాగనతేనని చెప్పుకుంటున్న ఈ గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు కార్మికులకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు, అనారోగ్యంగా ఉన్న కార్మికులను ఇన్ వాలిడేషన్ చేయకుండా హైయర్ హాస్పిటల్ రెఫర్ చేయడం అంటేనే వారికి ఆర్థిక నష్టం కలిగిస్తూ,మరోసారి అవినీతికి అవకాశం ఇవ్వడమేనని అన్నారు, ఒకపక్క అవినీతిని నిర్మూలిస్తామని ప్రభుత్వం చెప్తూనే అవినీతికి అవకాశం కల్పిస్తున్నారని, ఇప్పుడు ఈ రెండు సంఘాల జేబులు నిండడం ఖాయంగా కనిపిస్తుందని, కార్మిక సోదరులారా ఆలోచించండి నేతి బీరకాయలో నెయ్యి ఎంత ఉంటుందో మనందరికీ తెలుసునని, అలాగే వీరి నీతి మాటలలో మోసం దాగి ఉన్నదనేది గుర్తుంచుకోవాలని విమర్శించారు. ప్రతిసారి కార్మికులను మోసం చేయడం వీరికి వెన్నతో పెట్టిన విద్య అనేది గుర్తుంచుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తోట.నరహరి రావు, ఆరేపల్లి.రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

## పేదల పాలిట అండ సీఎం రిలీఫ్ ఫండ్..



సూర్యాపేట మే 26(అక్షరం న్యూస్ ):

తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న సీఎం రిలీఫ్ ఫండ్ పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో అండగా నిలుస్తోందని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. మంగళవారం లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యవసర వైద్య చికిత్సల సమయంలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ప్రభుత్వం చేయూతనందిస్తోందన్నారు. మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి, ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ సహకారంతో అర్హులైన లబ్ధిదారులకు సహాయం అందిస్తున్నామని తెలిపారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ప్రజలు ఇలాంటి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం గుండెబోయిన సాయి, సంగు శ్రీనివాస్, ధారవత్ హర్యా, ధారవత్ సైదా, తంగేళ్ల పిచ్చయ్యల కు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేశారు.

# మండలంలో బెల్ట్ షాపుల దందా

- ఎమ్మార్పీకి మించి మద్యం విక్రయాలు
- కూలి కుటుంబాలపై తీవ్ర ప్రభావం..
- అక్రమ విక్రయాలపై చర్యలు తీసుకోవాలి..
- బీజేపీ నాయకుడు మాడుగుల అజిత్ కుమార్ డిమాండ్..



హనుమకొండ జిల్లా/భీమదేవరపల్లి/మే 26/అక్షరం న్యూస్–:

హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండల పరిధిలోని పలు గ్రామాల్లో ముఖ్యంగా ముల్కనూరు గ్రామంలో బెల్ట్ షాపుల వ్యవస్థ రోజురోజుకూ విస్తరిస్తూ గ్రామీణ జీవన విధానంపై తీవ్ర ప్రభావం చూపుతోందని మండల బీజేపీ నాయకుడు మాడుగుల అజిత్ కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు.మంగళవారం ముల్కనూరులో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నియంత్రణ లేకుండా కొనసాగుతున్న బెల్ట్ షాపులు యువత భవిష్యత్తును దెబ్బతీస్తున్నాయని అన్నారు. ముఖ్యంగా కూలి కుటుంబాల ఆర్థిక పరిస్థితి ఈ అక్రమ మద్యం విక్రయాల కారణంగా మరింత దయనీయంగా మారుతోందని పేర్కొన్నారు.కొన్ని బెల్ట్ షాపుల్లో ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నారని ఆరోపించారు. ఒక్క క్వార్టర్ బాటిల్‌పై రూ.50 వరకు, బీరు సీసాపై రూ.60 వరకు అదనంగా వసూలు చేస్తున్న పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. రోజంతా కష్టపడి సంపాదించిన కూలీల డబ్బు సాయంత్రానికి బెల్ట్ షాపుల్లోనే ఖర్చవుతోందని దీనివల్ల పేద కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అన్నారు.అధికారిక వైన్ షాపులకు సమయపాలన ఉన్నప్పటికీ బెల్ట్ షాపులు మాత్రం రాత్రింబవళ్లు కొనసాగుతున్నాయని విమర్శించారు. ఎలాంటి నియంత్రణ లేకుండా సాగుతున్న ఈ అక్రమ మద్యం విక్రయాల కారణంగా యువత వ్యసనాలకు బానిసలవుతున్నారని, కొన్ని కుటుంబాలు ఆర్థికంగా కుంగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సమస్యను వ్యక్తిగత విమర్శల కోణంలో కాకుండా గ్రామ భవిష్యత్తు, ప్రజల ఆరోగ్యం, యువత రక్షణ కోణంలో చూడాల్సిన అవసరం ఉందన్నారు. ముల్కనూరు గ్రామ పాలకవర్గం ప్రత్యేక దృష్టి సారించి బెల్ట్ షాపుల నిర్మూలనకు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.అదేవిధంగా ఎక్సైజ్ శాఖ అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించి అక్రమ మద్యం విక్రయాలను అరికట్టాలని గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టి యువతను వ్యసనాల బారిన పడకుండా కాపాడాలని సూచించారు. గ్రామ ప్రజలు కూడా బెల్ట్ షాపుల నియంత్రణ కోసం అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# పీవీ విజ్ఞాన కేంద్రం పనులు వేగవంతంగా పూర్తి చేయాలి

- జూన్ 28 నాటికి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలి
- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి..
- వంగరలో పీవీ విజ్ఞాన కేంద్రం పీవీ స్వగృహంలోని ఫోటో మ్యూజియాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్.



హనుమకొండ జిల్లా / భీమదేవరపల్లి / మే 26/అక్షరం న్యూస్–:

హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర గ్రామంలో నిర్మాణంలో ఉన్న పీవీ విజ్ఞాన కేంద్రం అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.మంగళవారం మాజీ ప్రధానమంత్రి దివంగత పాములపర్తి వెంకట నరసింహారావు స్వగ్రామమైన వంగరలో నిర్మిస్తున్న పీవీ విజ్ఞాన కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా పీవీ స్ఫూర్తి వనంలోని ఫోటో గ్యాలరీ, సైన్స్ మ్యూజియం సమావేశ మందిరాన్ని సందర్శించిన కలెక్టర్, అసంపూర్తిగా ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని పర్యాటక శాఖ మరియు కుడా అధికారులకు సూచించారు. ముఖ్యంగా తాగునీటి పైపులైన్ పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు.



జూన్ 28 నాటికి అన్ని పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని పేర్కొన్నారు.అనంతరం మాజీ ప్రధాని పీవీ నరసింహారావు స్వగృహంలో ఏర్పాటు చేస్తున్న ఫోటో మ్యూజియాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు.

పీవీ నరసింహారావు రాష్ట్ర ముఖ్యమంత్రిగా దేశ ప్రధానమంత్రిగా పనిచేసిన సమయంలో జాతీయ, అంతర్జాతీయ ప్రముఖులతో దిగిన అరుదైన ఫోటోలను కుటుంబ సభ్యులతో కలిసి పరిశీలించారు. ఆ ఫోటోల ప్రత్యేకతను పీవీ కుటుంబ సభ్యులు పీవీ ప్రభాకర్ రావు, ఎమ్మెల్సీ సురభి వాణి దేవి, పీవీ మదన్ మోహన్ కలెక్టర్‌కు వివరించారు.అదేవిధంగా వివిధ దేశాల నుంచి పీవీ నరసింహారావుకు లభించిన పురస్కారాలు, ఆయన రచించిన పుస్తకాలను కూడా కలెక్టర్ పరిశీలించారు. అనంతరం పీవీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో జిల్లా పర్యాటక శాఖ అధికారి శివాజీ, కుడా సీపీఓ అజిత్ రెడ్డి, స్థానిక తహసీల్దార్ రాజేష్, ఎంపీడీవో వీరేశం,పర్యాటక శాఖ డీఈ ధనరాజ్, ఏఈ కీర్తి స్థానిక సర్పంచ్ గజ్జల సృజన తదితరులు పాల్గొన్నారు.

# పంట వ్యర్థాల దహనంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి...

- రైతులకు విస్తృత అవగాహన కల్పించాలి...
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



ఖమ్మం స్టాఫ్ రిపోర్టర్ మే 26 (అక్షరం న్యూస్)

రాష్ట్రంలో పంట వ్యర్థాలను కాల్చడం వల్ల భూసారం, పర్యావరణం, ప్రజారోగ్యంపై తీవ్ర ప్రతికూల ప్రభావాలు ఏర్పడుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు వ్యవసాయ శాఖ మంత్రి తెలిపారు. పంట వ్యర్థాల దహనాన్ని పూర్తిగా నివారించే దిశగా రైతులకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని వ్యవసాయ శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ఈ రోజు నిర్వహించిన “రైతు నేస్తం” కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ పంట వ్యర్థాలను కాల్చడం అనేది కేవలం రైతులకే సంబంధించిన విషయం కాదని, ఇది సమాజం మొత్తం బాధ్యతగా భావించాల్సిన అవసరం ఉందన్నారు. రైతులు, వ్యవసాయ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, శాస్త్రవేత్తలు మరియు గ్రామస్థాయి స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేసి పంట అవశేషాలను కాల్చకుండా కలియదున్నే పద్ధతులను ప్రోత్సహించాలని సూచించారు.పంట వ్యర్థాలను కాల్చడం వల్ల నేలలోని సేంద్రియ కర్బనం పదార్థం, ఉపయోగకర సూక్ష్మజీవులు నశించి భూసారం క్షీణిస్తుందని, తద్వారా పంటల దిగుబడులపై ప్రతికూల ప్రభావం పడుతుందని మంత్రి పేర్కొన్నారు. అదేవిధంగా గాలి కాలుష్యం పెరిగి శ్వాసకోశ, కంటి, చర్మ సంబంధిత అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందన్నారు. ఇటీవల పంట వ్యర్థాలను కాల్చే సమయంలో సంభవించిన అగ్ని ప్రమాదాల్లో రైతులు ప్రాణాలు కోల్పోయిన ఘటనలను ప్రస్తావిస్తూ రైతులు అత్యంత జాగ్రత్తలు పాటించాలని సూచించారు.పంట అవశేషాలను కలియదున్నడం ద్వారా నేల సేంద్రియ కర్బనం పదార్థం పెరిగి భూసారం మెరుగుపడటంతో పాటు నేల తేమ నిల్వ సామర్థ్యం పెరుగుతుందని, ఎరువుల వినియోగ వ్యయం తగ్గి పంట దిగుబడులు మెరుగుపడతాయని తెలిపారు. రైతులకు అవసరమైన రోటావేటర్లు, మల్చర్లు, శ్రెడర్లు, వంటి వ్యవసాయ యంత్రాలను సబ్సిడీపై అందించేందుకు ప్రభుత్వం సిద్ధం గా ఉందన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రధాన శాస్త్రవేత్త రామాంజనేయులు పంట వ్యర్థాల దహనం వల్ల కలిగే శాస్త్రీయ, పర్యావరణ నష్టాలపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు తమ పొలంలో పంట అవశేషాలను కలియదున్ని అధిక దిగుబడులు సాధించిన రైతులు రైతు నేస్తం కార్యక్రమంలో వారి స్వీయ అనుభవాలను ఇతర రైతులతో పంచుకునే అవకాశం కల్పించబడింది



రైతులు పరమేశ్వర్ మంచిర్యాల జిల్లా, దేవేందర్ రెడ్డి హనుమకొండ జిల్లా, శంకర్ అల్లీపూర్ నుండి, గంగారెడ్డి కల్లెడ జగిత్యాల నుండి శ్రీనివాసరెడ్డి కొత్తగూడెం జిల్లా నుండి హాజరై తమ అనుభవం పంచుకున్నారు.వ్యవసాయ కార్యదర్శి కె. సురేంద్రమోహన్ మాట్లాడుతూ పంట వ్యర్థాల దహనం వల్ల నేల నాణ్యత దెబ్బతినడమే కాకుండా పర్యావరణ కాలుష్యం పెరుగుతోందన్నారు. భూసార పరీక్షల ఆధారంగా సమతుల్య ఎరువుల వినియోగం, తగు మోతాదులో యూరియా వాడకం, పచ్చిరొట్ట పంటల సాగు, పంట అవశేషాల కలియదున్నడం వంటి అంశాలపై వ్యవసాయ శాఖ విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. రైతులు తమ ప్రాంత వ్యవసాయ అధికారులను సంప్రదించి శాస్త్రీయ పద్ధతుల్లో పంటల సాగు చేపట్టాలని సూచించారు.పంట వ్యర్థాలను కాల్చడం పర్యావరణ పరిరక్షణ నిబంధనల ఉల్లంఘనగా పరిగణించబడుతుందని, సంబంధిత చట్టాల ప్రకారం జరిమానాలు విధించే అవకాశముందని అధికారులు సూచించారు. పర్యావరణ పరిరక్షణతో పాటు భూసార సంరక్షణ కోసం రైతులు పంట వ్యర్థాలను కాల్చకుండా కలియదున్నే పద్ధతులను అనుసరించాలని ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది.

## సూర్యాపేటలో ఎన్‌హెచ్ఆర్‌సీ (వివో) ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమం



సూర్యాపేట మే 26(అక్షరం న్యూస్ ):

పట్టణంలో మండుతున్న ఎండలో బాటసారుల దాహార్తిని తీర్చేందుకు నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ (ఎన్ హెచ్ ఆర్ సి) (వివో ) ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీకార్యక్రమంనిర్వహించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ ఫ్లైఓవర్ సమీపంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని సంస్థ రాష్ట్ర చైర్మన్ చింతపల్లి వెంకటేశ్వర్లు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి తీవ్రత రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ముఖ్యంగా వడదెబ్బ బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, అత్యవసరం ఉన్నప్పుడు మాత్రమే బయటకు రావాలని సూచించారు. ప్రయాణికులు, కార్మికులు, సాధారణ ప్రజలు తరచుగా నీరు, మజ్జిగ వంటి ద్రవపదార్థాలు తీసుకోవడం ద్వారా శరీరాన్ని చల్లగా ఉంచుకోవచ్చన్నారు.ప్రజాసేవలో భాగంగా సామాజిక బాధ్యతతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ప్రజల హక్కుల పరిరక్షణ కోసం నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ (ఎన్ హెచ్ ఆర్ సి) (వివో )ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తూ చట్టబద్ధమైన మార్గాల్లో ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. సమాజంలో సేవా కార్యక్రమాల ద్వారా మానవత్వాన్ని చాటడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బండ్ల రమేష్, ఉమ్మడి నల్లగొండ జిల్లా జనరల్ సెక్రటరీ బార్పటి సునీత, జిల్లా మహిళా అధ్యక్షురాలు పుష్ప, కన్వీనర్ సారగండ్ల సైదులు, కోఆర్డినేటర్ కృష్ణ, చంద్రకళ తదితరులు పాల్గొని బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు.

## ఈపీఎఫ్ఓ నిధి ఆప్కే నికట్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి ...

- ప్రాంతీయ పీ.ఎఫ్ కమీషనర్ శ్రీనివాస్

ఖమ్మం స్టాఫ్ రిపోర్టర్ మే 26 (అక్షరం న్యూస్)

ఖమ్మం జిల్లాలోని సంస్థల యజమానులు, ఉద్యోగులు, పెన్షనర్లు ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్, జిల్లా కార్యాలయం, ఖమ్మం వారు మే 27న (బుధవారం) ఉదయం 9:30 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు "నిధి ఆప్కే నికట్ కార్యక్రమాన్ని ఖమ్మం లలిత జ్యూవెలరీ వద్ద నిర్వహించనున్నట్టు ప్రాంతీయ పీ.ఎఫ్ కమీషనర్ వై.డి. శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ఉద్యోగులు, యజమానులు, పెన్షనర్లకు వివిధ సేవలు, అవగాహన కార్యక్రమాలు అందించ బడతాయి అని అన్నారు. ఉద్యోగుల కోసం ఆన్‌లైన్ సేవలపై అవగాహన కల్పించడం, కొత్తగా కవరైన సంస్థల యజమానులకు పరిచయం, ఆన్ లైన్ సేవల వివరాలు, పెన్షనర్ లకు జీవన్ ప్రమాణ, ఇతర సమస్యల పరిష్కారం, ప్రధాన మంత్రి వికసిత్ భారత్ రోజ్ గార్ యోజనపై అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ప్రాంతీయ పీ.ఎఫ్ కమీషనర్ శ్రీనివాస్ ఆ ప్రకటనలో తెలిపారు.

## వి ఈవో కార్మికుల కనీస వేతనం 26 వేల రూపాయలు పెంచాలి...

- ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి...
- యామాల గోపాలరావు
- సిపిఐ మండల కార్యదర్శి



ఖమ్మం స్టాఫ్ రిపోర్టర్ మే 26 వైరా( అక్షరం న్యూస్)

వైరా రాష్ట్రంలో పెరుగుతున్న ధరలకు అనుకూలంగా వేలాదిమంది కార్మికులు కనీస వేతనం అందక అనేక ఇబ్బందులు కు గురి అవుతున్నారు వారి కనీస వేతనం 26 వేల రూపాయలు పెంచి ప్రభుత్వం వెంటనే వివో ల కార్మికులను ఆదుకోవాలని సిపిఐ వైరా మండల కార్యదర్శి యామాల గోపాలరావు డిమాండ్ చేసినారు వైరాలో గత ఐదు రోజుల నుండి వివో లు రిలే నిరాహార దీక్షలు చేస్తున్న ప్రభుత్వం వారి సమస్యల పరిష్కరించడంలో చిత్తశుద్ధి చూపించటం లేదని తీవ్రమైన ఎండలలో 50 డిగ్రీలు చూపిస్తున్న వారు టెంట్ల వద్ద నుండి లేవకుండా సమస్యల పరిష్కారం కోసం పోరాడుతూనే ఉన్నారని వారు అన్నారు. ఎన్నికల హామీలలో ప్రభుత్వం సంఘటిత అసంకటి వీఇవో గ్రామపంచాయతీ వర్కర్లను రెగ్యులర్ చేస్తామని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఇప్పుడు కన్నెత్తి వారి వైపు చూడకుండా ఉండటం సరైనది కాదని అన్నారు విఇఓ లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని వారి డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి మూటకొండ ఏఐటిసి మండల కార్యదర్శి గారపాటి అశోక్ కొండా రామకృష్ణ తదితరులు పాల్గొని దీక్షలకు సంఘీభావం తెలిపారు. ఐదో రోజు దీక్ష శిబిరంలో గ్రామ దీపికలు రాధమణి మల్లీశ్వరి విజయలక్ష్మి స్రవంతి సైనాజ్ పద్మావతి శైలజ ప్రభావతి నిర్మల గ్రామదేవతల మండల అధ్యక్షులు గద్దె నీరజ తదితరులు పాల్గొన్నారు.

# వరద విపత్తులు ఎదుర్కొనేందుకు పటిష్ట కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలి...

- జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్
- ప్రాణ, ఆస్తి నష్ట నివారణే ప్రధాన లక్ష్యం...
- అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి..
- లోతట్టు ప్రాంతాలు, ముంపు రహదారులు, బలహీన చెరువు కట్టలపై ప్రత్యేక దృష్టి సారించాలి..
- ముంపు గ్రామాలు, కట్ ఆఫ్ ప్రాంతాలను ముందుగానే గుర్తించి పునరావాస కేంద్రాలు సిద్ధం చేయాలి..
- విద్యుత్ ప్రమాదాలు, పాత భవనాల కూల్చివేతలు, చెట్ల విరుగుడు ఘటనలపై అప్రమత్తంగా ఉండాలి..
- వరదల అనంతరం వ్యాధుల నివారణకు
- ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టాలి..
- వరద విపత్తుల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్..






ఖమ్మం స్టాఫ్ రిపోర్టర్ మే 26 (అక్షరం న్యూస్)

రానున్న వర్షాకాలంలో సంభవించే వరద విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ముందస్తు కార్యాచరణ ప్రణాళికతో అన్ని శాఖలు అప్రమత్తంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వరద విపత్తుల నిర్వహణ సన్నద్ధతపై సంబంధిత శాఖల అధికారు లతో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ పోలీస్ కమీషనర్ సునీల్ దత్, అదనపు కలెక్టర్లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస్ రెడ్డి లతో కలిసి సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ గతంలో ఖమ్మం జిల్లాలో సంభవించిన భారీ వరదలను దృష్టిలో ఉంచుకొని ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. విపత్తుల సమయంలో ముందస్తు సిద్ధతే ప్రాణ నష్టాన్ని తగ్గించే మార్గమని పేర్కొన్నారు.వరదలు ముందస్తు హెచ్చరికలు లభించే విపత్తులని, సరైన ప్రణాళికతో సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని తెలిపారు. వరదల సమయంలో ప్రధానంగా లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడమే ముఖ్య బాధ్యత అని అన్నారు. మానవ ప్రాణాలు, పశువుల ప్రాణనష్టం జరగకుండా చూడడం అత్యంత ప్రాధాన్యతగా తీసుకోవాలని ఆదేశించారు.ప్రతి పరిస్థితిని ముందుగానే అంచనా వేసి దానికి అనుగుణంగా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారి ఆధ్వర్యంలో 24 గంటల కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని, అందులో రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్, విద్యుత్ శాఖలు కీలకంగా పనిచేయాలని పేర్కొన్నారు. మూడు షిఫ్టుల్లో సిబ్బందిని నియమించి నిరంతర పర్యవేక్షణ నిర్వహించాలని ఆదేశించారు. 1077 టోల్ ఫ్రీ నంబర్‌ను విస్తృతంగా ప్రజల్లో ప్రచారం చేయాలని సూచించారు. అత్యవసర సమయాల్లో వెంటనే సమాచారాన్ని అందించేందుకు సంబంధిత అధికారుల కాంటాక్ట్ బుక్ సిద్ధంగా ఉండాలని తెలిపారు. నీటి మట్టాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు.వరదల సమయంలో అవసరమైన నివేదికలను వెంటనే సమర్పించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ముంపుకు గురయ్యే గ్రామాలు, ప్రభుత్వ సంస్థలు, సంబంధాలు తెగిపోయే గ్రామాల జాబితా, కూలిపోయే ప్రమాదంలో ఉన్న ఇళ్ల వివరాలు ముందు గానే సిద్ధం చేయాలని సూచించారు. ఎన్ని కుటుంబాలను తరలించాల్సి వస్తుందో, ఎన్ని పునరావాస కేంద్రాలు అవసరమవు తాయో, అందులో అవసరమైన సౌకర్యాలు ఏమిటో అన్న వివరాలతో ముందస్తు నివేదికలు సిద్ధంగా ఉంచాలని తెలిపారు.

సంబంధాలు తెగిపోయే గ్రామాల్లో అవసరమైన నిత్యావసర వస్తువులు ముందుగానే తగినంత నిల్వ ఉంచాలని సూచించారు. కమ్యూనికేషన్ కోసం ప్రత్యేక వ్యక్తిని నియమించాలని ఆదేశించారు. అన్ని పెట్రోల్ బంకులను అప్రమత్తంగా ఉంచాలని తెలిపారు. వరదల సమయంలో అత్యవసర ఖర్చుల కోసం సంబంధిత శాఖలకు జిల్లా యంత్రాంగం ముందస్తు నిధులు అందజేస్తుందని,వాటిని బాధ్యతాయుతంగా వినియోగించాలని సూచించారు.ప్రతి మండలంలో ఎంపీడీవో, ఎంఈఓ, ఎంపీఓ, తహసీల్దార్, పోలీస్ అధికారులు, వైద్య సిబ్బంది, ఆర్ అండ్ బి, విద్యుత్ శాఖ అధికారులు సభ్యులుగా మండల స్థాయి కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. ఆయా మండలాలకు అనుగుణంగా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని ఆదేశించారు.పాత ఇళ్లు కూలిపోవడం వల్ల ప్రాణనష్టం సంభవిస్తున్నందున కూలిపోయే ప్రమాదంలో ఉన్న భవనాలను ముందుగానే గుర్తించి నోటీసులు జారీ చేయాలని సూచించారు. వరద నీరు ప్రవహించే కల్వర్టులు, క్రాస్ రోడ్లు, లోతట్టు రహదారుల వద్ద ప్రజలు దాటేందుకు ప్రయత్నించి ప్రమాదాలకు గురవుతున్నారని, అలాంటి ప్రాంతాలను ముందుగానే గుర్తించి వరదల సమయంలో పూర్తిగా మూసివేయాలని తెలిపారు. ప్రజలు దాటరాదని ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతో పాటు పోలీసు సిబ్బందిని నియమించాలని ఆదేశించారు.చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలిపోవడం వల్ల కూడా ప్రమాదాలు సంభవిస్తున్నాయని, ప్రతి మండలంలో భారీ చెట్లను గుర్తించి కొమ్మలు తొలగించే చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి మండలంలో వుడ్ కట్టింగ్ యంత్రం అందుబాటులో ఉండాలని తెలిపారు. అభివృద్ధి పనులు జరుగుతున్న ప్రదేశాల్లో అవసరమైన డిమార్కేషన్, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

వర్షాకాలంలో పెచ్చులు ఊడిపోయే ప్రమాదంలో ఉన్న పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను గుర్తించి ప్రమాదకర గదులను వినియోగించరాదని సూచించారు. ముంపుకు గురయ్యే పాఠశాలల విషయంలో స్థానిక పరిస్థితులను బట్టి సెలవులు మంజూరు చేయాలని తెలిపారు.లోతట్టు, దూర ప్రాంత గ్రామాలు, కట్ ఆఫ్ గ్రామాలను ముందుగానే గుర్తించి అత్యవసర పరిస్థితుల్లో వెంటనే పునరావాస కేంద్రాలకు తరలించేలా ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. అత్యవసర వైద్య సేవలు అవసరమయ్యే వారికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు.

విద్యుత్ ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, వరదల అనంతరం వెంటనే విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు అవసరమైన స్తంభాలు, వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. అన్ని రహదారులపై గుంతలను పూడ్చాలని, తాగునీటి పైప్‌లైన్‌లకు నష్టం వాటిల్లితే వెంటనే మరమ్మతులు చేపట్టాలని తెలిపారు.



గత అనుభవాల ఆధారంగా ముంపు గ్రామాలు, ప్రమాద ప్రాంతాలను గుర్తించి సమీపంలోనే పునరావాస కేంద్రాలు సిద్ధంగా ఉంచాలని సూచించారు. తాళ్లు, టార్చ్‌లైట్లు, బోట్లు వంటి అవసరమైన సామగ్రిని సిద్ధంగా ఉంచాలని,ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు ఒక కేంద్రంలో సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రతి మండలంలో మంచి ఈత తెలిసిన వ్యక్తుల జాబితా సిద్ధంగా ఉంచాలని సూచించారు. విపత్తు సమయంలో హీరోలాగా ప్రవర్తించడం ప్రమాదాన్ని పెంచుతుందని, వాలంటీర్లు క్రమశిక్షణతో పనిచేయాలని తెలిపారు. ముందస్తు సిద్ధతతో 99 శాతం ప్రమాదాలను నివారించవచ్చని పేర్కొన్నారు.వాగులు, చెరువులు, ఎగువ జిల్లాల నీటి మట్టాలు, ట్రిగ్గర్ పాయింట్లు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. వాగులతో అనుసంధానమైన చెరువుల నీటి మట్టాలను కూడా క్రమం తప్పకుండా పరిశీలించాలని తెలిపారు. చెరువు కట్టల్లో బలహీనతలు ఉంటే వెంటనే గుర్తించి మరమ్మతులు చేపట్టాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ చెరువులకు గండిపడకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

వరదల అనంతరం దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల ముప్పు ఎక్కువగా ఉంటుందని, మున్సిపల్, పంచాయతీ శాఖలు వైద్య ఆరోగ్య శాఖతో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చూడాలని, పారిశుధ్య చర్యలు చేపట్టాలని, తాగునీటి లీకేజీలను అరికట్టాలని ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన తాగునీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

పోలీస్ కమీషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ.. వరదల సమయంలో రాకపోకలు నిలిచిపోయే కట్ ఆఫ్ రహదారుల సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచాలని సూచించారు. అవసరమైనచోట్ల డైవర్షన్ బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రజలు కూడా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. గ్రామ సర్పంచులు, స్థానిక ప్రజా ప్రతినిధులను మరింతగా భాగస్వామ్యం చేయాలని తెలిపారు. అన్ని పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్లకు స్థానిక అధికారులతో సమన్వయం చేసుకుని సమస్యలను పరిష్కరించేలా ఆదేశాలు జారీ చేస్తామని పేర్కొన్నారు.

నిర్మాణ పనులు జరుగుతున్న ప్రదేశాలను వెంటనే డిమార్కేషన్ చేయాలని సూచించారు. లోతట్టు ప్రాంతాలు, ముంపుకు గురయ్యే రహదారులను ట్రాక్టర్లతో పూర్తిగా మూసివేయాలని తెలిపారు. కీలక ప్రాంతాల్లో ప్రజలు వెళ్లకుండా అడ్డుకునేందుకు పోలీసు సిబ్బందిని నియమిస్తామని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. రక్షణ చర్యలకు అవసరమైన అన్ని సామగ్రిపై వెంటనే ఆడిట్ నిర్వహించాలని ఆదేశించారు.

అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ మండల స్థాయి బృందాల్లో స్థానిక యువత, ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని సూచించారు. దీంతో వరదల సమయంలో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం మరింత సులభమవుతుందని తెలిపారు. గురుకుల విద్యాసంస్థల్లో కూడా వరదల సమయంలో సమస్యలు తలెత్తే అవకాశమున్నందున ప్రత్యేక సమావేశం నిర్వహించాలని సూచించారు. తహసీల్దార్లు, ఎంపీడీవోలు అన్ని గురుకుల విద్యాసంస్థలను పరిశీలించి ఎక్కడైనా నీటి ముంపు సమస్యలు ఉంటే ముందుగానే గుర్తించి పరిష్కార చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

వరదల సమయంలో ఏర్పాటు చేసే పునరావాస కేంద్రాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని సూచించారు. అలాగే ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు విడుదలయ్యే పరిస్థితుల్లో దిగువ మండలాలకు ఇరిగేషన్ శాఖ ముందస్తుగా సమాచారాన్ని అందించాలని తెలిపారు.

అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ కొన్ని సందర్భాల్లో వరద నీటి ప్రవాహ వేగం చాలా అధికంగా ఉంటుందని, దీనిని కూడా అంచనా వేసి నివేదికలు సిద్ధం చేయాలని సూచించారు. రాబోయే గంటలో ఎంత మేర వరద వచ్చే అవకాశం ఉందో ముందుగానే అంచనా వేయాలని తెలిపారు. తరలించేందుకు ఇబ్బందిగా ఉండే వృద్ధులను ముందుగానే పునరావాస కేంద్రాలకు తరలించాలని తెలిపారు. ఈ సమావేశంలో ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, జెడ్పీ సీఈఓ దీక్షా రైనా, మునిసిపల్ కమిషనర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## వరి గడ్డితో పాటు పశువుల కొట్టం దగ్ధం

- సుమారు రూ.60 వేల ఆస్తి నష్టం



జనగామ జిల్లా/రఘునాథపల్లి/( అక్షరం న్యూస్)మే 26: ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్ సంభవించడంతో వరి గడ్డి కట్టలతో పాటు పశువుల కొట్టం దగ్ధమైన సంఘటన మండలంలోని అయ్యవారిగూడెం గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. దీంతో సుమారు రూ.60 వేల ఆస్తి నష్టం వాటిల్లిందని భాదిత రైతు తెలిపారు. పార్నంది యాదగిరి తన పంట పొలంలో కోసిన వరి ధాన్యం ను కొనుగోలు కేంద్రంకు తరలించిన అనంతరం కట్టలుగా కట్టిన వరి గడ్డిని ట్రాక్టర్ లో తరలించడానికి తన పశువుల కొట్టం సమీపంలో భద్రపర్చగా, ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్ సంభవించడంతో మంటలు లేచి వరి గడ్డి కట్టలతో పాటు పశువుల కొట్టం పూర్తిగా ఆగ్నికి ఆహుతి అయ్యాయి. ప్రమాదం సంభవించిన సమయంలో పశువుల కొట్టంలో పుశువులు లేకపోవడంతో తీవ్ర నష్టం వాటిల్ల లేదు. ప్రమాదంలో సుమారు రూ.60 వేల ఆస్తి నష్టం వాటిల్లిందని భాదిత రైతు పార్నంది యాదగిరి రోదిస్తు తెలిపారు. భాదిత రైతుకు ప్రభుత్వం తగిన ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## ఎన్ టి పి సి సి ఎస్ ఆర్ అధికారులకు సమస్యలు వివరించిన కార్పోరేటర్



జ్యోతి నగర్ ఎన్టిపిసి మే 26 పెద్దపల్లి జిల్లా అక్షర న్యూస్

ఎన్టిపిసి సి ఎస్ ఆర్ నుండి 29వ డివిజన్ లింగాపూర్ గ్రామంలో మంగళవారం పర్యటించిన అధికారుల బృందానికి గ్రామంలోని పలు సమస్యలు కార్పొరేటర్ నిమ్మరాజుల రజని వివరించారు. గ్రామస్తులతో అభిప్రాయ సేకరణ కోసం సమావేశం ఏర్పాటు చేశారు. కావలసిన మౌలిక వసతులు రోడ్లు డ్రైనేజీలు మహిళలకు ఉపాధి నిరుద్యోగులకు ఉద్యోగం మర యువతకు స్పోర్ట్స్ వంటి వాటిని వివరిస్తూ 29 డివిజన్ కార్పొరేటర్ నిమ్మరాజుల రజని రవి వినతి పత్రం సమర్పించారు.

## గొల్లపూడి రైతు వేదికలో పంట వ్యర్థాలను కాల్చకూడదని రైతులకు అవగాహన...

- వైరా ఏడిఏ కరుణశ్రీ,
- ఏవో మయన్ మంజుఖన్



ఖమ్మం స్టాఫ్ రిపోర్టర్ మే 26 వైరా (అక్షరం న్యూస్)

వైరా మండల వ్యవసాయ అధికారి మయాన్ మంజూ ఖాన్ గొల్లపూడి రైతు వేదిక నందు పంట వ్యర్థాలను కాల్చకూడదని రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు .ఈ కార్యక్రమంలో వైరా డివిజన్ ఏడిఏ టీ కరుణశ్రీ మాట్లాడుతూ వానాకాలం సీజన్ కోసం భూములను సిద్ధం చేసే క్రమంలో రైతులు పంట వ్యర్థాలను తగలబెట్టడం చేస్తున్నారు దీనివలన గాలి కాలుష్యం పెరిగి ప్రజారోగ్యం దెబ్బతినడమే కాకుండా ముఖ్యంగా వేసవి కాలంలో మంటలు వేగంగా వ్యాపించి పెద్ద ఎత్తున ఆస్తి ప్రాణ నష్టం జరిగే అవకాశం ఉందని తెలియజేశారు. ఈ విధంగా పంట వ్యర్థాలను కాల్చడం ద్వారా భూమిలోని సారం తగ్గిపోతుంది అని భూమిలోనే సూక్ష్మజీవులు చనిపోతాయని తద్వారా పంటకు అందవలసిన పోషకాలు తగ్గిపోతాయని తెలియజేశారు. పంట అవశేషాలు కాల్చకుండా నెలలోనే కలియుదువున్నారని విజ్ఞప్తి చేశారు ఇలా చేయడం వల్ల భూసారం పెరుగుతుంది మరియు అధిక దిగుబడి వస్తుంది అని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వైరా ఏడిఏ టి. కరుణశ్రీ మండల వ్యవసాయ అధికారి మయాన్ మంజు ఖాన్ గొల్లపూడి గ్రామ సర్పంచ్ మెదూరి రామారావు, హార్టికల్చర్ ఆఫీసర్ వేణు, ఎఫ్ పి ఓ చైర్మన్ రాణి,గ్రామ రైతులు కొత్తపల్లి వెంకటేశ్వర్లు, సవల్ల ఆదిరెడ్డి , తదితరులు పాల్గొన్నారు.

# రచ్చగుట్ట తవ్వకాల కోసం ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలి

- నిలిపివేయాల్సిన బాధ్యత అధికార ప్రభుత్వానిది, గ్రామ పాలకవర్గానిదే




జ్యోతి నగర్ ఎన్టిపిసి మే 26 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

అంతర్గాం మండలం పెద్దంపేట గ్రామంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజా పంథా ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా ముఖ్య సమావేశం జరిగింది. లిఈ సమావేశంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజా పంథా పెద్దపెల్లి డివిజన్ కార్యదర్శి తోకల రమేష్, అంతర్గాశీ మండల కార్యదర్శి గుమ్మడి వెంకన్న, జిల్లా నాయకులు ఆడేపు శంకర్, గొల్లపెల్లి చంద్రయ్య మాట్లాడుతూలి పెద్దంపేట గ్రామ ప్రజల పకృతి సంపదగా ఉన్న రచ్చగుట్టను అక్రమార్కులు తవ్వుతూ మట్టిని తరలించుకుపోతున్నారు. రైల్వే పనుల కోసం, రోడ్డుపనుల కోసం గ్రామ చారిత్రిక నేపథ్యం కలిగిన రచ్చ గుట్ట కనుమరుగు చేసేందుకు ప్రభుత్వము, కొంతమంది రాజకీయనేతలు ప్రయత్నిస్తున్నారు. రచ్చ గుట్టను కాపాడుకోవడానికి ఎంతకైనా ముందుంటామని ప్రకటించిన అధికార పార్టీ ప్రకటనను, గ్రామ పాలకవర్గం చేసిన ప్రకటనను స్వాగతిస్తున్నాం. మాటలకే పరిమితం కాకుండా రచ్చగుట్టలో మట్టి తవ్వకాలు నిలిపివేసే విధంగా చిత్తశుద్ధితో కూడిన చర్యలు తీసుకోవాలని మాస్ లైన్ ప్రజా పంథా విజ్ఞప్తి చేస్తున్నది. ఇప్పటికీ రచ్చ గుట్టలో మట్టి తవ్వకాలు నిలిపివేయకపోవడం అనేక అనుమానాలకు తావు ఇస్తున్నది. చేస్తున్న ప్రకటనలకు జరుగుతున్న పరిణామాలకు పొంతన లేని పరిస్థితి ఉన్నది. గ్రామ పాలకవర్గం న్యాయస్థానాన్ని ఆశ్రయించినప్పటికీ ఏమాత్రం న్యాయస్థానం ఆదేశాలను లెక్కచేయకుండా నేటికీ మట్టి తవ్వకాలు కొనసాగించడం పట్ల అభ్యంతరాన్ని వ్యక్తం చేస్తున్నాం. ఇప్పటికే ఈ ప్రాంతంలో కాలుష్యం పెరిగిపోయి ప్రజల జీవితాల్లో మార్పులు వస్తున్న పరిస్థితి ఉన్నది. పెద్దంపేట గ్రామానికి పకృతి సంపదగా ఉన్న రచ్చ గుట్టను పర్యాటక కేంద్రంగా మార్చాలని డిమాండ్ చేస్తున్నాం. పోరాట వారసత్వం, చైతన్యం కలిగిన పెద్దంపేట గ్రామ ప్రజలంతా రచ్చగుట్టను కాపాడుకోవడానికి గ్రామ ప్రజలంతా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.లిఇంకా ఈ సమావేశంలో జూ× మీా మాస్ లైన్ ప్రజా పంథా పెద్దపెల్లి డివిజన్ కార్యదర్శి తోకల రమేష్, అంతర్గాం మండల కార్యదర్శి గుమ్మడి వెంకన్న, జిల్లా నాయకులు ఆడెపు శంకర్, గొల్లపల్లి చంద్రయ్య, గూడూరు వైకుంఠం, తూల్ల శంకర్ మాజీ సర్పంచ్ మార్త రాద, కోడిపుంజుల లక్ష్మి, బుర్ర బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

## బక్రీదు పండుగ సందర్భంగా..ఈద్గా వద్ద ఏర్పాట్లు...



ఖమ్మం స్టాఫ్ రిపోర్టర్ మే 26 వైరా (అక్షరం న్యూస్)

వైరా రిజర్వాయర్ ఆనకట్ట సమీపంలో ముస్లిం సోదరులకు ప్రభుత్వం కేటాయించిన ఈద్గా స్థలాన్ని కాంగ్రెస్ పార్టీ పట్టణ నాయకులు వేముల రత్నాకర్ దగ్గరుండి శుభ్రం చేయించారు.. రాబోయే బక్రీద్ పండుగ సందర్భంగా ఈద్గా వద్ద ముస్లిం సోదరులకు నమాజ్ కై కావలసిన సౌకర్యాలను . ముస్లిం పెద్దలు వైరా మజీద్ కమిటీ అధ్యక్షులు షేక్ రసూల్, ముస్లిం వెల్ఫేర్ కమిటీ అధ్యక్షులు షేక్ కౌసర్ లను అడిగి తెలుసుకున్నారు.. ముస్లిం సోదరులకు పలు సౌకర్యాలను కల్పించేందుకు గాను దగ్గరుండి స్థలాన్ని పరిశీలించారు..

## బ్యాడ్మింటన్ లో ప్రతిభ చూపిన క్రీడాకారులను అభినందించిన పోలీస్ కమిషనర్..

- పోలీస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ శిక్షణతో రాణిస్తున్న పోలీస్ పిల్లలు..



ఖమ్మం స్టాఫ్ రిపోర్టర్ మే 26 (అక్షరం న్యూస్)

జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో

మే 23,24 తేదీల్లో నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహించిన అండర్ -11,13 జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ - 2026 సింగిల్స్, డబుల్స్ పోటీలలో ప్రతిభ చూపి 12వ యోనెక్స్- సన్‌రైజ్ తెలంగాణ రాష్ట్ర సీనియర్, సబ్-జూనియర్ ఛాంపియన్‌షిప్ టోర్నమెంట్లకు అర్హత సాధించిన క్రీడాకారులను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అభినందించారు. పోలీస్ సంక్షేమ కార్యక్రమంలో భాగంగా ఇటీవల రాష్ట్ర డీజీపీ నూతనంగా ప్రారంభించిన పోలీస్ స్పోర్ట్స్ కంప్లెక్స్ లో బ్యాడ్మింటన్ శిక్షణ పొందిన పోలీస్ సిబ్బంది పిల్లలుఇస్లావత్ కీర్తిష్, వి.నిశాంత్, వి.శ్రీ మేధాన్షా, (టి.మనోజ్, వి.రోహిత్ సీనియర్ విభాగం మరియు కోచ్ లు ) జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ లో ప్రతిభ చూపటం అభినందనీయమన్నారు.క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందిస్తాయని అన్నారు. బ్యాడ్మింటన్ వంటి క్రీడలకు మరింత ప్రోత్సాహం అందించి క్రీడల్లో రాణిస్తున్న పోలీస్ స్పోర్ట్స్ కంప్లెక్స్ ను సద్వినియోగం చేసుకోవాలని పోలీస్ కమిషనర్ సూచించారు. కార్యక్రమంలో ఏ ఆర్ ఏసీపీ సుశీల్ సింగ్, నర్సయ్య, ఆర్ఐ కామరాజు పాల్గొన్నారు.

## ఎన్‌టీపీసీ స్పోర్ట్స్ కౌన్సిల్ ఎన్నికల్లో శ్రీరామ్ విజేత



జ్యోతి నగర్ ఎన్టిపిసి మే 26 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

ఎన్టి టౌన్‌షిప్‌లోని మహాత్మా గాంధీ స్టేడియంలో మంగళవారం నిర్వహించిన ఎన్‌టీపీసీ స్పోర్ట్స్ కౌన్సిల్ ప్రధాన కార్యదర్శి ఎన్నికలు ఉత్కంఠభరితంగా సాగాయి. మొత్తం 674 ఓట్లకు గాను 456 ఓట్లు పోలయ్యాయి.ప్రధాన కార్యదర్శి పదవికి పోటీ చేసిన వైభవ్ రస్తోగి కి 212 ఓట్లు రాగా, శ్రీరామ్ 244 ఓట్లు సాధించి విజేతగా నిలిచారు. దీంతో స్పోర్ట్స్ కౌన్సిల్ ఎన్నికల్లో శ్రీరామ్ గెలుపొందినట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు.ఎన్నికల సందర్భంగా మహాత్మా గాంధీ స్టేడియం వద్ద ఉదయం నుంచే సందడి నెలకొంది. ఉద్యోగులు, క్రీడాకారులు పెద్ద సంఖ్యలో హాజరై తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో ముగిసింది.ఇక ఇప్పటికే స్పోర్ట్స్ కౌన్సిల్‌లోని ఇతర పదవులు ఏకగ్రీవంగా ఎన్నికైన విషయం తెలిసిందే. ప్రధాన కార్యదర్శి పదవికి మాత్రమే ఎన్నికలు నిర్వహించగా, ఫలితాలు వెలువడిన వెంటనే శ్రీరామ్ అనుచరులు ఆనందోత్సాహాలతో సంబరాలు నిర్వహించారు.

## బిజెపి తీరుతో భారంగా మారిన జీవనం..

- ధరలను నియంత్రించండి..



ఖమ్మం స్టాఫ్ రిపోర్టర్ మే 26( అక్షరం న్యూస్)

ఖమ్మం : బిజెపి తీరుతో ప్రజల జీవనం భారంగా మారిందని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ ఆరోపించారు. మోడీ అనుసరిస్తున్న విధానాలు పేద, మధ్యతరగతి ప్రజలకు శాపంగా మారాయని ఆయన తెలిపారు. ధరల పెరుగుదలకు సంబంధించి మంగళవారం పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని -ఇదే సమయంలో పెట్రో ధరలను విపరీతంగా పెంచుతుందని ఆయన తెలిపారు. బిజెపి అధికారంలోకి వచ్చిన నాటికి నేటికి పెట్రోల్ ధరల్లో -ఎంత పెరుగుదల కనిపించిందో ప్రజలు గమనించి ఈ ప్రభుత్వాన్ని నిలదీయాలన్నారు. కేవలం 15 రోజుల వ్యవధిలోనే మూడుసార్లు పెట్రో ధరలను పెంచారని దీనితో ప్రజలపై అదనపు భారం పడుతుందని పెట్రోల్ వినియోగదారులకే కాకుండా డీజిల్, పెట్రోల్ ధరల పెంపుతో రవాణా ఛార్జీలు పెరిగి నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతాయన్నారు. పదేళ్ల కాలంలో నిత్యావసర వస్తువుల ధరలు రెండు రేట్లు పెరిగాయని సురేష్ తెలిపారు. మోడీ పాలన కేవలం సంపన్నుల కోసమే సాగుతుందని ఇప్పుడు కూడా ఆయిల్ కంపెనీల లాభాల కోసమే ప్రజలపై భారాలు మోపారన్నారు. పెంచిన ధరలను తక్షణం ఉపసంహరించుకోవాలని సిపిఐ డిమాండ్ చేస్తుందన్నారు. ధరల పెరుగుదలపై పోరాట కార్యాచరణ రూపొందించుకుని ముందుకు సాగుతామని ఆయన తెలిపారు.

## జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి



సంగారెడ్డి జిల్లా /నారాయణఖేడ్/మే 26/అక్షరం న్యూస్ :

రైతన్నలు పండించిన ప్రతి గింజకూ సరైన న్యాయం చేయడమే ప్రభు త్వ లక్ష్యమని నారాయణఖేడ్ శాసనస భ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నా రు. మంగళవారం నారాయణఖేడ్ మండ ల పరిధిలోని ర్యాకల్ గ్రామంలో గల రైతు వేదికలో, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పి ఎస్ సీ ఎస్ ) ఆధ్వర్యంలో నూ తనంగా ఏర్పాటు చేసిన జొన్నల కొనుగో లు కేంద్రాన్ని ఆయన ముఖ్య అతిథిగా వి చ్చేసి, రిబ్బన్ కట్ చేసి అధికారికంగా ప్రా రంభించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూరైతులు తాము పండించిన జొ న్న పంటను తక్కువ ధరకే అమ్ముకొని నష్ట పోకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం మద్దతు ధరతో ఈ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని తెలిపారు. ప్రభుత్వం జొన్నలకు క్వింటాలుకు 3,699 మద్దతు ధరను నిర్ణ యించిందని, రైతులు ఈ అవకాశాన్ని స ద్వినియోగం చేసుకోవాలని కోరారు. దళా రులను ఆశ్రయించి తక్కువ ధరకు అమ్ము కోవద్దని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే వి క్రయించి మద్దతు ధర పొందాలని రైతుల కు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏ డి ఏ నూతన్ కుమార్, ఏ ఈ ఓ రఘు, జ్ఞానేశ్వ ర్, ప్రతాప్ రెడ్డి,కిషన్ నాయక్,లక్ష్మి మోహ న్ రెడ్డి, కర్ర సక్రి బాయి గుండ్య నాయక్ , శ్రీధర్ రెడ్డి సర్పంచ్లు, జైపాల్ ఉప సర్పంచ్, రమేష్ చౌహాన్ మాజీ ఎంపీపీ,పండరి రెడ్డి, దత్తు గౌడ్ మాజీ ఎంపీటీసీలు,రాజు మాజీ సర్పంచ్, వెంకట్ రెడ్డి,నరసింహ రెడ్డి, స్థాని క ప్రజాప్రతినిధులు,సహకార సంఘం (పి ఏ సీ ఎస్ ) అధ్యక్షులు, కార్యదర్శి, వ్యవ సాయ శాఖ అధికారులు, సొసైటీ డైరెక్టర్లు పరిసర ప్రాంతాల రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మహిళా సాధికారతకు, సంఘాల బలోపే తానికి ప్రభుత్వం పెద్దపీట

- **ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ వేడుకల్లో పా ల్గొన్న నారాయణఖేడ్ ఎమ్మెల్యే: డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి**



సంగారెడ్డి జిల్లా /నారాయణఖేడ్: మే 26/అక్షరం న్యూస్ :నారాయణఖేడ్ మండల పరిధిలోని ర్యాకల్ గ్రామంలో నారాయణఖే డ్ శాసనసభ్యుడు డాక్టర్ పట్లోళ్ల సంజీవరె డ్డి విస్తృతంగా పర్యటించారు. గ్రామంలో మహిళా సాధికారతకు, సంఘాల బలోపే తానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని అ న్నారు.గ్రామంలో నూతనంగా నిర్మించ తల పెట్టిన మహిళా సమైక్య భవన నిర్మాణ ప నులకు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకు లతో కలిసి భూమి పూజ (శంకుస్థాపన) చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందం జలో ఉండాలనే ఉద్దేశంతోనే ఈ భవన ని ర్మాణాన్ని వేగంగా పూర్తి చేసి అందుబాటు లోకి తీసుకువస్తామని హామీఇచ్చారు. అ నంతరం,అదే గ్రామానికి చెందిన లబ్ధిదారు రాలు అంజమ్మ (భర్త కిష్టయ్య) నూతన ఇందిరమ్మఇళ్ల గృహప్రవేశోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొని కుటుంబ సభ్యు లకు ఆయనశుభాకాంక్షలుతెలియజేశారు. పేదప్రజలసొంతింటి కలను నిజం చేయడ మే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, అ ర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధి చేకూరుస్తామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాల్లో మండల ప్రజాప్రతినిధులు,జ్ఞానేశ్వర్, ప్రతాప్ రెడ్డి , కిషన్ నాయక్,లక్ష్మి మోహన్ రెడ్డి, కర్ర సక్రి బాయి గుండ్య నాయక్,శ్రీధర్ రెడ్డి సర్పం చ్లు, జైపాల్ ఉప సర్పంచ్, రమేష్ చౌహాన్ మాజీ ఎంపీపీ,పండరి రెడ్డి,దత్తు గౌడ్ మా జీ ఎంపీటీసీలు,రాజు మాజీ సర్పంచ్, వెంక ట్ రెడ్డి,నరసింహ రెడ్డి,స్థానిక ప్రజాప్రతినిధు లు, ఎంపీటీసీలు, సొసైటీ చైర్మన్లు, స్థానిక కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి హరీష్ రావు ని మర్యాదపూర్వకంగా కలిసిన మాజీ ఎమ్మెల్యే: భూపాల్ రెడ్డి



సంగారెడ్డి జిల్లా /నారాయణఖేడ్ /మే 26/అక్షరం న్యూస్ :తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి, సిద్దిపేట శాసనసభ్యుడు తన్నీరు హరీష్ రావు విదేశీ పర్యటనను విజయ వంతంగా ముగించుకొని హైదరాబాద్ చే రుకోగా,నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ మర్యాదపూర్వకంగా కలుసుకొని శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ సందర్భంగా రాష్ట్ర రాజకీయ పరిస్థితు లు, ప్రజా సమస్యలు పార్టీ భవిష్యత్ పై కా ర్యాచరణపై చర్చించినట్లు సమాచారం. వారితో పాటు మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ మంజుశ్రీ జైపాల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శశిధ ర్ రెడ్డి, డిసిసిబి డైరెక్టర్ వెంకట్ రాములు, వెంకట్ రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహా అభియాన్ -- 2026



కామారెడ్డి జిల్లా/ ఎల్లారెడ్డి/ మే 26/ అక్షరం న్యూస్:

కామారెడ్డి జిల్లా ప్రశిక్షణా కా ర్యాశాల బాన్సువాడలోని జి ఆర్ ఆర్ కన్వె న్షన్ హాల్లో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులు, బీజేపీ రాష్ట్ర నాయకుడు బాణాల లక్ష్మారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యు డు పైడి ఎల్లారెడ్డి, రాష్ట్ర నాయకులు మురళీధర్ గౌడ్ ,మాజీ శాసనసభ్యురాలు అరు ణ తార, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, రవీందర్ రావు, ఎల్లారెడ్డి అసెంబ్లీ క న్వీనర్ లింగారావు , బీజేపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సొసైటీలో జీలుగు విత్తనాలు పంపిణీ



కామారెడ్డి జిల్లా/ఎల్లారెడ్డి /మే 26/అక్షరం న్యూస్:

ఎల్లారెడ్డి మండల కేంద్రంలో సొసైటీ కార్యాలయంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం రైతులకు సబ్సిడీపై జీలుగు విత్తనాలను సొసైటీ అధ్యక్షుడు ఏగుల నర్సింహులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం జీలుగు విత్తనాలను సబ్సిడీ పోను 30 కిలోల బస్తా 24 52.50 కే అందజేస్తుందన్నారు. కావల సిన రైతులు పాస్ బక్ జిరాక్స్, ఆధార్ కార్డ్ జిరాక్స్ తీసుకొని రావాలన్నారు. ఈ కార్య క్రమంలో సొసైటీ సీఈఓ విశ్వనాథం, డైరె క్టర్లు మర్రి సూర్య ప్రకాష్, లంబాడి లక్ష్మణ్, చిన్నంగారి సుఖేందర్ రెడ్డి, నాగం గోపికృష్ణ, తదితరులు రైతులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పిఏసి సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే: మదన్ మోహన్

- **పార్టీ బలోపేతం, భవిష్యత్ వ్యూహాలపై కీలక చర్చలు**



కామారెడ్డి జిల్లా/ఎల్లారెడ్డి/మే 26/అక్షరం న్యూస్:కామారెడ్డి పట్టణంలో మంగళవా రం డీసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ పటేల్ అధ్యక్షతనపొలిటికల్ అఫైర్స్ కమిటీ సమా వేశాన్ని ఏర్పాటుచేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా టిపిసిసి అధ్యక్షుడు మ హేష్ కుమార్ గౌడ్ హాజరయ్యారు. ఈ స మావేశంలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మో హన్ రావు పాల్గొన్నారు. సమావేశంలో కా మారెడ్డి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం, భవిష్యత్ రాజకీయ కార్యాచరణ, ప్రజా స మస్యల పరిష్కారం, గ్రామ స్థాయి నుంచి పార్టీ విస్తరణ వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. పార్టీని ప్రజలకు మరింత చేరు వ చేసే విధంగా కార్యాచరణ రూపొందిం చాలని నాయకులు నిర్ణయించారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ల డం,పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచే యడం, రాబోయే రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా వ్యూహాలు సిద్ధం చేయడం వంటి అంశాలపై సమావేశంలో కీలక నిర్ణ యాలు తీసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేం దుకు నాయకులు కట్టుబడి ఉన్నట్లు తెలి పారు. అనంతరం ఎల్లారెడ్డి నియోజకవ ర్గానికి చెందిన నూతన డీసీసీ కార్యవర్గ స భ్యులకు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కు మార్ గౌడ్, ఎమ్మెల్యే మదన్ మోహన్ ల చే తుల మీదుగా ఆర్డర్ కాపీలు అందజేశారు.

ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, ప్రభుత్వ సలహాదారుడు మహమ్మద్ అలీ షబ్బీర్, జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు, మాజీ ఎమ్మెల్యే యూసుఫ్ అలీ, మాజీ డీసీసీ అ ధ్యక్షులు, కామారెడ్డి ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్లు, టౌన్ నాయకులు, మండల అధ్య క్షులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సింహాద్రి అప్పన్నను దర్శించుకున్న ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



యాదాద్రి భువనగిరి జిల్లా /యాదగిరిగుట్ట /అక్షరం న్యూస్ :

మే 26 : ఆంధ్రప్రదేశ్ రాష్టం విశాఖపట్నంలో ప్రసిద్ది చెందిన సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య శ్రీమతి బీర్ల అనిత తమ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. 25వ వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సింహాద్రి అప్పన్నగా ప్రసిద్ధి చెందిన శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి వారి సన్నిధిలో దంపతులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక దర్శనం చేసుకుని, స్వామివారికి ప్రత్యేక పూజలు సమర్పించారు. ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక ఆశీర్వచనాలు అందజేసి, స్వామివారి తీర్థ ప్రసాదాలను బీర్ల అయిలయ్య గారికి అందించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు మరియు అర్చకులు సింహాచలం దేవస్థానం చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాముఖ్యతను వారికి వివరించారు. స్వామివారి కృపతో ప్రజలందరికీ ఆయురారోగ్యాలు ,సుఖశాంతులు కలగాలని బీర్ల అయిలయ్య –అనిత దంపతులు ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య తో పాటు ఆంధ్రప్రదేశ్కు చెందిన జిల్లా, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపారు. భక్తులతో కలిసి స్వామివారి దర్శనం చేసుకోవడం ఆనందంగా ఉందని, ఆధ్యాత్మిక క్షేత్రాల సందర్శన ద్వారా మరింత సేవాభావంతో ప్రజలకు అందుబాటులో ఉంటామని బీర్ల అయిలయ్య తెలిపారు

## రాఘవ కుటుంబాన్ని పరామర్శించిన మున్సిపల్ చైర్ పర్సన్ బీజన బాలమణి భాస్కర్



యాదాద్రి భువనగిరి జిల్లా/ యాదగిరిగుట్ట /అక్షరం న్యూస్ :

మే 26 :మంగళవారం రోజు ఆలేరు ద్వారకా నగర్ లో పులిపలుపుల మహేష్ కుమారుడు పులిపలుపుల రాఘవ రోడ్ ప్రమాదం లో మరణించాడు కావున ఆలేరు మున్సిపల్ చైర్ పర్సన్ బీజన బాలమణి భాస్కర్ మహేష్ కుటుంబాన్ని ఓదార్చి పరామర్శించి ఒక క్వింటాలు బియ్యం ఇవ్వడం జరిగినది. ఈ సందర్భంగా వారి వెంట ఆలేరు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కే.సాగర్ రెడ్డి, కౌన్సిలర్ లు పస్తశీ ఆంజనేయులు , జుకంటి సంపత్, చింతకింది మురళి, కాంగ్రెస్ నాయకులు జెట్టా సిద్దులు , ముదిగొండ శ్రీకాంత్ , పోరళ్ళ సతీష్, ఆలేటి అనిల్, తాళ్లపల్లి మహేష్, దూడల రాజశేకర్ , లోకేష్, ముదిగొండ ప్రదీప్ , సంపత్ మొదలగు వారు పాల్గొన్నారు.

## ఇంధన ధరలు పెరుగుదలతో పేద మధ్య తరగతి ప్రజల జీవనం పై పెను భారం

- **సిపిఎం జిల్లా నాయకులు ఎంఏ ఇక్బాల్ .**



యాదాద్రి భువనగిరి జిల్లా /యాదగిరిగుట్ట / మే 26 / అక్షరం న్యూస్ –: కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం దిక్కుమాలిన విదేశాంగ విధానం వల్ల , యుద్ధం ప్రభావం వల్ల ముడి చమురు ధరల పెరుగుదల ప్రభావం భారతదేశంపై విపరీతంగా ఉందని డీజిల్ పెట్రోల్ రేట్లు దశలవారీగా పెంచుకుంటూ పోవడం వలన దీని ప్రభావం వల్ల నిత్యవసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగి దేశంలోని పేద మధ్యతరగతి ప్రజలకు పెను భారంగా మారిందని ఆయన అన్నారు అంతేకాకుండా దేశ చరిత్రలో రూపాయి విలువ అత్యంత కిందికి దిగజారిపోయిందని దీనివల్ల దేశంలో విపరీతమైన నిరుద్యోగం పెరిగిందని యువత ఆగ్రహంతో బిజెపి ప్రభుత్వానికి బుద్ధి చెప్తారని అన్నారు .అమెరికా సామ్రాజ్యవాద పోకడలకు సామంతునిగా వ్యవహరిస్తున్న కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ట్రంప్ బెదింపులకు భయపడి రష్యా అతి చౌక ధరలకు ముడి చమురు ఇస్తామని చెప్పినప్పటికీ రష్యా నుండి ఎలాంటి ఉత్పత్తులను కొనవద్దని ట్రంప్ బెదిరింపులకు భయపడ్డ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అధిక ధరల భారాలను దేశ ప్రజలపై వేస్తుందని అన్నారు. అమెరికా కను సన్నలలో నడిచే ఆదానీ అంబానీ వ్యాపారాల మనుగడ కోసం ఆదాని అంబానీల కంపెనీల లాభాల కోసం నరేంద్ర మోడీ ప్రభుత్వం ట్రంప్ బెదిరింపులకు భయపడుతుందని కొంతమంది కార్పొరేట్ శక్తుల లబ్ధికోసం కోట్లాదిమంది దేశ ప్రజల ప్రయోజనాలను సామ్రాజ్యవాదులకు తాకట్టు పెడుతుందని అన్నారు. వెంటనే పెట్రోల్ డీజిల్ పై ఉన్న సుంకాలను తగ్గించి డీజిల్ పెట్రోల్ ధరలను తగ్గించే విధంగా చర్యలు తీసుకోవాలని అలా కాకుండా ఎన్నికల ముందు ధరల ఊసు ఎత్తకుండా ఎన్నికల తర్వాత ప్రజల నడ్డి విరిస్తే భవిష్యత్తులో దేశ ప్రజలు నరేంద్ర మోడీ ప్రభుత్వానికి బుద్ధి చెప్తారని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు.

## మల్లారం చెరువు పునరుద్ధరణ పనులకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే: మదన్ మోహన్



కామారెడ్డి జిల్లా/ఎల్లారెడ్డి/మే 26/అక్షరం న్యూస్:

ఎల్లారెడ్డి నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తున్న ఎమ్మె ల్యే మదన్ మోహన్ మంగళవారం లింగం పేట మండలం లింగంపల్లి ఖుర్ద్ గ్రామంలో ని మల్లారం చెరువు పునరుద్ధరణ మర మ్మత్తు పనులను ప్రారంభించారు. వరద నష్టం మరమ్మత్తు నిధుల కింద రూ.1.65 కోట్లతో చేపడుతున్న ఈ అభివృద్ధి పనుల కు ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకొని ప్రభు త్వ స్థాయిలో పలుమార్లు సంబంధిత అధి కారులను, ప్రభుత్వపెద్దలనుకలిసి నిధులు మంజూరు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువు పునరుద్ధ రణతో, గ్రామ రైతులకు సాగునీటి సౌకర్యం మెరుగుపడి, భూగర్భజలాలు పెరిగి గ్రామా భివృద్ధికి ఎంతో ఉపయోగపడుతుందని అ న్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, సీనియ ర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## మోత్కూర్ లో బీసీ ఉద్యోగుల బహిరంగ సభ

- క్రిమిలేయర్ నిబంధన ఎత్తి వేయాలి.
- రాజ్యసభ ఏం.పి ఆర్ కృష్ణయ్య.

యాదాద్రి భువనగిరి జిల్లా /యాదగిరిగుట్ట /అక్షరం న్యూస్ : మే 26 : కేంద్ర – రాష్ట్ర ప్రభుత్వం బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని బీసీ రిజర్వేషన్లపై ఉన్న క్రిమిలేయర్ నిబంధన ఎత్తి వేయాలని మోతుకూరు లో బీసీ ఉద్యోగుల సదస్సు జరుగుతుంది. ఈ సందర్భంగా ఆర్. కృష్ణయ్య ప్రసంగిస్తూ బీసీ ఉద్యోగులకు ప్రమోషన్ రిజర్వేషన్లు కల్పించడానికి పార్లమెంటులో రాజ్యాంగ సవరణ బిల్లు పెడతామన్నారు. బిసి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు పెట్టడానికి చట్టపరమైన, రాజ్యంగా పరమైన, న్యాయపరమైన అవరోధాలు, అడ్డంకులు ఏమీలేవు. రాజ్యాంగ బద్ధమైన మండల్ కమీషన్ బి.సి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు పెట్టాలని సిఫార్సు చేసింది. చట్టబద్ధమైన పార్లమెంటరీ కమిటీ చైర్మన్ నాచియప్పన్ కమిటీ బి.సి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు పెట్టాలని సిఫార్సు చేసింది. ఇక ఇటీవల సుప్రీంకోర్టు ఉత్తరప్రదేశ్ రిజర్వేషన్ల కేసు సందర్భంగా జనాభా ప్రకారం ఉద్యోగుల సంఖ్య లేకపోతే ఎస్.సి/ఎస్.టి/బి.సి లకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు పెట్టాలని తీర్పు చెప్పింది. అన్ని వైపుల నుంచి బి.సి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు పెట్టాలని బలమైన సిఫార్సులున్నాయి. అయినప్పటికీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అన్యాయం చేస్తున్నారని తెలిపారు.




విద్యా, ఉద్యోగ నియామకాలలో బి.సి రిజర్వేషన్ల పై క్రిమిలేయర్ నిబంధన విధించిన తీరు బి.సి ల పై వివక్ష, చిన్న చూపు చూస్తున్నట్లు స్పష్టంగా కన్పిస్తుంది. ఆరు రిజర్వేషన్ల వర్గాలు ఎస్సీ/ ఎస్టీ/ వికలాంగులు/ ఎన్ .సి.సి/ మహిళ రిజర్వేషన్లకు లేని క్రిమిలేయర్ బి.సి.ల కే ఎందుకు విధించారు? రిజర్వేషన్ల లక్ష్యం అర్థికాభివృద్ధి కాదు. పాలన లో బి.సి. లకు భాగస్వామ్యం కల్పించడం ఒకటైతే రిజర్వేషన్ల ద్వారా చదువు, ఉద్యోగం తద్వార అధికారం లో ఈ వర్గాల సామజిక హోదా పెంచడం ఇంకొక భాగం. కాని అర్థం పర్థం లేని క్రిమిలేయర్ బి.సి. లకే ఎందుకు కల్పించడం అర్థం లేదా? ఇది బి.సి ల పట్ల వివక్షత కాదా? ప్రభుత్వాలు ఇంత చిన్న విషయం లో కూడా బి.సి లకు అన్యాయం చేశారని విమర్శించారు. పార్లమెంట్ లో బి సి బిల్లు పెట్టి అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికలలో 50 శాతం రిజర్వేషన్లు పెట్టాలి. కేంద్రం లో బి.సి లకు ప్రతేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేసి 2 లక్షల కోట్లతో ప్రతేక అభివృద్ధి పథకం ప్రకటించాలి. బి సి ల విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లను 25 శాతం నుంచి 50 శాతం పెంచాలి. బి.సి లకు పారిశ్రామిక పాలసీ లో 50 శాతం కోటా ఇవ్వాలి. హై కోర్టు సుప్రీంకోర్టు జడ్జిల నియామకంలో ఎస్.సి/ఎస్.టి/బి.సి రిజర్వేషన్లు ప్రవేశపెట్టాలి. కేంద్రంలో ఖాలిగాఉన్న 16 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలి. ఈ సమావేశంలో విద్యుత్ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షులు కుమారస్వామి, ముత్యం వెంకన్న, , బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం వెంకటేష్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ పల్లగొర్ల మోదీరాందేవ్ యాదవ్, యాదగిరి, బికళాబృందం రామలింగం, డప్పు స్వామి కలిమల నరసింహ, ఎడ్ల మహాలింగం,నరేష్ ముదిరాజ్,అంజి గౌడ్, తదితరులు పాల్గొన్నారు...

## హక్కుల సాధనలో వెనక్కి తగ్గని గ్రామ దీపికలు

- అశ్వారావుపేటలో కొనసాగుతున్న సమ్మె ఉద్యమం.
- రూ.26 వేల కనీస వేతనం, ఉద్యోగ భద్రత కోసం నినాదాలు.
- దీక్షా శిబిరానికి మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు మద్దతు.
- మహిళా ఉద్యోగులకు భోజనం, కొబ్బరి నీళ్లు అందించిన కాసాని దంపతులు.


భద్రాద్రి కొత్తగూడెం/అశ్వారావుపేట / మే26 / అక్షరం న్యూస్ –:

తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం గ్రామ దీపికలు చేపట్టిన ఉద్యమం అశ్వారావుపేటలో ఉధృతంగా కొనసాగుతోంది. తెలంగాణ ఐకేపీ––వీఓఏల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఆధ్వర్యంలో రింగ్‌రోడ్ సెంటర్‌లోని పాత ఎంపీడీఓ కార్యాలయం ఎదుట కొనసాగుతున్న నిరవధిక సమ్మెలో గ్రామ దీపికలు మండుతున్న ఎండలను సైతం లెక్కచేయకుండా దీక్షలు కొనసాగిస్తూ తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వాన్ని కోరుతున్నారు. దీక్షా శిబిరానికి మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు హాజరై సంఘీభావం ప్రకటించారు. గ్రామ దీపికల సమస్యలను అడిగి తెలుసుకున్న ఆయన మాట్లాడుతూ, మహిళలు మండుటెండల్లో రోడ్డుపై కూర్చుని న్యాయం కోసం పోరాడుతుంటే పాలకులు, అధికారులు స్పందించకపోవడం బాధాకరమన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామ దీపికల సమస్యలను పార్టీ నాయకత్వం దృష్టికి తీసుకెళ్లి రాష్ట్రవ్యాప్తంగా అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు.



### గ్రామ దీపికల ఆవేదన -- ప్రధాన డిమాండ్లు

ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో తాము కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ తమ శ్రమకు తగిన గుర్తింపు లభించడం లేదని గ్రామ దీపికలు ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతున్న నిత్యావసర ధరల నేపథ్యంలో ప్రస్తుతం అందుతున్న గౌరవ వేతనంతో కుటుంబాలను పోషించడం కష్టంగా మారిందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, తమ డిమాండ్లు నెరవేరే వరకు సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు.



### గ్రామ దీపికల ప్రధాన డిమాండ్లు ఇవి:

వీఓఏలకు నెలకు రూ.26 వేల కనీస వేతనం అమలు చేయాలి. ఎస్ ఈ ఆర్ పి ఉద్యోగులుగా గుర్తించి పూర్తి స్థాయి హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలి.

సీనియారిటీ, అర్హతల ఆధారంగా సీసీలుగా పదోన్నతులు కల్పించాలి. ప్రతి వీఓఏకు రూ.20 లక్షల బీమా సౌకర్యం కల్పించాలి.

క్షేత్రస్థాయి ఆన్‌లైన్ పనుల కోసం ట్యాబ్‌లు, ఇంటర్నెట్ సౌకర్యం ఉచితంగా అందించాలి.

### వీఓఏలకు సంబంధించిన 58 జీఓను సవరించాలి.

ఉద్యోగ భద్రతతో కూడిన స్పష్టమైన జాబ్ చార్ట్ ఇవ్వాలి. "గౌరవ వేతనం వద్దు –– కనీస వేతనం కావాలి", "ఉద్యోగ భద్రత మా హక్కు –– జాబ్ చార్ట్ ఇవ్వాలి" అంటూ గ్రామ దీపికలు చేసిన నినాదాలతో సమ్మె ప్రాంగణం మార్మోగింది.

### దీక్షాపరులకు అండగా కాసాని దంపతులు.

దీక్షలో పాల్గొంటున్న మహిళా ఉద్యోగుల కోసం కాసాని నాగ శేషా పద్మ –– కాసాని చంద్రమోహన్ దంపతులు భోజన వసతి ఏర్పాటు చేయడంతో పాటు మండుటెండల తీవ్రత దృష్ట్యా కొబ్బరి నీళ్లు పంపిణీ చేశారు. మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా స్వయంగా పర్యవేక్షించడంతో పలువురు వారి సేవలను అభినందించారు. ఈ సంఘీభావ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, జేఏసీ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో గ్రామ దీపికలు పాల్గొన్నారు.

## కుక్కకాటుతో మహిళ మృతి చెందడం అత్యంత బాధాకరం

- బాధిత నిరుపేద కుటుంబాన్ని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలి.
- వీధి కుక్కల నివారణకు అధికారులు తక్షణమే కఠిన చర్యలు చేపట్టాలి.
- ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలి.
- సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్ పాషా.



భద్రాద్రి కొత్తగూడెం / లక్ష్మీదేవిపల్లి / మే 26 / అక్షరం న్యూస్ –: : కుక్కకాటుతో మహిళ మృతి చెందడం అత్యంత బాధాకరమని, బాధిత నిరుపేద కుటుంబాన్ని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్ పాషా డిమాండ్ చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలం చాతకొండ ఎస్సీ కాలనీ, చాటివారిగూడెం గ్రామపంచాయతీకి చెందిన మారె రాములమ్మ (50) అనే మహిళ కుక్కకాటుతో మృతి చెందగా, మంగళవారం ఆమె భౌతికకాయాన్ని ఆయన సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వీధి కుక్కల సంచారం విపరీతంగా పెరిగిపోయిందని, కుక్కకాటు వల్ల ప్రజల ప్రాణాలకు రక్షణ లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాములమ్మ మృతి పట్ల తన గాఢ సంతాపాన్ని ప్రకటిస్తూ, ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి వీధి కుక్కల నివారణకు గట్టి చర్యలు చేపట్టాలని, బాధిత కుటుంబానికి ప్రభుత్వం తగిన ఆర్థిక సహాయం అందించి అండగా నిలవాలని ఆయన డిమాండ్ చేశారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం శాసనసభ్యులు కోణంనేని సాంబశివరావు మృతురాలి కుటుంబ సభ్యులను ఫోన్లో పరామర్శించి సంతాపాన్ని తెలిపారు. కాగా నివాళులర్పించిన వారిలో జ్యోతిబసు, పిచ్చయ్య, మిరియాల రాము, లక్ష్మయ్య, జాన్సన్, క్రాంతి, రాజేష్ కళ్యాణ్ జ్ఞానముత్యం తదితరులు ఉన్నారు.

## తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి సారించాం

- కూనంనేని సహకారంతో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపెడతాం.
- ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడం మా బాధ్యత.
- 12వ డివిజన్లో తాగునీటి సమస్యలు పునరావృతం కాకుండా ఒకేదఫా మూడు బోర్లు మంజూరు.
- ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాం.. ఏ సమస్య వచ్చినా ముందుండి పరిష్కరిస్తాం.
- కార్పొరేషన్ పరిధిలోని ప్రజల సేవ చేయడమే ఏకైక ధ్యేయం.
- కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్.

భద్రాద్రి కొత్తగూడెం/కొత్తగూడెం / మే 26 / అక్షరం న్యూస్ –:





కార్పొరేషన్ ప్రజలకు తాగునీటి సమస్యల నుంచి శాశ్వత ఉపశమనం కల్పించే దిశగా కీలక చర్యలు కొనసాగుతున్నాయని కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ అన్నారు. కొత్తగూడెం పట్టణ పరిధిలోని 12వ డివిజన్ భగత్‌సింగ్‌నగర్‌లో మంగళవారం ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేందుకు ఏర్పాటు చేసిన మూడు నూతన బోర్లను మేయర్ మూడ్ గణేష్ ముఖ్య అతిథిగా విచ్చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడం తమ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. స్థానిక శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు సహకారంతో కొత్తగూడెం పట్టణ అభివృద్ధికి మరిన్ని ప్రజాహిత కార్యక్రమాలు చేపడుతున్నామని, తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ముఖ్యంగా 12వ డివిజన్, భగత్‌సింగ్‌నగర్ ప్రజలకు తాగునీటి సమస్యలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కార చర్యలు కొనసాగిస్తామని పేర్కొన్నారు. అలాగే తాము ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని, ఏ సమస్య వచ్చినా ముందుండి పరిష్కరిస్తామని చెప్పారు. ప్రజాసేవే తమ ధ్యేయమని, ఇందుకోసం నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్పొరేషన్ను అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని, ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలను సమకూరుస్తామని వివరించారు. కార్యక్రమంలో సిపిఐ టౌన్ కార్యదర్శి కంచర్ల జమలయ్య, నాయకులు నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, నాయకులు భవాని ప్రసాద్, సాంబిరెడ్డి, 12వ డివిజన్ కార్పొరేటర్ నాగలక్ష్మి, 53వ డివిజన్ కార్పొరేటర్ బండి నరసింహారావు, 49వ డివిజన్ కార్పొరేటర్ విజయ్ కుమార్, 12వ డివిజన్ భగత్‌సింగ్‌నగర్ ప్రజలు, కొత్తగూడెం కార్పొరేషన్ మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## మే 28 గురువారం నాడు బక్రీద్..

- రాష్ట్ర మైనారిటీ నాయకులు నయీమ్ ఖురేషి.



భద్రాద్రి కొత్తగూడెం/ కొత్తగూడెం/ మే 26 / అక్షరం న్యూస్ -: నయీమ్ ఖురేషి ఒక ప్రకటనలో మాట్లాడుతూ గురువారం 28వ తారీఖున బక్రీద్ పండుగని జిల్లా ముస్లిం సోదరులందరికి బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నయీమ్ ఖురేషి మాట్లాడుతూ ఓల్డ్ డిపో బైతుల్లాహ్ మసీదులో పండుగ నామాజు ఉదయం 6.30 గంటలకని, కొత్తగూడెం ఈద్ గాహ్ లో ఉదయం 7.30 గంటలకని అదేవిధంగా నియోజకవర్గంలోని మసీదులు మరియు ఈద్ గాహ్ లలో ఉదయం 9 గంటల లోపే బక్రీద్ నమాజు జరుగునని ఎండ తీవ్రతను గమనించి ప్రజలు సకాలంలో నమాజ్ కు చేరుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి , సీనియర్ సివిల్ జడ్జ్ కళార్చన.




పెద్దపల్లి జిల్లా/ పెద్దపల్లి టౌన్ / మే 26/ అక్షరం న్యూస్ -:

విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి అని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి కళార్చన అన్నారు. జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రం లోని బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమ్మర్ క్యాంప్ లోని విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి విద్యార్థులకు పోక్సో చట్టం, బాల్యవివాహాల నిర్మూలన చట్టం, మోటార్ వాహనాల చట్టం, బాల కార్మికుల నిర్మూలన చట్టం మరియు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ కృష్ణయ్య, మహానంది ఏ. ఎం. ఓ., పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉమాదేవి, నిరీష ఆర్ట్ టీచర్, ప్రతాప్ రెడ్డి సి.ఎం.ఓ, మల్లేష్ స్కూల్ అసిస్టెంట్ మరియు బాల సదన్ ఇంచార్జ్ లావణ్య పాల్గొన్నారు.

## విపత్కర పరిస్థితుల్లో అండగా ఉంటాం

- రహీమ్ బ్లడ్ ఆర్గనైజర్ రక్తదాత వెంకటేష్.




మంచిర్యాల జిల్లా/ మందమర్రి/ మే 26/ అక్షరం న్యూస్ -:

మంచిర్యాల పట్టణం లో ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న ఒక మహిళకు అత్యవసరంగా బి నెగెటివ్ రక్తం అవసరం కాగా రహీమ్ బ్లడ్ ఆర్గనైజర్ కి సమాచారం అందించగా వెంటనే ఓల్డ్ మంచిర్యాలకు చెందిన వెంకటేష్ వెంటనే స్పందించి మంచిర్యాల జనని బ్లడ్ బ్యాంక్‌కు చేరుకొని తన అమూల్యమైన రక్తాన్ని దానం చేసి ఒక ప్రాణాన్ని కాపాడారు.

అరుదైన బి నెగెటివ్ రక్తగ్రూప్ కలిగిన వెంకటేష్ ఇప్పటివరకు 37వ సారి రక్తదానం చేసి 37 మందికి ప్రాణదాతగా నిలవడం అభినందనీయమన్నారు. ఎయిర్టెల్ కంపెనీ ప్రతినిధులు మరియు రహీమ్ బ్లడ్ ఆర్గనైజర్ రహీమ్ కొనియాడారు. ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త రహీమ్, కుటుంబ సభ్యులు మరియు బ్లడ్ బ్యాంక్ సిబ్బంది వెంకటేష్ ని అభినందించారు.

రహీమ్ మాట్లాడుతూ, యువత అత్యవసర పరిస్థితుల్లో ముందుకు వచ్చి రక్తదానం చేయాలని, ముఖ్యంగా ఈ ఎండాకాలంలో రక్త కొరత తక్కువగా ఉన్నందున ప్రతి ఆరోగ్యవంతుడు మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేసి ప్రాణాలను కాపాడాలని కోరారు.

# రచ్చబండతో ప్రజలకు చేరువైన ఎమ్మెల్యే జారే





- గిరిజన రైతులు, విద్యార్థులకు సంక్షేమ కార్యక్రమాల వరం.
- మద్దులమడలో ప్రజా రచ్చబండ నిర్వహణ.
- ప్రజల సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే.
- పోడు రైతులకు విద్యుత్ లైన్ సౌకర్యం ప్రారంభం.
- ఉచిత బోర్ మోటార్ల పంపిణీ.
- గిరిజన విద్యార్థులకు ఉచిత ల్యాప్‌టాప్‌ల పంపిణీ.

భద్రాద్రి కొత్తగూడెం/ అశ్వారావుపేట / మే 26 / అక్షరం న్యూస్ -:

అశ్వారావుపేట మండలంలో శాసనసభ్యులు జారే ఆదినారాయణ విస్తృతంగా పర్యటించి ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు గిరిజనుల సమగ్రాభివృద్ధికి దోహదపడే పలు సంక్షేమ కార్యక్రమాలను ప్రారంభించారు.

### మద్దులమడలో ప్రజా రచ్చబండ

మద్దులమడ గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రామ సభ (రచ్చబండ)లో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రజల మధ్య కూర్చొని వారి సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని, గ్రామాల్లో మౌలిక వసతుల కొరత లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు.

### నల్లబడులో పోడు రైతులకు అండగా

గిరిజన పోడు రైతుల అభివృద్ధికి ఎమ్మెల్యే చర్యలు చేపట్టారు. ఎస్టీ లబ్ధిదారుల పోడు భూములకు నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్ సౌకర్యాన్ని ప్రారంభించారు. రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా ఉచితంగా బోర్ మోటార్లను పంపిణీ చేశారు. ఈ చర్యలతో పోడు భూముల్లో సాగు మరింత అభివృద్ధి చెందనుందని తెలిపారు. గిరిజన విద్యార్థులకు డిజిటల్ విద్య కోసం ఉచిత ల్యాప్‌టాప్‌లుగిరిజన విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఉన్నత విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు ఎమ్మెల్యే ఉచిత ల్యాప్‌టాప్‌లను అందజేశారు. సాంకేతిక పరిజ్ఞానంతో విద్యార్థులు ప్రపంచంతో పోటీపడి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ ఐఏఎస్, అశ్వారావుపేట మున్సిపాలిటీ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిన్నశెట్టి సత్యనారాయణ, మాజీ మండల అధ్యక్షుడు తుమ్మా రాంబాబు, ఎంఆర్వో, ఎంపీవో రామకోటి రెడ్డి, సర్పంచులు చిప్పల పండు రెడ్డి, సత్యం లక్ష్మి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు జీవితంలో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి

- ఐ వి ఎఫ్ ఆధ్వర్యంలో ప్రతిభ పురస్కారా ల అందజేత.
- విద్యార్థులను అభినందించిన ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ శ్రీమతి కల్వ సుజాత గుప్త.
- ఐవిఎఫ్ జాతీయ సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్ గుప్త.
- జైళ్ల శాఖ హైదరాబాద్ రేంజ్ డీఐజీ డాక్టర్ దుద్దెల శ్రీనివాస్




కామారెడ్డి జిల్లా/ ఎల్లారెడ్డి/మే 26/అక్షరం న్యూస్:ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ (ఐ వివిఫ్) కామారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో కా మారెడ్డి జిల్లా కేంద్రంలో లక్ష్మీదేవి గార్డెన్స్ లో జిల్లా వ్యాప్తంగా పదవ తరగతిలో 550 కి పైగా మార్కులు సాధించిన ఆర్యవైశ్య వి ద్యార్థుల కోసం నిర్వహించిన ఉత్తమ వైశ్య విద్యార్థుల అభినందన సభ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉప్పల శ్రీనివాస్ గుప్త, తెలం గాణ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ శ్రీమతి కల్వ సుజాత గుప్త, జైళ్ల శాఖ హైదరాబాద్ రేంజ్ డిఐజి డాక్టర్ దుద్దెల శ్రీనివాస్ గుప్త హాజర య్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూవిద్యార్థులు జీవితంలో ఉన్నత లక్ష్యా లను నిర్దేశించుకోవాలని, ఆ లక్ష్యాలను సా ధించుకోవడం కోసంనిరంతరం కృషి చేయా లని, అప్పుడే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవడం జరుగుతుందని అన్నారు. ప్ర స్తుత పోటీ పరిస్థితుల్లో ప్రతిమార్కు కూడా విలువైనదని అన్నారు. బట్టి పద్ధతిలో కా కుండా ప్రతి విషయాన్ని అవగాహనచేసుకుం టేనే ఉత్తమ




ఫలితాలను సాధించవచ్చుని అన్నారు. మార్కులతో పాటుగా ఆధ్యాత్మిక భావన,సామాజిక సేవలో భాగస్వాములు అయినప్పుడే జీవితం సంతోషదాయకంగా ఉంటుందనే విషయాన్ని తల్లిదండ్రులు త మ పిల్లలకు తెలియజెప్పాలని సూచించా రు. ఐవిఎఫ్ ఆధ్వర్యంలో మొట్ట మొదటిసా రిగా జిల్లా స్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన ఆర్యవైశ్య విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు అందజేయడం అభినందనీ యమని అన్నారు. జిల్లావ్యాప్తంగా 56 మం ది విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐవిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పబ్బ చంద్రశేఖర్, ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ బా లు,రాష్ట్ర ఉపాధ్యక్షులు చిలువేరి మారుతి ,యువజన విభాగం రాష్ట్ర నాయకులు నరే శ్,నవీన్,జిల్లా అధ్యక్షులు ఎర్రం చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి దొంతి సుధాకర్, కోశాధి కారి కస్వవెంకటేష్,మహిళా విభాగం అధ్య క్షురాలు బుక్క రజని,ప్రధాన కార్యదర్శి చి లువేరి మారుతి, కోశాధికారి గజవాడ రవి అన్నపూర్ణ,ఆధ్యాత్మిక విభాగం అధ్యక్షులు ఎల్లంకి సుదర్శన్, ఎర్రం విజయ్ కుమార్, యువజన విభాగం అధ్యక్షులు ఎర్రం ఈశ్వ ర్ సలహాదారులుశనిశెట్టి శ్రీనివాస్,మందు ల రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

## పిల్లలను ఫోన్‌ల నుంచి దూరంగా ఉంచేందుకు ఈ చిన్న సూచనలు పాటించండి

ప్రస్తుతం పిల్లల చేతిలో మొబైల్ ఫోన్ కనిపించడం చాలా సాధారణంగా మారిపోయింది. అయితే పిల్లలు ఫోన్ వైపు ఆకర్షితులు కావడం వాళ్లు అలసత్వంగా ఉండటం వల్ల కాదని తక్షణ వినోదం, వెంటనే దృష్టి మళ్లించే సాధనం, తక్కువ శ్రమతో ఎక్కువ ఉత్సాహం ఇచ్చే మార్గం కావడంతో స్క్రీన్‌లకు పిల్లలు త్వరగా అలవాటు పడుతున్నారని నిపుణులు చెబుతున్నారు. క్రమంగా ఈ అలవాటు పెరిగితే నిజ జీవిత ఆటలు, నెమ్మదిగా జరిగే కార్యకలాపాలు పిల్లలకు ఆసక్తికరంగా అనిపించవని నిపుణులు చెబుతున్నారు. అయితే పిల్లలను ఫోన్‌కు దూరంగా ఉంచేందుకు ఖరీదైన ఆట వస్తువులు అవసరం లేదని, చిన్న చిన్న అలవాట్లే సరిపోతాయని సూచిస్తున్నారు. పిల్లలను ఫోన్ కు దూరంగా ఉంచే కొన్ని అలవాట్ల గురించి వారు వివరిస్తున్నారు.

### ఏదైనా తయారు చేయించాలి..

పిల్లలకు తమ చేతులతో ఏదైనా తయారు చేసే అవకాశం ఇవ్వడం చాలా మంచిదని నిపుణులు చెబుతున్నారు. కాగితాలు, రంగు పెన్సిళ్లు, మట్టి, కార్డ్‌బోర్డ్ ముక్కలు లేదా ఇంట్లో ఉండే సాధారణ వస్తువులతోనే పిల్లలు కొత్త కొత్త వస్తువులు తయారు చేయగలుగుతారు. పేపర్ విమానం, చిన్న ఇల్లు, మట్టి బొమ్మ లేదా బ్లాక్స్‌తో నిర్మాణాలు చేయడం వంటి పనులు పిల్లల్లో సృజనాత్మకతను పెంచుతాయి. ఇలా ఏదైనా స్వయంగా తయారు చేసినప్పుడు వారికి కలిగే ఆనందం స్క్రీన్‌ల కంటే ఎక్కువకాలం నిలుస్తుంది. పిల్లల్లో ఉన్న శక్తిని బయటకు తీసుకురావడానికి శారీరక కదలికలు చాలా అవసరం.



చిన్న నడక, బంతి ఆటలు, సంగీతానికి డ్యాన్స్ చేయడం లేదా ఇంట్లోనే చిన్న అడ్డంకుల ఆటలు నిర్వహించడం వల్ల పిల్లల్లో ఉత్సాహం పెరుగుతుంది. శరీరాన్ని కదిలించడం వల్ల ఒత్తిడి తగ్గి, ఏకాగ్రత మెరుగుపడుతుంది. ఎక్కువసేపు స్క్రీన్ ముందు కూర్చున్న పిల్లలతో పోలిస్తే పరుగులు తీసిన పిల్లలు మరింత చురుకుగా ఉంటారని పేర్కొంటున్నారు.

### ఇంట్లో బాధ్యతలు అప్పగించాలి..

ఇంట్లో చిన్న చిన్న బాధ్యతలు అప్పగించడం కూడా పిల్లలకు ఎంతో ఉపయోగకరమని నిపుణులు చెబుతున్నారు. కూరగాయలు సర్దడం, మొక్కలకు నీళ్లు పోయడం, పుస్తకాలు అమర్చడం, టేబుల్ సెట్ చేయడం వంటి పనులు పిల్లల్లో బాధ్యతాభావాన్ని పెంచుతాయి. పెద్దలకు ఇవి చిన్న పనుల్లా అనిపించినా పిల్లలకు మాత్రం తాము కుటుంబంలో భాగమన్న భావన కలుగుతుంది. పిల్లలతో కలిసి చదవడం కూడా మంచి అలవాటుగా చెప్పవచ్చు. కథలు వినిపించడం, పుస్తకాలు కలిసి చదవడం లేదా పిల్లలతో మారుమారుగా చదవించడం వల్ల వారిలో ఊహాశక్తి పెరుగుతుంది. స్క్రీన్‌లతో పోలిస్తే పుస్తకాలు పిల్లలను ఆలోచింపజేస్తాయని, కథల ప్రపంచంలోకి తీసుకెళ్తాయని నిపుణులు చెబుతున్నారు. వంటగదిలో పిల్లలను భాగస్వామ్యం చేయడం కూడా మంచి మార్గం. పండ్లు కడగడం, పిండి కలపడం, తేలికపాటి వంట పనుల్లో సహాయం చేయడం వంటి పనులు పిల్లలకు ఆసక్తిని కలిగిస్తాయి. చేతులతో ఏదైనా చేసి చివర్లో తాము తయారీలో భాగమైన ఆహారం చూడటం పిల్లలకు సంతృప్తిని ఇస్తుంది.

### ప్రకృతిలో గడపనివ్వాలి..

ప్రకృతికి దగ్గరగా తీసుకెళ్లడం కూడా పిల్లల్లో మార్పు తీసుకురాగలదని నిపుణులు చెబుతున్నారు. పార్కులకు తీసుకెళ్లడం, మొక్కలు నాటించడం, ఆకులు సేకరించడం లేదా పక్షులను గమనించడం వంటి పనులు పిల్లల్లో ప్రశాంతతను పెంచుతాయి. ప్రకృతి పిల్లలను నెమ్మదిగా ఆలోచించేలా చేసి చుట్టూ ఉన్న ప్రపంచాన్ని గమనించే అలవాటు పెంచుతుంది. పిల్లలతో సరదాగా మాట్లాడటం కూడా ఒక మంచి వినోదంగా మారుతుంది. ఈ రోజు ఏం కొత్తగా చూశావు?, నీకు ఏదైనా కనిపెట్టే అవకాశం వస్తే ఏం కనిపెడతావు? వంటి ప్రశ్నలు అడగడం ద్వారా పిల్లలు తమ ఆలోచనలు పంచుకుంటారు. ఇలా మాట్లాడటం వల్ల పిల్లలు తాము ముఖ్యమైనవారమన్న భావన పొందడంతో పాటు, ప్రతి సారి వినోదం కోసం స్క్రీన్‌లపై ఆధారపడాల్సిన అవసరం తగ్గుతుంది.

## చల్లగా చూడమ్మ రేణుక ఎల్లమ్మ తల్లి..

- ఏడు అంతరాల బోనం సమర్పించిన నోముల సమ్మయ్య..



హనుమకొండ జిల్లా/భీమదేవరపల్లి/మే 26/అక్షరం న్యూస్–:

హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం మల్లారం గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం బోనాల పండుగ భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ఎల్లమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నోముల సమ్మయ్య కుటుంబ సభ్యులు అమ్మవారికి ఏడంతరాల బోనం సమర్పించగా, గోపగాని వెంకటయ్య కుటుంబీకులు ఘటం కుండను సమర్పించారు. అలాగే గంగారపు ఎల్లయ్య కుటుంబ సభ్యులు మాత బోనం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో బోనాలు ఎత్తుకొని ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సమర్పించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గౌడ సంఘం అధ్యక్షుడు చింతరాజు మాట్లాడుతూ ప్రతి ఏటా గ్రామ ప్రజల సహకారంతో అమ్మవారికి బోనాలు సమర్పిస్తూ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ముందుగా అమ్మవారికి కళ్యాణం నిర్వహించి. అనంతరం సాయంత్రం ఏడంతరాల బోనం సమర్పించడం ఆనవాయితీగా కొనసాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఎల్లమ్మ తల్లికి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

## కంకర పోసి వదిలేసిన రోడ్డు

- నరకయాతన పడుతున్న ముల్కనూర్ బీసీ కాలనీ వాసులు.



హనుమకొండ జిల్లా/భీమదేవరపల్లి/మే 26/అక్షరం న్యూస్–:

హనుమకొండ జిల్లా భీమదేవరపల్లిమండలంలోనిముల్కనూర్ఎస్బీఐ బ్యాంక్ నుంచి బీసీ కాలనీకి వెళ్లే బీటీ రహదారి పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి చెందిన రూ.1.35 కోట్ల నిధులతో చేపట్టిన ఈ రోడ్డు పనులను మంత్రి పొన్నం ప్రభాకర్ ఘనంగా ప్రారంభించినప్పటికీ, రెండు నెలలుగా కేవలం కంకర పోసి పనులను నిలిపివేయడంతో ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు.

### ప్రమాదాలకు కేంద్రంగా మారిన రహదారి..

రోడ్డుమీద పెద్ద పెద్ద కంకర రాళ్లు తేలి ఉండటంతో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు తరచూ బైక్‌లు స్కిడ్ అయి కిందపడుతూ గాయాలపాలవుతున్నారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, వృద్ధులు, మహిళలు నడుచుకుంటూ వెళ్లడానికే భయపడుతున్నారు. రాత్రి సమయంలో పరిస్థితి మరింత దారుణంగా మారుతోందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో రోడ్డు పూర్తిగా బురదమయంగా మారే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులను పూర్తి చేయకపోతే మరిన్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.

### పనులు ఎందుకు నిలిచిపోయాయి?

ఇంత భారీ నిధులతో ప్రారంభించిన రహదారి పనులు మధ్యలో ఎందుకు నిలిచిపోయాయనే ప్రశ్నలకు ఇప్పటివరకు అధికారుల నుంచి స్పష్టమైన సమాధానం రావడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. సాంకేతిక సమస్యలా? నిధుల కొరతా? లేక కాంట్రాక్టర్ నిర్లక్ష్యమా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### తక్షణ చర్యలు తీసుకోవాలి...

బీసీ కాలనీ ప్రజలు మాట్లాడుతూ ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని సంబంధిత అధికారులు ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించాలి. వర్షాకాలానికి ముందే పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్డు పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి మాకు ఉపశమనం కల్పించాలి అని డిమాండ్ చేశారు.

# ప్రభుత్వ విద్యార్థులకు ఏఐ -- రోబోటిక్స్ శిక్షణ...

- భవిష్యత్ సాంకేతిక రంగాలకు సిద్ధం చేస్తున్న పెద్దపల్లి జిల్లా.
- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష...

పెద్దపల్లి జిల్లా/ పెద్దపల్లి టౌన్/ మే 26/ అక్షరం న్యూస్ –:

ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల్లో సాంకేతిక పరిజ్ఞానం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), రోబోటిక్స్, డిజిటల్ నైపుణ్యాల అభివృద్ధికి నిర్వహించిన "సూపర్ సమ్మర్ కంప్యూటర్, ఏఐ & రోబోటిక్స్ లెర్నింగ్ ప్రోగ్రామ్" విశేష ఫలితాలను అందించిందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. టి-ఫైబర్ సహకారంతో ఏప్రిల్ 27 నుంచి మే 26 వరకు నెల రోజులపాటు మంథని, పెద్దపల్లి, రామగుండం, సుల్తానాబాద్ కేంద్రాల్లో ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహించగా, మొత్తం 312 మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పాల్గొని ఆధునిక సాంకేతిక అంశాల్లో శిక్షణ పొందినట్లు కలెక్టర్ వెల్లడించారు. ప్రతి కేంద్రంలో ఆరు రోజుల పాటు కంప్యూటర్ పరిజ్ఞానం, ఏఐ, రోబోటిక్స్, డిజిటల్ నైపుణ్యాలపై ప్రత్యేక తరగతులు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమం ముగింపు సందర్భంగా జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన "పెద్దపల్లి జిల్లా ఏఐ & రోబోటిక్స్ స్టూడెంట్ షోకేస్ -- 2026"లో విద్యార్థులు ప్రదర్శించిన ప్రతిభను కలెక్టర్ అభినందించారు. జిల్లాలోని నాలుగు ప్రాంతాల నుంచి ఎంపికైన విద్యార్థులు రూపొందించిన రోబోటిక్స్ నమూనాలు, ఏఐ ఆధారిత వినూత్న ప్రాజెక్టులు, డిజిటల్ ప్రజెంటేషన్లు అందరినీ ఆకట్టుకున్నాయని పేర్కొన్నారు. సాంకేతికత ఆధారిత ప్రపంచంలో పోటీని ఎదుర్కొనేందుకు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు కూడా ఆధునిక విద్యలో ముందుండాలని కలెక్టర్ ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో సృజనాత్మకత, సమస్యల పరిష్కార నైపుణ్యం, సాంకేతిక అవగాహన పెంపొందించడంలో ఇటువంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు సాంకేతిక



నైపుణ్యాలను పెంపొందించుకుని భవిష్యత్తులో ఏఐ, రోబోటిక్స్, డిజిటల్ టెక్నాలజీ రంగాల్లో ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా పరిపాలన అధికారులు, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, పలువురు ఆహ్వానిత అతిథులు పాల్గొన్నారు.

# మట్టిమాఫియాతో కుమ్మక్కైన అధికారులనూ వదలం

- జిల్లాలో మట్టిమాఫియా రాజ్యమేలుతోంది.
- మాఫియాకు డాన్ గా అధికార ఎమ్మెల్యే..
- చెరువులకు గండ్లుపెట్టి మరీ దోపిడి..
- బిజెపి జిల్లాధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి, రాష్ట్ర నాయకులు గొట్టిముక్కుల సురేష్ రెడ్డి.

పెద్దపల్లి జిల్లా/ పెద్దపల్లి టౌన్/ మే 26/ అక్షరం న్యూస్ –:

మట్టిమాఫియాతో కుమ్మక్కై రూ.కోట్ల అవినీతికి పాల్పడుతున్న ప్రజాప్రతినిధులతో సహా ప్రభుత్వ అధికారులను ఎవ్వరినీ వదిలిపెట్టే ప్రసక్తేలేదని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి, రాష్ట్ర నాయకులు గొట్టిముక్కుల సురేష్ రెడ్డి హెచ్చరించారు. మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇరువురు మాట్లాడుతూ, స్థానిక ఎమ్మెల్యే విజయరమణారావు, జిల్లా కలెక్టర్ కనుసన్నల్లోనే మట్టిమాఫియా తమదందాను యధేచ్ఛగా కొనసాగిస్తోందని తెలిపారు. మట్టి, ఇసుక మాఫియాకు ఎమ్మెల్యే డాన్ గా వ్యవహరిస్తున్నారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. జిల్లాలో ఎన్ని చెరువులకు పూడికతీత తవ్వకాలు, ఎంత మట్టి తవ్వడానికి, ఎలా తవ్వడానికి అనుమతులిచ్చారో అధికారులెవరి దగ్గరా సరైన సమాచారం లేదని మండిపడ్డారు. మట్టితవ్వకాలను అసలు ఏశాఖ పర్యవేక్షిస్తుందో కూడా తెలియని అయోమయ పరిస్తితిని కలెక్టర్ సృష్టించారని ఆరోపించారు.

### లోకల్ వేబిల్లులతో మోసం..

మట్టిని తరలిస్తున్న లారీల వద్ద లోకల్ వేబిల్లులు మాత్రమే ఉన్నాయని, అయినప్పటికి జిల్లా సరిహద్దులు దాటి వ ం ట ి ట తరలివెళ్ళిపోతున్నదని సంజీవరెడ్డి, సురేష్ రెడ్డి స్పష్టం చేశారు. మట్టిద్వారా సమకూరే ఆదాయాన్ని గ్రామానికి 25శాతం, మండలానికి 50శాతం మిగతాది జిల్లా పరిషతుకు కేటాయించాల్సి ఉన్నా, నిధులు సంభందిత ఖాతాల్లో జమకాకుండా పక్కదారి పట్టాయని తెలిపారు.




### చెరువులకు గండ్లుపెట్టిమరీ..

జిల్లాలో మట్టి మాఫియా రాజ్యమేలుతోందని చెరువులకు, కుంటలకు గండ్లుపెట్టి మరీ మట్టిని అక్రమంగా అమ్ముకుంటూ రైతుల కంట కన్నీటికి కారణమవుతున్నారని ఇరువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిమితికి మించి మట్టిని తరలిస్తున్నా సంభందిత శాఖాధికారులు గానీ, పోలీసు యంత్రాంగం చూసీచూడనట్టు వ్యవహరించడం పట్ల అభ్యంతరం తెలిపారు.

### వాటాలు పంచుకున్న తోడుదొంగలు..

బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహరరెడ్డి, ప్రస్తుత కాంగ్రెస్ ఎమ్మెల్యే విజయరమణారావు ఇద్దరూ తోడుదొంగలని గతంలో మట్టి, ఇసుక అక్రమాలపై తొడలుకొట్టిన ఇద్దరూ ఇప్పుడు వాటాలు పంచుకుంటున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. వాటాల్లో తేడాలు రావడంతోనే ఒకరిపై ఒకరు బహిరంగంగా తిట్టుకుంటున్నరని వివరించారు. దొంగలు దొంగలు ఊళ్ళు పంచుకున్నట్టు ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే మట్టిని పంచుకున్నారని ఎద్దేవా చేశారు. అధికారులు సీజ్ చేసిన లారీల వివరాలను ప్రజలకు తెలిపాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులు, ప్రజలకు అండగా బిజెపి భారీ ఉద్యమాలకు తెర్లేపుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధానకార్యదర్శి కోమల్ల మహేష్, ఉపాధ్యక్షులు అమరగాని ప్రదీప్ కుమార్, కార్యదర్శి శివంగారి సతీష్ కుమార్, సుల్తానాబాద్ మండల అధ్యక్షులు కందుల శ్రీనివాస్, బిజెపి నేత బెజ్జంకి దిలీప్ కుమార్, రామగిరి అఖిల్, బొడ్డుపల్లి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాలకులారీల

# కొరతతో రైతులకు తప్పని తిప్పలు

- లారీలు లేక వరి కొనుగోళ్లలో జాప్యం.
- కొనుగోలు కేంద్రాల్లో రైతుల పడిగాపులు.
- వర్షానికి ధాన్యం తడిసిపోతుందేమోనని ఆందోళనలో అన్నదాతలు.
- ధాన్యందించుకునేందుకు మిల్లర్ల కొర్రీలు.
- క్వింటాలుకు 5-6 కిలోలు కట్ చేస్తామని కండిషన్.
- తరుగుకు ఒప్పుకోకుంటే కాటాలు బంద్.
- అదనపుపైసలిస్తేనేకదులుతున్నసంచులు బిచూసి చూడనట్లు వ్యవహరిస్తున్న సంబంధిత అధికారులు.
- దిక్కు తోచని స్థితిలో రోడ్లపైకి వచ్చి ఆందోళన చేపట్టిన రైతులు.

కామారెడ్డి జిల్లా/ఎల్లారెడ్డి/మే 26/అక్షరం న్యూస్: ఆరుగాలం కష్టపడిపండించిన పంట అమ్ముడుపోయేదాకా అన్నదాతకు అవస్థలుతప్పడంలేదు. అమ్మకానికి తెచ్చిన పంటకు అకాల వర్షం శాపంగా మారుతుంది. యాసంగి సీజన్లో పంట బాగా పండి దిగుబడి బాగా వచ్చిందని, రైతులు సంబరపడి పంట అమ్మకానికి కొనుగోలు కేంద్రాలకు తీసుకొవస్తేనెలల తరబడి కుప్పల మీదనే రైతుకు కునుకు తీయాల్సిన దుస్థితి నెలకొంటుంది.



కొనుగోలు కేంద్రాలలో ఎటు చూసి నా ధాన్యం కుప్పలే, దానికి తోడు సమయానికి లారీలు రాకపోవడంతో కేంద్రాలవద్ద వరి బస్తాలు పేరుకు పోతున్నాయి. దీంతో రైతులు పగలంతా ఎండలో, రాత్రి అయితే విషపురుగులైన పాములు, తేళ్లను లెక్క చేయకుండా, తమ ధాన్యాన్ని కాపాడుకుంటూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇన్ని రోజులుగా ఇబ్బందులను ఎదుర్కొని విసుగు చెందిన రైతులు, మంగళవారం ఎల్లారెడ్డి మండల కేంద్రంలోని హాజీపూర్ తండాలో ధాన్యం కొనుగోలు చేసి నెలకావస్తున్న కొనుగోలు కేంద్రానికి లారీలు రాకపోవడంతో రైతులు అటు సంబంధిత అధికారులకు, రాజకీయ నాయకులకు కళ్ళు తెరిపించే విధంగా, మండుటెండలో కామారెడ్డి బిఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై ధాన్యం బస్తాలను తగుల బెట్టి నిరసన తెలుపుతూ, ధర్నాకుదిగారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గత్యంతరం లేక మిల్లర్ల నిలువు దోపిడీక తలోగ్గి5బి6 కిలోల తరుగు ఇవ్వ డానికి ఒప్పుకున్నా, సమయానికి లారీలు రావడం లేదని, ఒకవేళ లారీలువచ్చినా అదనపు పైసలు ఇస్తేనే ధాన్యం బస్తాలను తరలిస్తామని డ్రైవర్లు ఇబ్బంది పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాన రహదారిపై రైతులు బైఠాయించి రాస్తారోకో చేపట్టడంతో భారీగా ట్రాఫిక్ స్తంభించిపోయింది. విషయం తెలుసుకున్న తహసిల్దార్ ప్రేమ్ కుమార్ గిర్దావర్ శ్రీనివాస్ ఎస్ఐ రాజు తమ సిబ్బందితో వెంటనే ఘటన స్థలానికి చేరుకొని, రైతులను సముదాయించి శాంతింపజేశారు. వెంటనే లారీలను ఏర్పాటు చేసి, వారం రోజుల్లోగా పూర్తి ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తామని హామీ ఇచ్చారు. తాసిల్దార్ ఇచ్చిన హామీతో రైతులు శాంతించి ఆందోళన విరమించారు.



## శుద్ధి యురేనియం అప్పగించాల్సిందే

**ఇరాన్‌తో చర్చలపై తాజాగా ట్రంప్ వెల్లడి**



వాషింగ్టన్,మే26 అమెరికా-ఇరాన్ మధ్య జరుగుతున్న శాంతి చర్చల్లో అణు కార్యక్రమం కీలకాంశంగా మారింది. శుద్ధి చేసిన యురేనియంను వదులుకోవాలని అమెరికా కోరుతుండగా, అందుకు ఇరాన్ పూర్తిగా అంగీకరించడం లేదు. తాజాగా ఇరాన్ అణు కార్యక్రమంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ వద్ద ఉన్న అధికంగా శుద్ధి చేసిన యురేనియంను అమెరికాకు అప్పగించాలని, లేదంటే అంతర్జాతీయ పర్యవేక్షణలో పూర్తిగా ధ్వంసం చేయాలని ట్రంప్ స్పష్టం చేశారు. ఇరాన్ అణు కార్యక్రమం ప్రపంచ దేశాలకు ముప్పుగా మారే అవకాశముందని ట్రంప్ హెచ్చరించారు. అధిక శుద్ధి చేసిన యురేనియం ద్వారా అణ్వాయుధాల తయారీ సాధ్యమవుతుందని, అందుకే దీనిపై కఠిన చర్యలు అవసరమని పేర్కొన్నారు. అమెరికా జాతీయ భద్రతను కాపాడేందుకు అవసరమైతే మరింత కఠిన నిర్ణయాలు తీసుకుంటామని కూడా చెప్పారు . కాగా, తమ వద్ద ఉన్న శుద్ధి చేసిన యురేనియంను వదులుకోవడానికి ఇరాన్ అంగీకరించినట్టు వార్తలు వస్తున్నాయి. తాము అణ్వాయుధం కోసం వెంపర్లాడడం లేదని ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ ఇటీవల వ్యాఖ్యానించారు. ఇరాన్ శుద్ధి చేసిన ఆ యురేనియాన్ని అమెరికాకు అప్పగించాలని లేకపోతే నాశనం చేయాలని అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా ట్రూత్‌లో పోస్ట్ పెట్టారు. శుద్ధి చేసిన యురేనియంను నిర్వీర్యం చేసేందుకు అమెరికాకు అప్పగించాలి. లేకపోతే అటామిక్ ఎనర్జీ కమిషన్ లేక దాని సమానస్థాయి సంస్థ ఇరాన్‌తో సమన్వయం చేసుకొని.. ఒక ఆమోదయోగ్యమైన ప్రదేశంలో దానిని నాశనం చేయాలని ట్రంప్ రాసుకొచ్చారు. తన వద్ద ఉన్న శుద్ధి చేసిన యురేనియంను వదులుకోవడానికి ఇరాన్ సూత్రప్రాయంగా అంగీకరించిందని ఇప్పటికే వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఇదిలాఉంటే.. లెబనాన్‌పై ఇజ్రాయెల్ భీకర దాడులు చేసింది. 70కి పైగా హెజ్‌బొల్లా స్థావరాలను టా÷-గ్గ÷ట్ చేసింది. 10 కమాండ్ సెంటర్లు సహా ఆయుధ డిపోలను ధ్వంసం చేసినట్లు ఆ దేశ సైన్యం వెల్లడించింది.

## మహాసిమెంట్ కార్మికుల ఆందోళన


**జీతాలు పెంచాలంటూ కర్మాగారం ముందు ధర్నా**



అనకాపల్లి,మే26 ఎన్నాళ్లు చేసిన అదే కూలి ? అదే స్థాయి, తమ లాభమే కానీ కార్మికుల కష్టం పట్టదా ? అంటూ కార్మికులు నిరసన చేపట్టారు. యలమంచిలి మండలంలోని ములకలపల్లి గ్రామంలో ఉన్న మై హోమ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ వద్ద మంగళవారం కార్మికులంతా తమ విధులను ఆపేసి యాజమాన్యం తీరును నిరసిస్తూ మెయిన్ గేట్ వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సంస్థలో వేరు వేరు కాంట్రాక్టర్ల ద్వారా దాదాపు 500 మంది పైగా రోజు వారి కూలితో పని చేస్తున్నారని కార్మికులు తెలిపారు. తామంతా సంస్థలో చేరి ఎన్ని సంత్సరాలయినా అదే స్థితిలో ఉన్నామని, చేరినప్పుడు ఉన్న కూలీనే ఇప్పటికీ ఇస్తున్నారు తప్ప ఏమాత్రం పెంచలేదని చెప్పారు. ఇప్పటివరకు సంస్థలో స్కిల్డ్ రూ.703, సెమీ స్కిల్డ్ రూ.560, అన్ స్కిల్డ్ రూ.470 మాత్రమే ఇస్తూ ఎలాంటి వారంతాపు సెలవులు లేవు, అనారోగ్య సెలవులు లేవు, ఏరోజు వస్తే ఆరోజు మస్తరు పద్దతిలో నడుపుతున్నారని వివరించారు. ఈ కాంట్రాక్టు కార్మికులు ఏ స్థాయిలో చేరారో, మూడు, ఐదు, ఎనిమిది ఎన్ని సంవత్సరాలు గడిచినా అదే స్థాయిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత రెండు సంత్సరాలుగా ఎలాంటి కూలి పెంపు లేకుండా ఇటీవల రోజుకి రూ.9 పెంచుతూ, ఇది జూన్ నెల నుంచి అమలవుతుందని యాజమాన్యం ప్రకటించిందని తెలిపారు. ఈ పద్ధతి నచ్చని కార్మికులు తమ విధులు బహిష్కరించి ఉదయం నుంచి మండుటెండలోనే నిరసనలు తెలుపుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వారంతపు సెలవుతో కూడిన నెల వారి జీతం చెల్లించాలి. 2 సంవత్సరాలు దాటి పని చేస్తున్న వారిని తరువాత స్థాయికి పంపాలి. యూనియన్ ఏర్పాటుకి అవకాశం కల్పించాలని కార్మికులు కోరారు.


## ఎండల తీవ్రత మరింత పెరుగుదల

**రాష్ట్రవ్యాప్తంగా అత్యధిక ఉష్ణోగ్రతలు**




హైదరాబాద్,మే26: ఈ ఏడాది నైరుతి రుతుపవనాల రాక మరింత ఆలస్యమయ్యే పరిస్థితులు ఉన్నట్టు వాతావరణశాఖ ఒక ప్రకటనలో వెల్లడించింది. దీంతో ఎండల తీవ్రత మరింతగా కొనసాగనుంది. వరుసగా రోహిణి రెండోరోజు కూడా ఎండలు మండుతున్నాయి. నిజానికి రుతుపవనాలు ఈనెల 26న కేరళ తీరాన్ని తాకుతాయని అంచనా వేసినప్పటికీ వాతావరణ మార్పులతో, జూన్ 5నుంచి 10 వరకు నైరుతి రుతుపవనాలు ప్రవేశించే అవకాశం ఉన్నదని తెలిపింది. జూన్, జూలై, ఆగస్టు, సెప్టెంబర్‌లో ఎల్‌నినో ప్రభావంతో లోటు వర్షపాతం నమోదయ్యే సూచనలున్నట్టు హెచ్చరించింది. 20 జిల్లాల్లో 45 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదు కాగా, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా దహేగాంలో అత్యధికంగా 46.5 డిగ్రీలు, మంచిర్యాల జిల్లా దండేపల్లిలో 46.4, సూర్యాపేట జిల్లా మద్దిరాలలో 46.4, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో 46.3, ఖమ్మం జిల్లా ఏన్కూర్‌లో 46.3 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైందని తెలిపింది.రాష్ట్రంలో మరో నాలుగురోజులపాటు తీవ్రమైన ఎండలు, వడగాలులు ఉంటాయని వాతావరణశాఖ వెల్లడించింది. దీంతో ఆయా జిల్లాలకు రెడ్ అలెర్ట్ జారీ చేసినట్టు తెలిపింది.రాష్ట్రవ్యాప్తంగా వడదెబ్బ మృతుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నది. ఈ క్రమంలోనే ఆదివారం ఒక్కరోజే దాదాపు 42మంది మృతి చెందారు. ఒక్క వరంగల్‌లోనే అత్యధికంగా 20మంది మృతి చెందగా, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 10మంది, కరీంనగర్‌లో 8 మంది, నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో ఒక్కొక్కరు చొప్పున మృత్యువాతపడ్డారు. రాబోయే రోజుల్లో కూడా 43 నుంచి 46 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అధికారులు హెచ్చరించారు. సోమవారం రాష్ట్రవ్యాప్తంగా మధ్యాహ్నం వరకు ఎండలు దంచికొట్టగా, సాయంత్రం మాత్రం అక్కడక్కడ మోస్తరు వర్షాలు కురిశాయని వివరించింది. ముఖ్యంగా నల్లగొండ, వికారాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసినట్టు తెలిపింది. కామారెడ్డి, మెదక్, పెద్దపల్లి, మంచిర్యాల, ఆసిఫాబాద్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో మోస్తరు వాన కురువగా, హయత్‌నగర్, పెద్ద అంబర్‌పేట్‌లో భారీ వర్షం కురిసినట్టు పేర్కొన్నది.

# చాపకింద నీరులా ఎబోలా వ్యాప్తి !



హైదరాబాద్,మే26 ఎబోలా వణికిస్తోంది. కరోనా అంత వేగంగా కాకపో యినా మెల్లగా చాపకింద నీరులా విస్తరిస్తోంది. దీంతో ఇప్పుడు ప్రపంచ దేశాలకు కొత్త తలనొప్పి ప్రారంభం అయ్యింది. ఆఫ్రికా దేశాల నుంచి ఇతర దేశాలకు విస్తరించకుండా కట్టుదిట్టమైన చర్యలకు ఉపక్రమించారు. ఇప్పటికే ప్రపంచ దేశాలు అప్రమత్తం అయ్యాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా అన్ని దేశాలకు హెచ్చరికలు జారీచేసింది. కేవలం వారాల వ్యవధిలోనే మూడు దేశాలకు పాకిన ఎబోలా వందల మందికి సోకింది. భౌగోళికంగా కూడా ఈ వ్యాధి వ్యాపించిన ప్రదేశంలో కట్టడి చేయడం చాలా కష్టమని అంతర్జాతీయ ఆరోగ్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మనుషులకు సోకే నాలుగు రకాల ఎబోలా వైరస్‌ల్లో బుండిబుగ్యో ఒకటి. దీనిని ఉగాండాలోని ఓ పర్వత ప్రాంతంలో తొలిసారి కనుగొన్నారు. గతంలో రెండుసార్లు మాత్రమే వ్యాపించడంతో అధికారులు పెద్దగా దృష్టిపెట్టలేదు. ఫలితంగా తాజాగా వ్యాపించిన ప్రదేశంలోని ల్యాబ్ పరీక్షల్లో దీనిని గుర్తించే సౌకర్యం లేకపోవడంతో.. గుర్తించేందుకు జాప్యం జరిగింది. మొదటి దీనిని గుర్తించేందుకు నమూనాను వేల మైళ్ల దూరంలో ఉన్న గవర్నమెంట్ రీసెర్చి ల్యాబ్‌కు పంపాల్సి వచ్చింది. ఈశాన్య కాంగోలోని యుద్ధ ప్రభావిత ప్రాంతమైన ఉగాండా సరిహద్దుల్లో తొలి ఎబోలా కేసు నమోదైంది. అక్కడ ఒక హెల్త్ వర్కర్ వాంతులు, జ్వరంతో చికిత్స తీసుకొని కొన్ని రోజుల్లోనే మరణించారు. ఆ తర్వాత ఆ మృతదేహాన్ని అంత్యక్రియల కోసం ఇంటికి తరలించారు. దానిని తాకిన చాలా మందికి కొన్నాళ్లకే ఎబోలా లక్షణాలు బయటపడ్డాయి. వైరస్ సోకిన వారికి కొన్ని వారాలపాటు వ్యాధి లక్షణాలు బయటపడకపోవడంతో ఎక్కువ మందికి సోకే అవకాశం కలుగుతోంది. వ్యాధి వ్యాపించిన ప్రదేశం కాంగోలో ప్రధాన మైనింగ్ కేంద్రం కావడంతో జనాభా రద్దీ అధికంగా ఉంటుంది. దీంతో 2018లో ఎబోలా వ్యాపించిన సమయంలో దానిని కట్టడి చేయడానికి ఏకంగా రెండేళ్ల సమయం పట్టింది.ఎబోలాలో జైర్ అనే స్ట్రెయిన్ అత్యంత వేగంగా వ్యాపిస్తుంది. దీంతో పోలిస్తే బుండిబుగ్యో ఎబోలా వైరస్ కొంచెం నెమ్మదిగానే తన సంఖ్యను పెంచుతుందని పరిశోధనలు చెబుతున్నాయి. పశ్చిమాఫ్రికా ప్రాంతంలో 2014లో 11,300 మంది ప్రాణాలు తీసింది జైర్ వేరియంట్. ఇది చరిత్రలోనే అతిపెద్ద ఎబోలా వ్యాప్తి. దీంతో పోలిస్తే బుండిబుగ్యో వేరియంట్ సోకిన వారిలో 30? మంది మాత్రమే ప్రాణాలు కోల్పోయారు. కాకపోతే దీనికి ఇప్పటి వరకు ఎలాంటి వ్యాక్సిన్, చికిత్స లేకపోవడం ఇబ్బందికరంగా మారింది.ఈశాన్య కాంగోలోని ఇటూరి ప్రావిన్స్‌లో ఎబోలా వేగంగా వ్యాపిస్తోంది. రోజు రోజుకూ మృతులసంఖ్య పెరుగుతుండటంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ బుండిబుగ్యో ఎబోలాను అంతర్జాతీయ స్థాయిలో ఆందోళనకరమైన పబ్లిక్ హెల్త్ ఎమ్జ్గ÷న్సీగా ప్రకటించింది. ప్రస్తుతం కాంగో, ఉగాండ, దక్షిణ సూడాన్‌లలో వ్యాప్తి తీవ్రత ఎక్కువగా ఉన్నట్లు వెల్లడించింది. మరోవైపు భారత ప్రభుత్వం కూడా బుండిబుగ్యో ఎబోలాపై అప్రమత్తమైంది. ప్రజలు అత్యవసరమైతే తప్ప కాంగో, ఉగాండా, దక్షిణ సూడాన్ దేశాలకు ప్రయాణించవద్దని హెల్త్ అడ్వైజరీ జారీ చేసింది. ఇపపటివరకు కాంగోలో మొత్తం 867 మందికి ఈ వ్యాధి వ్యాపించగా.. 204 మరణాలు నమోదయ్యాయి. ఎబోలా ఎఫెక్ట్ భారత్‌పైనా పడింది. దేశ రాజధాని న్యూఢిల్లీలో ఈ నెలాఖరులో అత్యంత ప్రతిష్టాత్మకంగా జరగాల్సిన నాల్గవ 'ఇండియా-ఆఫ్రికా ఫోరమ్ సమ్మిట్' వాయిదా పడింది. ఆఫ్రికా ఖండంలోని కొన్ని దేశాల్లో ప్రస్తుతం కలకలం రేపుతున్న ఎబోలా వైరస్ వ్యాప్తి దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు భారత ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. మరోవైపు ముందస్తు జాగ్రత్తగా కేంద్ర ఆరోగ్య శాఖ దేశవ్యాప్తంగా అప్రమత్తత ప్రకటించింది. ముందుగా నిర్దేశిరచిన షెడ్యూల్ ప్రకారం 4వ ఇండియా-ఆఫ్రికా ఫోరమ్ సమ్మిట్ మే 28 నుంచి మే 31 వరకు న్యూఢిల్లీలో జరగాల్సి ఉంది. ఈ క్లిష్ట సమయంలో ఆఫ్రికా దేశాలకు భారత్ తన పూర్తి సంఘీభావాన్ని తెలియజేసిందని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ పేర్కొంది. 'ఆఫ్రికా సీడీసీ' నేతృత్వంలో జరుగుతున్న ప్రజారోగ్య సన్నద్ధత, అత్యవసర పరిస్థితుల నియంత్రణ ప్రయత్నాలకు భారత్ తన వంతు సాంకేతిక, వైద్య సహకారాన్ని అందించడానికి సిద్ధంగా ఉందని స్పష్టం చేసింది. ఎబోలా వ్యాప్తి నేపథ్యంలో కేంద్ర ఆరోగ్య సేవల డైరెక్టరేట్ జనరల్ అంతర్జాతీయ ప్రయాణికులకు కీలకమైన హెల్త్ అడ్వైజరీ జారీ చేసింది. ఎబోలా ప్రభావిత దేశాల నుంచి వచ్చే వారు లేదా ఆయా దేశాల మీదుగా ప్రయాణించి భారత్‌కు వచ్చే వారు ఇమ్మిగ్రేషన్ క్లియరెన్స్‌కు ముందే తమ ఆరోగ్య పరిస్థితిని అధికారులకు నివేదించాలని ఆదేశించింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ 'హై-రిస్క్'గా వర్గీకరించిన డెమొక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, ఉగాండా, సౌత్ సూడాన్ దేశాల నుంచి వచ్చే ప్రయాణికులపై ప్రత్యేక నిఘా ఉంచనున్నారు. ఎబోలా లక్షణాలు ఉన్నా లేదా బాధితులతో పరిచయం ఉన్నా ప్రయాణికులు స్వచ్ఛందంగా విమానాశ్రయ ఆరోగ్య అధికారులకు తెలపాల్సి ఉంటుంది. ప్రస్తుతానికి భారతదేశంలో ఎక్కడా ఒక్క ఎబోలా కేసు కూడా నమోదు కాలేదని అధికారిక వర్గాలు స్పష్టం చేశాయి. డబ్ల్యూహెచ్‌ఓ సూచనల ప్రకారం ప్రభుత్వం అన్ని ముందస్తు నివారణ చర్యలను తీసుకుంటోంది. అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు ఎబోలా నివారణకు అవసరమైన సన్నద్ధతతో ఉండాలని కేంద్రం ఆదేశించింది. 'ప్రభుత్వం పూర్తి అప్రమత్తంగా ఉంది. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం.. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఈ విషయంలో అధికారిక ప్రకటనలను మాత్రమే నమ్మండని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది.

## ఎబోలాపై ఆందోళన అవసరం లేదు

- **అన్ని ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నాం**
- **వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ**

హైదరాబాద్,మే26 ఎబోలా వైరస్‌పై తెలంగాణ ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎబోలా కేసులు లేవన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడా ఎబోలా లక్షణాలు ఉన్న వారిని గుర్తించలేదని పేర్కొన్నారు. ఎబోలాపై రాష్ట్ర ప్రభుత్వం హై అలర్ట్ ప్రకటించిందని తెలిపారు. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో కట్టుదిట్టమైన స్క్రీనింగ్ టెస్ట్‌లు నిర్వహిస్తున్నామని వివరించారు. ఆఫ్రికా దేశాల నుంచి వచ్చే ప్రయాణికులపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. డీఆర్సీ, ఉగాండా, దక్షిణ సూడాన్ నుంచి వచ్చే ప్రయాణికులకు థర్మల్ స్కానింగ్ చేస్తున్నామన్నారు. ఎయిర్‌పోర్ట్‌లో ప్రత్యేక వైద్య బృందాల ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గాంధీ ఆస్పత్రిలో 10 పడకల ఐసోలేషన్ వార్డు ఇప్పటికే సిద్ధంగా ఉంచామన్నారు. డాక్టర్ సునీల్ కుమార్ నోడల్ అధికారిగా నియామించినట్లు చెప్పారు. అనుమానితుల సాంపుల్స్‌ను మహారాష్ట్ర పుణెళిలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ వైరాలజీకి పంపామన్నారు. ÷దేశాల నుంచి 58 మంది ప్రయాణికులు హైదరాబాద్‌కు చేరుకున్నారన్నారు. వారిలో ఎవరికీ ఎబోలా లక్షణాలు లేవని తెలిపారు. 58 మందిని 21 రోజుల పాటు హోమ్ ఐసోలేషన్‌లో అధికారులు ఉంచారని గుర్తు చేశారు. 108 అంబులెన్స్‌లను 24 గంటలు సిద్ధంగా ఉంచామని చెప్పారు. అన్ని ప్రభుత్వాసుపత్రులు అప్రమత్తంగా ఉండాలని వైద్యులకు సూచించారు. న్ఫెక్షన్ కంట్రోల్ ప్రోటోకాల్స్ కచ్చితంగా అమలు చేయాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని అధికారులను ఈ సందర్భంగా మంత్రి హెచ్చరించారు. ప్రజారోగ్య రక్షణకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని మంత్రి దామోదర రాజనర్సింహ వెల్లడించారు.

## అర్హులంతా ఓటరు జాబితాలో ఉండాల్సిందే

- **అనర్హుల పేర్లను మాత్రమే తొలగించాలి**
- **సర్ ప్రక్రియపై ఎన్నికల అధికారి ఆదేశాలు**

హైదరాబాద్,మే26 భారత ఎన్నికల సంఘం రాష్ట్రంలో త్వరలో చేపట్టనున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పక్రియలో భాగంగా రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో ఉండేలా, అలాగే అనర్హులైన ఓటర్ల పేర్లను తొలగించేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి ఐఏఎస్ ఆదేశించారు. ఈ కార్యక్రమాన్ని పూర్తి పారదర్శకతతో నిర్వహించాలని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని బిఆర్‌కెఆర్ భవన్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి, ఐఏఎస్, అదనపు ప్రధాన ఎన్నికల అధికారి డా. వాసం వెంకటేశ్వర్ రెడ్డి, ఐఏఎస్, ఉప ప్రధాన ఎన్నికల అధికారి (ఎఫ్ఏసీ) జి.ఎస్. చారిలతో కలిసి ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిహెచ్‌ఎంసి కమిషనర్, హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి. కర్ణన్, ఐఏఎస్, మేడ్చల్?మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం. మను చౌదరి, ఐఏఎస్, సంబంధిత ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు హాజరయ్యారు. మ్యాపింగ్ పక్రియ లో బూత్ స్థాయి అధికారులు కీలక పాత్ర పోషిస్తున్నందున వారికి తగిన శిక్షణ ఇవ్వాలని సూచించారు. అలాగే పనివిధానంపై నిరంతరం సమీక్షిస్తూ, మ్యాపింగ్ పక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. అలాగే అపార్టుమెంట్స్ సముదాయాలు, గేటెడ్ కమ్యూనిటీలపై ప్రత్యేక దృష్టి సారించి సర్ పక్రియ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని సూచించారు. పట్టణ ప్రాంతాల్లో, ముఖ్యంగా మురికివాడలలో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని తెలిపారు. పక్రియను మరింత సరళీతరం చేయడానికి ఎన్యూమరేషన్ ఫారాలు ఆంగ్లం, తెలుగు భాషాల్లో అందుబాటులో ఉంటాయని తెలిపారు.

# నేటినుంచి టిడిపి మహానాడు

**వర్చువల్ విధానంలో రెండ్రోజుల పండగ**

**పార్టీ నేతలతో చర్చించిన అధినేత చంద్రబాబు**



అమరావతి,మే26 టీడీపీ మహానాడు 2026 రెండ్రోజుల పాటు జరుగనుంది. బుధ,గురువారాల్లో ఈసారి పూర్తిగా వర్చువల్ విధానంలో నిర్వహిస్తున్నారు. దీనిని వివిధ మాధ్యమాల ద్వారా ప్రసారం చేస్తారు. ఈ విషయాన్ని టిడిపి అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. టీడీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ముఖ్య నేతలు, గ్రామ స్థాయి కార్యకర్తలతో సీఎం చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మహానాడు నిర్వహణ, పార్టీ భవిష్యత్ కార్యాచరణపై కీలక దిశానిర్దేశర చేశారు. తెలుగువారు ఆసక్తిగా ఎదురు చూసే కార్యక్రమం మహానాడు అని, పార్టీకి అది ఒక భావోద్వేగమని సీఎం చంద్రబాబు అన్నారు. మహానాడు ద్వారా పార్టీ ప్రజలకు ఏ సందేశం ఇస్తుందో అన్న ఆసక్తి అందరిలో ఉంటుందని చెప్పారు. గతంలో కోవిడ్ సమయంలో కూడా డిజిటల్ పద్ధతిలో మహానాడు నిర్వహించామని గుర్తు చేశారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని మరోసారి వర్చువల్ విధానాన్నే ఎంచుకున్నామని చెప్పారు. ఇంత పెద్ద ఎత్తున వర్చువల్ రూపంలో మహానాడు నిర్వహించడం ఇదే తొలిసారి అని పేర్కొన్నారు.రాష్ట్రవ్యాప్తంగా 1845 క్లస్టర్ల పరిధిలో మహానాడు నిర్వహిస్తున్నామని తెలిపారు. పార్టీ ఎదుగుదలకు, కార్యకర్తలు నాయకులుగా ఎదగడానికి క్లస్టర్ విధానం ఉపయోగపడుతుందని వివరించారు. ఈసారి 'స్త్రీశక్తి' థీమ్‌తో మహానాడు నిర్వహిస్తున్నామని సీఎం చంద్రబాబు వెల్లడించారు. క్లస్టర్ల వారీగా క్షేత్రస్థాయిలో జరిగే మహానాడులో రాష్ట్రస్థాయి నాయకులు కూడా పాల్గొంటారని సీఎం చంద్రబాబు తెలిపారు. మహానాడులో సరైన మార్గనిర్దేశర చేసుకుని వాటిని అమలు చేయాలని సూచించారు. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీని తిరుగులేని శక్తిగా నిలబెట్టాలని పిలుపునిచ్చారు. ప్రజా ప్రతినిధులు, బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న ప్రతి ఒక్కరిలో జవాబుదారీతనం ఉండాలని.. అప్పుడే ప్రజలు విశ్వసిస్తారని అన్నారు. పార్టీ కార్యకర్తలు అన్ని విధాలా సాధికారత సాధించేలా కృషి చేయాలని సూచించారు. ఎన్టీఆర్‌కు ఘన నివాళులు అర్పించడంతో పాటు రాష్ట్రాభివృద్ధికి పునరంకితమయ్యేలా మహానాడును నిర్వహించుకుందామని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు.

# ఐపీఎల్ 2016 మ్యాజిక్ రిపీట్ అవుతుందా?



ఐపీఎల్ 2026 లీగ్ స్టేజ్ మ్యాచ్‌లు ముగిసి ప్లేఆఫ్స్ సమరానికి తెరలేవడంతో క్రికెట్ లవర్స్ ఫైనల్ పోరు కోసం మరింత ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇక సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు పాయింట్ల పట్టికలో మూడో స్థానంలో నిలిచి ఎలిమినేటర్ మ్యాచ్ ఆడేందుకు సిద్ధమైంది. ఈ సందర్భంలో ప్రతి ఒక్కరికీ పదేళ్ల కిందట ఆరెంజ్ ఆర్మీ సృష్టించిన ఒక అద్భుతమైన రికార్డు గుర్తుకు వస్తోంది. ఐపీఎల్ చరిత్రలో ఎలిమినేటర్ నుంచి వచ్చి కప్ కొట్టిన ఏకైక జట్టుగా హైదరాబాద్‌కు ఒక ప్రత్యేకమైన రికార్డు ఉంది. అయితే ఆ సీజన్‌లో హైదరాబాద్ ఎవరితో గెలిచింది, అసలు ఆ ప్లేఆఫ్స్ లెక్కలు ఏంటి, ఎవరెవరిని ఓడించుకుంటూ వచ్చి ఛాంపియన్‌గా నిలిచింది . ఐపీఎల్ 2016లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టును ఆస్ట్రేలియా స్టార్ ఓపెనర్ డేవిడ్ వార్నర్ తన అద్భుత కెప్టెన్సీతో ముందుండి నడిపించాడు. కేవలం కెప్టెన్‌గానే కాకుండా ఆ సీజన్‌లో బ్యాట్‌తోనూ రికార్డు స్థాయి పరుగులతో వార్నర్ చెలరేగిపోయాడు. ఆ ఏడాది లీగ్ దశ ముగిసేసరికి హైదరాబాద్ జట్టు పాయింట్ల పట్టికలో మూడో స్థానంలో నిలిచింది. దీంతో ఫైనల్‌కు వెళ్లడానికి కేవలం ఒకే ఒక్క అవకాశం ఉండే అత్యంత కష్టమైన ఎలిమినేటర్ దారిలో సన్‌రైజర్స్ ప్రయాణం మొదలైంది. 2016 ప్లేఆఫ్స్‌లో భాగంగా హైదరాబాద్ జట్టు తన మొదటి మ్యాచ్‌ను దిల్లీ వేదికగా కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో ఆడింది. ఈ చావో రేవో ఎలిమినేటర్ పోరులో మొదట బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ హైదరాబాద్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 162 పరుగులు చేసింది. యువరాజ్ సింగ్ వేగంగా 44 పరుగులు చేసి జట్టుకు మంచి స్కోరు అందించాడు. ఆ తర్వాత లక్ష్య చేధనలో కోల్‌కతాను భువనేశ్వర్ కుమార్, హెన్రిక్స్‌ల బౌలింగ్‌తో కట్టడి చేసిన హైదరాబాద్ జట్టు, కేకేఆర్‌ను 140 పరుగులకే పరిమితం చేసింది. 22 పరుగుల తేడాతో ఘన విజయం సాధించి క్వాలిఫైయర్-2లోకి అడుగు పెట్టింది. కోల్‌కతాను ఓడించిన జోష్‌లో ఉన్న హైదరాబాద్‌కు క్వాలిఫైయర్-2లో సురేష్ రైనా నేతృత్వంలోని గుజరాత్ లయన్స్ జట్టు ఎదురైంది. దిల్లీలోనే జరిగిన ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన గుజరాత్ లయన్స్ జట్టు 20 ఓవర్లలో 7 వికెట్లకు 162 పరుగులు చేసింది. ఆ తర్వాత 163 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన హైదరాబాద్ జట్టు ఒక దశలో 117 పరుగులకే 6 వికెట్లు కోల్పోయి తీవ్రమైన ఒత్తిడిలో పడింది. కానీ కెప్టెన్ డేవిడ్ వార్నర్ ఒంటి పోరాటం చేస్తూ 58 బంతుల్లోనే 93 పరుగులు చేసి, మరో 4 బంతులు మిగిలి ఉండగానే జట్టును గెలిపించి ఫైనల్ బెర్త్ ఖరారు చేశాడు. ఇక 2016 మే 29న బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో జరిగిన ఫైనల్ మ్యాచ్ ఐపీఎల్ చరిత్రలోనే ఒక క్లాసిక్‌గా నిలిచిపోయింది. విరాట్ కోహ్లీ భీకరమైన ఫామ్‌లో ఉన్న ఆర్సీబీని వారి సొంత మైదానంలో ఢీకొట్టడం అంటే అప్పట్లో మామూలు విషయం కాదు. ఈ హైవోల్టేజ్ ఫైనల్ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ జట్టు డేవిడ్ వార్నర్, బెన్ కటింగ్‌ల మెరుపులతో ఏకంగా 208 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఉత్కంఠ పోరులో చివరకు భువనేశ్వర్ కుమార్ అద్భుత బౌలింగ్‌తో ఆర్సీబీని కట్టడి చేసి 8 పరుగుల తేడాతో చరిత్రాత్మక విజయాన్ని, మొదటి ఐపీఎల్ ట్రోఫీని అందించాడు. అయితే పదేళ్ల తరువాత మళ్ళీ హైదరాబాద్ జట్టు అలాంటి పరిస్థితుల్లోనే ఫైనల్ సమరానికి సిద్ధమవ్వడం విశేషం. ఈ ఐపీఎల్ 2026లో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫైనల్ చేరడానికి సరికొత్త ఫైట్స్ రెడీగా ఉన్నాయి. ఆరెంజ్ ఆర్మీ తన మొదటి ఎలిమినేటర్ ఫైట్‌లో రాజస్థాన్ రాయల్స్‌తో తలపడాల్సి ఉంటుంది. లీగ్ స్టేజ్‌లో హైదరాబాద్ బ్యాటర్లు భీకరమైన ఫామ్‌లో ఉన్నందున ఈ మ్యాచ్‌లో గెలిచే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఒకవేళ ఈ మొదటి ఫైట్‌లో రాజస్థాన్‌పై గెలిస్తే, ఆ తర్వాత జరిగే క్వాలిఫైయర్ 2లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు లేదా గుజరాత్ టైటాన్స్ జట్లలో ఒకరితో హైదరాబాద్ పోరాడాల్సి ఉంటుంది. క్వాలిఫైయర్-1లో ఓడిపోయిన జట్టు ఇక్కడికి వస్తుంది కాబట్టి ఆ ఫైట్ ఎంతో ఆసక్తికరంగా మారనుంది. క్వాలిఫైయర్-2లో కూడా గెలిస్తే సన్‌రైజర్స్ హైదరాబాద్ నేరుగా ఫైనల్‌లో అడుగు పెడుతుంది. అక్కడ టైటిల్ పోరులో మళ్లీ క్వాలిఫైయర్-1లో గెలిచి ఆల్రెడీ ఫైనల్‌లో వెయిట్ చేస్తున్న ఆర్సీబీ లేదా గుజరాత్‌తోనే హైదరాబాద్ ఫైనల్ ఫైట్ చేయాల్సి ఉంటుంది. అంటే ఈసారి కూడా కప్ కొట్టాలి అంటే హైదరాబాద్ బ్యాక్ టు బ్యాక్ మూడు భారీ మ్యాచ్‌లలో గెలవాల్సిందే. ఆనాడు డేవిడ్ వార్నర్ ఆస్ట్రేలియా ప్లేయర్‌గా జట్టును ఛాంపియన్‌గా నిలబెడితే, ఇప్పుడు మరో ఆస్ట్రేలియా కెప్టెన్ ప్యాట్ కమిన్స్ ఆరెంజ్ ఆర్మీని నడిపిస్తున్నాడు. మరి హార్డ్ మ్యాచుల్లో అన్నింటిలోనూ గెలిచి ఆనాటి 2016 మ్యాజిక్‌ను కమిన్స్ సేన రిపీట్ చేస్తుందో లేదో చూడాలి మరి.

# క్వాలిఫయర్ 1లో చిత్తైన గుజరాత్.. ఫైనల్లో ఆర్సీబీ..

రెండో టైటిల్‌పై కన్నేసిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు క్వాలిఫయర్ 1లో గర్జించింది. ధర్మశాలలో ఏకపక్ష పోరులో గుజరాత్ టైటాన్స్‌పై ఘన విజయంతో ఫైనల్‌కు దూసుకెళ్లింది. రజత్ పటిదార్(93) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో రికార్డు స్కోర్ కొట్టిన ఆర్సీబీ.. జాకబ్ డఫ్ఫీ(39-3), రసిక్ దార్ సలాం(24-2), భువనేశ్వర్(28-4) విజృంభణతో గుజరాత్‌ను చిత్తు చేసి నాలుగోసారి ఫైనల్లో అడుగుపెట్టింది. ఘోర ఓటమి చవిచూసిన శుభ్‌మన్ గిల్ సేన ఎలిమినేటర్ విజేతతో క్వాలిఫయర్ 2లో తలపడనుంది.

డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మరో టైటిల్‌కు అడుగుదూరంలో నిలిచింది. 19వ సీజన్ క్వాలిఫయర్ 1లో 254 పరుగులతో అత్యధిక స్కోర్ రికార్డు బద్ధలు కొట్టిన ఆర్సీబీ.. గుజరాత్ టైటాన్స్‌ను చిత్తు చిత్తుగా ఓడించింది. కనీసం పోరాడకుండానే మ్యాచ్‌ను బెంగళూరుకు అప్పగించేసింది. పేసర్లు జాకబ్ డఫ్ఫీ (39-3) రసిక్ దార్(24-2), హేజిల్‌వుడ్(39-1)లు వికెట్ల వేటతో చెలరేగగా ప్రత్యర్థిని 162 కే కట్టడి చేసిన రజత్ పటిదార్ బృందం 92 పరుగుల భారీ విజయంతో ఫైనల్లో అడుగుపెట్టింది.



### గిల్ బౌల్డ్





ఆర్సీబీ నిలిపిన 255 పరుగుల లక్ష్యాన్ని చూసి నీరుగారిపోయిన గుజరాత్ ఛేదనలో ఆది నుంచి తడబడింది. ఓపెనర్ సుదర్శన్(14) బ్యాట్‌ను వికెట్లపై పడేసుకొని హిట్‌వికెట్‌గా వెనుదిరగగా.. భువనేశ్వర్ ఫామ్‌లో ఉన్న శుభ్‌మన్ గిల్(2)ను బౌల్డ్ చేసి గుజరాత్‌కు షాకిచ్చాడు. అనంతరం హేజిల్‌వుడ్ ఓవర్లో 4, 6, 4 బాదిన బట్లర్(29) బౌల్డయ్యాడు. రసిక్ దార్‌కు రిటర్న్ క్యాచ్ ఇచ్చి నిషాంత్ సింధు(5).. తర్వాతి బంతికే హేజిల్‌వుడ్ చేతికి చిక్కి హోల్డర్(0) చిక్కగా 51కే సగం వికెట్లు కోల్పోయింది గుజరాత్. అప్పటికే ఓటమి ఖరారవ్వగా సుందర్ తేలిపోయాడు. సహకరించేవాళ్లు లేక ఒంటరైన ఇంప్యాక్ట్ సబ్ తెవాటియా (68) పరుగుల అంతరం తగ్గించే ప్రయత్నం చేశాడు. అర్ధ శతకంతో విసిగించిన తెవాటియా 19వ ఓవర్లో పటిదార్ క్యాచ్‌తో డగౌట్ చేరాడు. సిరాజ్ చివరి వికెట్‌గా ఔటవ్వగా ఆర్సీబీ 92 పరుగులతో విజయం సాధించింది.

### చితక్కొట్టిన పటిదార్

క్వాలిఫయర్ 1లో కెప్టెన్ రజత్ పటిదార్(93 నాటౌట్) తుఫా న్ ఇన్నింగ్స్‌తో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు రికార్డు స్కోర్ కొట్టింది. విరాట్ కోహ్లీ(43), పడిక్కల్(30)లు అదిరే ఆరంభమివ్వగా.. పవర్ ప్లేలో వికెట్ నష్టానికి ఆర్సీబీ 76 పరుగులు చేసింది. అనంతరం కెప్టెన్ రజత్ పటిదార్(93 నాటౌట్) మెరుపుఇన్నింగ్స్‌తో గుజరాత్ బౌలర్లను భయపెట్టాడు. ఖేజ్రోలియా వేసిన 15వ ఓవర్లో రెండు నో బాల్స్, వైడ్, నాలుగు ఫోర్లు, సిక్సర్ కలిపి 28 రన్స్ వచ్చాయి.

కృనాల్(43), రజత్ పటిదార్(93 నాటౌట్) మూడో వికెట్‌కు 95 రన్స్ జోడించిన కృనాల్(43)ను రబడ ఔట్ చేయగా గుజరాత్ ఊపిరిపీల్చుకుంది. కానీ, పటిదార్ రెండు సిక్సర్లతో స్కోర్ రెండొందలు దాటించాడు. అంతేనా.. ప్రసిధ్ వేసిన చివరి ఓవర్లో రెండు సిక్సర్లు బాదేశాడు. గుజరాత్ చెత్త ఫీల్డింగ్ కూడా కలిసి రావడంతో ఆర్సీబీ నాకౌట్‌లో అత్యధిక స్కోర్‌తో చరిత్ర సృష్టించింది. 2023లో ముంబై ఇండియన్స్‌పై 233/3తో గుజరాత్ సాధించిన రికార్డును బెంగళూరు బద్ధలు కొట్టింది.



## చెన్నై లవ్‌స్టోరీ నుంచి నిను వదలనే ..సెకండ్ సింగిల్ విడుదల

నిమిషమైనా నిను వదలనే.. అంటూ తన మ్యూజిక్‌తో మ్యాజిక్ క్రియేట్ చేశారు మణిశర్మ. కిరణ్ అబ్బవరం ప్రధానపాత్రలో రవి నంబూరి దర్శకత్వంలో రానున్న చిత్రం 'చెన్నై లవ్‌స్టోరీ'. తాజాగా ఈసినిమా నుంచి సెకండ్ సింగిల్‌ను టీమ్ విడుదల చేసింది. 'నను నేను వదిలినా.. నిను వదలనే..' అంటూ సాగే లిరిక్స్ అనంత్ శ్రీరామ్ అందించగా.. జావెద్ అలీ తన గాత్రంతో మరోస్థాయికి తీసుకెళ్లారు. యూత్‌కు కనెక్ట్ అయ్యేలా ఉన్న ఈ పాటను తీర్చిదిద్దారు. తెలుగు సినీ పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంటున్న యువ నటి శ్రీ గౌరి ప్రియ. వరుసగా విభిన్న పాత్రలతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న ఈ తెలుగమ్మాయి ప్రస్తుతం హీరో కిరణ్ అబ్బవరంతో కలిసి 'చెన్నై లవ్ స్టోరీ' చిత్రంలో నటిస్తోంది. తాజాగా ఈ సినిమా నుంచి విడుదలైన 'వదలనే' పాట లాంచ్ ఈవెంట్‌లో శ్రీ గౌరి ప్రియ చేసిన వ్యాఖ్యలు అందరినీ భావోద్వేగానికి గురి చేశాయి. ఈ పాటలోని లిరిక్స్‌ను ఎవరికి అంకితం చేస్తారని ప్రశ్నించగా, శ్రీ గౌరి ప్రియ సమాధానం ఇస్తూ ఒక్కసారిగా భావోద్వేగానికి లోనైంది. నిజంగా చెప్పాలంటే మా అమ్మ నన్ను వదిలేసి మూడేళ్లు అయింది. కానీ తను నన్ను అసలు వదల్లేదు. నేను కూడా తనను ఎప్పటికీ వదలను. ఈ విషయం తనకు తెలుసు, నాకు తెలుసు. ఈ పాటలోని లైన్స్‌ను మా అమ్మకే అంకితం చేస్తున్నాను' అని చెప్పింది. ఆమె మాటలు విన్న వెంటనే కార్యక్రమంలో ఉన్నవారు కొద్దిసేపు నిశ్శబ్దంగా మారిపోయారు. సోషల్ మీడియాలో ఈ వీడియో వేగంగా వైరల్ అవుతోంది. మూడేళ్ల క్రితం శ్రీ గౌరి ప్రియ తల్లి వసుంధర క్యాన్సర్ కారణంగా మరణించారు. తల్లితో తనకు చాలా ఆత్మీయ అనుబంధం ఉండేదని గౌరి ప్రియ పలు సందర్భాల్లో వెల్లడించింది. ఆమెను కేవలం తల్లిగానే కాకుండా ఒక మంచి స్నేహితురాలిగా భావించేదని చెప్పింది. తల్లి మరణంతో కొంతకాలం తీవ్ర మానసిక వేదనకు గురైన ఆమె, ఆ తర్వాత మళ్లీ తన కెరీర్‌పై దృష్టి పెట్టింది. హీరో కిరణ్ అబ్బవరం ప్రధాన పాత్రలో నటిస్తున్న 'చెన్నై లవ్ స్టోరీ' చిత్రానికి రవి నంబూరి దర్శకత్వం వహిస్తున్నారు. సంగీత దర్శకుడు మణిశర్మ స్వరాలు అందిస్తున్నారు.

## కోహ్లీ సరికొత్త రికార్డు..



రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు స్టార్ బ్యాటర్, రన్ మెషిన్ విరాట్ కోహ్లీ ఖాతాలో మరో అద్భుతమైన మైలురాయి చేరింది. ఐపీఎల్ ప్రారం భమైన 2008 సీజన్ నుంచి ఆర్‌సీబీ జట్టుకు నమ్మకమైన పిల్లర్‌గా నిలిచిన కోహ్లీ, ఐపీఎల్ 2026 క్వాలిఫైయర్ 1 మ్యాచ్ ద్వారా సరికొత్త చరిత్ర సృష్టించాడు. మే 26న ధర్మశాల వేదికగా గుజరాత్ టైటాన్స్‌తో జరుగుతున్న ఈ కీలక పోరులో బరిలోకి దిగడం ద్వారా, ఐపీఎల్ చరిత్రలోనే అత్యధిక ప్లేఆఫ్స్ మ్యాచ్‌లు ఆడిన దిగ్గజాల సరసన కోహ్లీ చోటు సంపాదించుకున్నాడు. ఐపీఎల్ చరిత్రను తిరగేస్తే విరాట్ కోహ్లీ పేరిట లేని రికార్డు అంటూ లేదు. ఈ మెగా టోర్నీలో ఇప్పటివరకు అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా కోహ్లీనే అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. అతను మొత్తం 9218 పరుగులు చేసి ఎవరికీ అందనంత ఎత్తులో నిలిచాడు. అంతేకాదు, ఐపీఎల్‌లో అత్యధిక హాఫ్ సెంచరీలు (76 హాఫ్ సెంచరీలు) చేసిన రికార్డు కూడా కోహ్లీ పేరిటే ఉంది. అతని తర్వాత డేవిడ్ వార్నర్ ఉండగా, ప్రస్తుతం ఆడుతున్న యాక్టివ్ ప్లేయర్లలో కేఎల్ రాహుల్ 51 హాఫ్ సెంచరీలతో రెండో స్థానంలో ఉన్నాడు. ఈ గణాంకాలే ఐపీఎల్‌లో కోహ్లీ సృష్టించిన సామ్రాజ్యానికి అద్దం పడుతున్నాయి. తాజాగా గుజరాత్ టైటాన్స్‌తో జరుగుతున్న క్వాలిఫైయర్ 1 మ్యాచ్‌తో కలిపి విరాట్ కోహ్లీ తన కెరీర్‌లో 18వ ఐపీఎల్ ప్లేఆఫ్ మ్యాచ్ ఆడుతున్నాడు. దీనితో అతను శిఖర్ ధావన్, దినేష్ కార్తీక్, కీరన్ పొలార్డ్ వంటి దిగ్గజాల రికార్డును సమం చేశాడు. ఐపీఎల్ ప్లేఆఫ్స్‌లో అత్యధిక మ్యాచ్‌లు ఆడిన ఆటగాడిగా చెన్నై సూపర్ కింగ్స్ మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ 28 మ్యాచ్‌లతో టాప్‌లో ఉన్నాడు. ఆ తర్వాతి స్థానాల్లో రవిచంద్రన్ అశ్విన్ (24 మ్యాచ్‌లు), సురేష్ రైనా (24 మ్యాచ్‌లు), రోహిత్ శర్మ (23 మ్యాచ్‌లు), అంబటి రాయుడు (23 మ్యాచ్‌లు), రవీంద్ర జడేజా (23 మ్యాచ్‌లు), డ్వేన్ బ్రావో (19 మ్యాచ్‌లు) ఉన్నారు. ఇప్పుడు వారి వెనుకే విరాట్ కోహ్లీ కూడా చేరిపోయాడు. ఐపీఎల్ నాకౌట్ స్టేజ్‌లో విరాట్ కోహ్లీ ప్రదర్శనపై భిన్నమైన రికార్డులు ఉన్నాయి. ఆర్‌సీబీ తరఫున అతను ఇప్పటివరకు 4 ఐపీఎల్ ఫైనల్ మ్యాచ్‌లు ఆడాడు. ఫైనల్స్ లో కోహ్లీ 34.75 సగటుతో, 126.36 స్ట్రైక్ రేట్‌తో పర్వాలేదనిపించేలా రాణించాడు. అయితే ఎలిమినేటర్ మ్యాచ్‌ల విషయానికి వస్తే మాత్రం కోహ్లీ ట్రాక్ రికార్డు అంత ఆశాజనకంగా లేదు. ఆడిన 5 ఎలిమినేటర్ మ్యాచ్‌లలో అతను కేవలం 23.00 సగటు, 108.49 పేలవమైన స్ట్రైక్ రేట్‌తో పరుగులు చేశాడు. ఈ స్లో బ్యాటింగ్ కారణంగా గతంలో ఆర్‌సీబీ కొన్ని కీలక మ్యాచ్‌లలో ఓటమి పాలుకావాల్సి వచ్చింది. పాత రికార్డులు ఎలా ఉన్నప్పటికీ, ప్రస్తుత ఐపీఎల్ 2026 సీజన్‌లో మాత్రం విరాట్ కోహ్లీ వీరవిహారం చేస్తున్నాడు. ఈ సీజన్‌లో ఆడిన 14 లీగ్ మ్యాచ్‌లలో అతను 50కి పైగా అద్భుతమైన సగటుతో, 162.03 స్కై-హై స్ట్రైక్ రేట్‌తో పరుగుల వరద పారించాడు. ఆర్‌సీబీ జట్టు వరుస విజయాలతో ప్లేఆఫ్స్ క్వాలిఫైయర్ 1 కి చేరుకోవడంలో కోహ్లీ బ్యాటింగే ప్రధాన బలమైంది. ఇదే ఫామ్‌ను గుజరాత్‌పై కూడా కొనసాగించి, ఆర్‌సీబీని ఫైనల్‌కు చేర్చడమే లక్ష్యంగా కింగ్ కోహ్లీ బరిలోకి దిగాడు.

## రియాన్ పరాగ్, వైభవ్ సూర్యవంశీ మధ్య కోల్డ్ వార్..?



ఐపీఎల్ 2026 ప్లేఆఫ్స్ ఉత్కంఠ రేపుతున్న వేళ రాజస్థాన్ రాయల్స్ క్యాంప్‌లో తీవ్ర కలకలం రేగింది. మైదానంలో పరుగుల వరద పారిస్తున్న సంచలన బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ, జట్టు కెప్టెన్ రియాన్ పరాగ్ మధ్య విభేదాలు భగ్గుమన్నట్లు సోషల్ మీడియాలో ఒక వీడియో వైరల్‌గా మారింది. ముంబై విమానాశ్రయంలో ఇద్దరు ఆటగాళ్ల మధ్య జరిగిన ఈ ఆసక్తికర ఘటనే ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, సన్‌రైజర్స్ హైదరాబాద్, గుజరాత్ టైటాన్స్ తర్వాత ఈ ఏడాది ప్లేఆఫ్స్ చేరిన నాలుగో జట్టుగా రాజస్థాన్ రాయల్స్ నిలిచింది. బుధవారం న్యూ చండీగఢ్ వేదికగా సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరగబోయే ఎలిమి నేటర్ మ్యాచ్ కోసం జట్టు ముంబై నుంచి చండీగఢ్‌కు విమానంలో ప్రయాణమైంది. లీగ్ దశ చివరి మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్‌ను ఓడించిన ఉత్సాహంలో ఉన్న రాయల్స్ ఆటగాళ్లు విమానాశ్రయానికి చేరుకున్నప్పుడు ఈ వివాదం చోటుచేసుకుంది. ముంబై అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆటగాళ్ల ఫొటోలను తీసేందుకు మీడియా ప్రతి నిధులు, ఫోటోగ్రాఫర్లు ఎగబడ్డారు. ఈ క్రమంలో ఒక ఫోటోగ్రాఫర్ కెప్టెన్ రియాన్ పరాగ్, యువ సంచలనం వైభవ్ సూర్యవంశీలను కలిసి ఒక ఫోటో ఇవ్వాల్సిందిగా కోరాడు. దీనికి పరాగ్ తనదైన శైలిలో స్పందిస్తూ, "మేమేమీ సినిమా స్టార్లం కాదు" అంటూ ఫోటో ఇవ్వడానికి నిరాకరించాడు. పరాగ్ చేసిన ఈ వ్యాఖ్య పక్కనే ఉన్న 15 ఏళ్ల వైభవ్‌కు నచ్చలేదు. దాంతో ఆయన తన కెప్టెన్‌ను ఎంతో సీరియస్‌గా, కోపంగా చూస్తూ ఉండిపోయాడు. ఈ చూపుల యుద్ధానికి సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ కావడంతో ఇద్దరి మధ్య ఏదో నడుస్తోందనే ప్రచారం ఊపందుకుంది. ఈ సీజన్లో రాజస్థాన్ రాయల్స్ జట్టును వైభవ్ సూర్యవంశీ ఒంటిచేత్తో ముందుకు నడిపిస్తున్నాడు. కేవలం 15 ఏళ్ల వయసులోనే జస్‌ప్రీత్ బుమ్రా, పాట్ కమిన్స్, మిచెల్ స్టార్క్, సునీల్ నరైన్ వంటి ప్రపంచ స్థాయి బౌలర్లను నెట్ బౌలర్లకంటే హీనంగా బాదేస్తున్నాడు.

Printed, Published and Owned by Shaik Yacoob Pasha, Published at 7-4-29, Medarabasti Kothagudem, Bhadradri Kothagudem Districrt-507 101, Telangana. Printed at SUPHALA AKSHARAM Printers,
RNI ref.no PRESS/2026/126/7878/00001375, e-mail: aksharamnewsts@gmail.com, Editor: SHAIK YACOOB PASHA, RNI NO. TELTEL/2018/75419, e-mail: aksharamtsnews@gmail.com. Mobile : 9391690609